25-7Pg1exHMNWJQE_25-7Pg1exHMNWJQE.qxd 25/Jul/26 12:27 AM Page 1

వారాంతం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
25-7-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 175 పేజీలు: 12 వెల: 6.50



## ఎపి, కర్ణాటకకు 'రైలు' వరాలు

రూ. 1264 కోట్లతో మల్టీ ట్రాకింగ్ రైలు ప్రాజెక్టు 9లో

2028-29 నాటికి పూర్తి: కేంద్ర కేబినెట్ నిర్ణయం

రూ. 3030 కోట్లతో భవ్య రసాయన స్కీమ్‌కి ఆమోదం

వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్



## యువత స్పందనకు మోడీ ధన్యవాదాలు

### ఇన్‌స్టా విడియోలో ప్రధాని

**న్యూఢిల్లీ,జులై 24:** పేపర్ లీకేజీలను అరికట్టేందుకు ప్రభుత్వం చేపట్టనున్న చర్యలపై యువత నుంచి వచ్చిన సానుకూల స్పందనకు ప్రధాని మోడీ కృతజ్ఞతలు తెలిపారు. పేపర్ లీకేజీల నివారణకు కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తున్న కార్యాచరణపై తాను ఇన్‌స్టాగ్రామ్‌లో విడుదల చేసిన వీడియోకు యువత విశేష స్పందన తెలిపిందని ప్రధాని మోడీ అన్నారు. ఈ సందర్భంగా తమ విలువైన సూచ >>2

## పేపర్ లీక్ కేసుల్లో కఠిన శిక్షలు 2లో

పదేళ్ల జైలు, పదికోట్ల జరిమానా

బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

## రైల్వే సహాయ మంత్రి రవనీత్ సింగ్ రాజీనామా 2లో

# ధర్మేంద్ర ప్రధాన్‌పై నేడు నిర్ణయం!



శుక్రవారం న్యూఢిల్లీలో సిజెపి ప్రతినిధులు సారవ్‌దాస్, అశుతోష్‌లతో చర్చలు జరిపిన కేంద్రమంత్రులు నడ్డా, జితేంద్ర


## సిజెపి రెండు డిమాండ్లకు కేంద్రం ఓకే

### ఢిల్లీలో తీవ్రస్థాయి ఆందోళనల మధ్య కీలక చర్చలు జరిపిన కేంద్రమంత్రులు నడ్డా, జితేంద్ర

### విద్యామంత్రి రాజీనామా చేస్తేనే ఆందోళన విరమిస్తామన్న సిజెపి

**న్యూఢిల్లీ,జులై 24:** దేశవ్యాప్తంగా కొనసాగుతున్న నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై నిరసనల నేపథ్యంలో, పరీక్షలలో జరిగిన అవకతవకలకు సంబంధించిన డిమాండ్లపై పరిష్కారం కనుగొనే ప్రయత్నంలో భాగంగా శుక్రవారం ఢిల్లీలోని విఠల్‌భాయ్ పటేల్ హౌస్‌లో కేంద్ర ప్రభుత్వం, కాక్‌రోచ్ జనతా పార్టీ (సిజెపి) ప్రతినిధుల మధ్య కీలక సమావేశం జరిగింది. ప్రభుత్వం తరఫున >>2

# ఎన్‌టిఎలో భారీ ప్రక్షాళన



### 47 మంది అధికారుల తొలగింపు

పరీక్షల నిర్వహణలో సంస్కరణలకు కేంద్రం శ్రీకారం

చర్యలపై సుప్రీం ప్రశ్నించడంతో వెంటనే ప్రకటించిన ప్రభుత్వం

కొందరిపై క్రిమినల్ చర్యలు మొదలైనట్లు వెల్లడి

**న్యూఢిల్లీ,జులై 24:** జాతీయ స్థాయిలో పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయతను పెంపొందించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. వరుస పేపర్ లీక్ ఆరోపణలతో విమర్శలు ఎదుర్కొంటున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)లో భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఎన్‌టీఏలో పనిచేస్తున్న 47 మంది అధికారులు, సిబ్బందిని సేవల నుంచి తొలగించినట్లు సమాచారం. వీరిలో కాంట్రాక్ట్ ఉద్యోగులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. కొందరిపై చట్టపరమైన, క్రిమినల్ చర్యలు కూడా ప్రారంభించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఎన్‌టిఎ సంస్థలో పూర్తిస్థాయి పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్నారు. సంస్థ యొక్క పరిపాలనా నిర్మాణాన్ని పూర్తిగా మార్చి, నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు కొత్త సంస్కరణలను అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. వచ్చే ఒక నెలలో ఈ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తవుతుందని తెలుస్తోంది. ఇటీవల రాజ్యసభలో కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ ఎన్‌టీఏలో ప్రస్తుతం మొత్తం 39 శాశ్వతపోస్టులే ఉన్నాయని, అందులో 16 కొత్త పోస్టులు కూడా ఉన్నాయని వెల్లడించారు. అవసరానికి అనుగుణంగా సంస్థ తాత్కాలిక ప్రాతిపదికన అధికారులు, సిబ్బందిని నియమించుకుంటుందని ఆయన తెలిపారు. ఎన్‌టిఎ ఒక స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థగా పనిచేస్తోందని పేర్కొన్న మంత్రి సంస్థను మరింత బలోపేతం చేసేందుకు డైరెక్టర్ స్థాయిలో 8, జాయింట్ డైరెక్టర్ స్థాయిలో 8 పోస్టులను కేంద్ర స్టాఫింగ్ పథకం ద్వారా భర్తీ చేసేందుకు సృష్టించినట్లు రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో వివరించారు. కేంద్ర విద్యాశాఖ పరిధిలోని ఉన్నత విద్యా విభాగానికి అనుబంధంగా పనిచేస్తున్న ఎన్‌టిఎను 2017లో స్థాపించారు. దేశవ్యాప్తంగా ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఈ సంస్థ నిర్వహిస్తోంది. ఇదిలా ఉండగా, ఎన్‌టీఏ పనితీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర సమీక్ష నిర్వహిస్తున్నట్లు సమాచారం. పరీక్షల నిర్వహణలో ఉన్న అన్ని లోపాలను గుర్తించి, వాటిని నెల రోజుల్లో సరిదిద్దే కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. నీట్ యూజీ-2026 ప్రశ్నపత్రం లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే అవకాశం లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కాగా, నీట్ యూజీ-2026 పరీక్ష >>2

## పార్లమెంటులో ఐదోరోజునా ప్రతిష్టంభన

రాజ్యసభలో ప్రవేశపెట్టిన 'వందేమాతరం' బిల్లు, విపక్షాల నిరసన 2లో



# ముందు ముందు ఎఐ టీచర్ వస్తున్నారు..

### డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### లీప్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి: మంత్రి లోకేశ్

**పోలవరం జిల్లా ప్రతినిధి, జులై 24 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతున్నట్టు రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. పోలవరం జిల్లా (రంపచోడవరం)లో శుక్రవారం నిర్వహించిన పిటిఎం కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టి, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు క్యూ కట్టేలా చర్యలకు శ్రీకారం చుట్టినట్టు ఆయన ప్రకటించారు. ఈ విద్యా సంవత్సరంలో వివిధ ప్రైవేటు పాఠశాల నుంచి 1,10,000 మంది విద్యార్థినీ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అదనంగా చేరినట్లు ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పోలవరం జిల్లాలో వివిధ మారుమూల గ్రామాల్లో 200 పాఠశాలలకు శాశ్వత భవనాలను నిర్మించి, పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలను అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. తల్లికి వందనం ద్వారా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్య పట్ల జోష్ నింపినట్టు ఆయన ప్రకటించారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని, మళ్ళీ డి ఎస్ సి నిర్వహించి 3వేల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేస్తామని ఆయన ప్రకటించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలను స్పందించి భవిష్యత్తులో కలెక్టర్, ఐపీఎస్ ఇంజనీర్, టీచర్ ఇలా విద్యార్థుల మక్కువను బట్టి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహిం >>2

# సర్కారీ బడులకు రాజయోగం

### యేడాదిలో ప్రైవేటు స్కూళ్ల నుంచి వచ్చి చేరిన 1.10లక్షల మంది విద్యార్థులు

### హాస్టళ్లు, గురుకులాల్లో డైట్ ఛార్జీలు 10శాతం పెంపు, గిరిజన విద్యార్థులకు ఐఐటి కోచింగ్

### పోలవరం జిల్లాను రాష్ట్రంలో నం.1 చేస్తా: మెగాపేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో సిఎం చంద్రబాబు

**పోలవరం జిల్లా ప్రతినిధి,జులై 24 ప్రభాత వార్త:** పోలవరం జిల్లాను రాష్ట్రంలో నెంబర్ 1 జిల్లాగా అభివృద్ధి చేస్తామని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అల్లూరి సీతా రామరాజు నడయాడిన ఈ నేల భారత స్వాతంత్రోద్యమములో ఒక మైలు రాయి అని, అందుకే ఈ ప్రాంతం పై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రంలోనే నెంబర్ వన్ జిల్లాగా అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. శుక్రవారం పోలవరం జిల్లా పర్యాటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు హెలిప్యాడ్ వద్ద రంపచోడవరం యం. ఎల్ ఏ.మిరియాల శిరీష దేవి, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ స్వాగతం పలికారు. అక్కడ నుండి నేరుగా రంపచోడవరం జిల్లా పరిషత్ పాఠశాల వద్దకు చేరుకున్న ముఖ్య మంత్రికి విద్యార్థులు, వారి తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు. పాఠశాల ఆవరణలో ఉన్న తెలుగుతల్లి విగ్రహానికి, అల్లూరి సీతా రామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు,



శుక్రవారం రంపచోడవరం జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు, సభకు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

మంత్రి లోకేష్ విద్యార్థుల చదువు, విద్యాబోధన్, మధ్యాన భోజనం, మొక్కల పెంపకం వంటి అంశాలను చర్చించారు. ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం డబ్బులు ఖాతాల్లో జమా అయిందిలేనిది అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు నాటి సంరక్షిస్తున్న మొక్కలను పరిశీలించి చిన్నారులను అభినందించారు. ఈ సం దర్భంగా జరిగిన కార్యక్రమములో సిఎం మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని, అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు >>2

# 8 కొత్త డ్రై పోర్టులకు ఓకే

### శ్రీసిటీ, చిట్యాల సహా 9 ప్రతిపాదనలపై కేంద్రం పరిశీలన

**విజయవాడ, జులై24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతి, ఎగుమతి లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాల కల్పనపై విజయవాడ పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) శ్రీ కేశినేని శివనాథ్ (చిన్ని) పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఇన్ల్యాండ్ కంటైనర్ డిపోలు కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ల సాధారణంగా డ్రై పోర్టులు (పొడి రేవులు) అని పిలిచే అంతర్గత రేవుల విస్తరణ, వాటి మంజూరు ప్రమాణాలపై ఎంపీ శ్రీ కేశినేని శివనాథ్ ఈరోజు లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఓడరేవులు, నౌకాయానం మరియు జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ ఎంతో సానుకూలమైన లిఖితపూర్వక సమాధానాన్ని ఇచ్చారు. ఎంపీ కేశినేని శివనాథ్ అడిగిన ప్రశ్నల ఆధారంగా, దేశవ్యాప్తంగా కస్టమ్స్ (దితీ।ది) అంతర్ మంత్రిత్వకమిటీ 8కొత్త డ్రై పోర్టుల ప్రతిపాదనలకు అధికారికంగా ఆమోదం



కేశినేని శివనాథ్

తెలి పిందని, మరో 9 నూతన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం చురుగ్గా పరిశీలిస్తోందని కేంద్ర మంత్రి సభకు వివరించారు. ఎంపీ కేశినేని శివనాథ్ తెలుగు రాష్ట్రాల పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని లేవనెత్తిన ఈ ప్రశ్న ద్వారా కేంద్ర భవిష్యత్తు ప్రణాళికలు వెలుగులోకి వచ్చాయి. తెలంగాణలోని ఫతేపూర్ డ్రై పోర్టు ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అధికారికంగా ఆమోద ముద్రవేసింది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రంగానికి అత్యంత కీలకమైన శ్రీసిటీ (ఆంధ్ర ప్రదేశ్) ప్రతిపాదనతో పాటు చిట్యాల (తెలంగాణ) డ్రై పోర్టు ప్రతిపాదనలు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ చురుకైన పరిశీలన మరియు మూల్యాంకనంలో ఉన్నాయని మంత్రి తెలిపారు. >>2

**నిబంధనల సడలింపు జోనింగ్ విధానం:** కొత్త డ్రై పోర్టుల ఏర్పాటుకు

## ఎంఎంసి వైద్య విద్యార్థి ఆత్మహత్య



**విశాఖపట్నం, జులై 24 ప్రభాతవార్త:** ఆంధ్రా వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం ఫారెన్సిక్ మెడిసిన్ చదువుతున్న పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థి కాశీ మళ్ల ఠాకూర్ నాథ్ (30) పీజీ హాస్టల్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు వన్ టౌన్ పోలీస్‌లు తెలిపారు. విజయవాడ పడమటకు చెందిన హైకోర్టు న్యాయ వాది కుమారుడు ఠాకూర్‌నాథ్ ఈఏడాది ఫిబ్రవరిలో ఫస్ట్ ఇయర్ ఫారెన్సిక్ పీజీలో చేరారు. లోగడ సిద్దార్థ మెడికల్ కాలేజీలో యంబీబీయస్ చదువుతున్నప్పటి నుంచి ఠాకూర్ నాథ్ మానసిక అనారోగ్యంతో భాధ పడుతూ మందులు వాడుతూ >>2

## అమరావతి నిర్మాణం వేగంగా జరపండి

### కేంద్రమంత్రి పెమ్మసాని

**విజయవాడ.జూలై 24,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర కమ్యూనికేషన్స్ గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర ప్రజా నిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ సి.ఎన్. సురేష్, సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమరావతిలో పైప్‌లైన్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ నిర్మాణ పనుల పురోగతి, టెండర్ల ప్రక్రియ, నిర్మాణ పనుల కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. అమరావతిలో నిర్మించనున్న సెంట్రల్ గవర్నమెంట్ జనరల్ పూల్ ఆఫీస్ అకమోడేషన్ ప్రాజెక్టుకు రూ.1,299.08 కోట్ల అంచనా వ్యయంతో రాయపూడి గ్రామంలో 5.53 ఎకరాల విస్తీర్ణంలో 2,16,032 చదరపు మీటర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లను సెప్టెంబర్ మొదటి వారంలో పిలవనున్నట్లు వెల్లడించారు. ఇందులో జీ+13 అంతస్తులతో ఒక బ్లాక్, బి+10 అంతస్తులతో మరో బ్లాక్ నిర్మించనుండగా, సుమారు 8,000 మంది అధికారులు, ఉద్యోగులకు అవసరమైన కార్యాలయ వసతులు కల్పించనున్నారు. జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకమోడేషన్ ప్రాజెక్టుకు రూ.1,234.91 కోట్ల అంచనా వ్యయంతో ఇనవోలు గ్రామంలో 17 ఎకరాల విస్తీర్ణంలో 2,90,762 చదరపు మీటర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు వివరించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లను ఆగస్టు మొదటి వారంలో పిలవనున్నట్లు తెలిపారు. ఇందులో రెండు బేస్‌మెంట్‌లతో 11 టవర్లు, మొత్తం 1,504 నివాస గృహాలు నిర్మించనున్నారు. ఈ రెండు ప్రాజెక్టులను 2029 ఫిబ్రవరి నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే ఈ భవనాలు 4స్టార్ గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించబడనున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా ఇందిరా గాంధీ నేషనల్ >>2

## ఎన్‌హెచ్ 42 అభివృద్ధికి కేంద్రం నుంచి రూ.679 కోట్లు: డి.సిఎం పవన్

**విజయవాడ,జులై24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారి మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ఎన్‌హెచ్ 42 అభివృద్ధి పనుల కోసం రూ.679.71 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్‌హెచ్42 అప్‌గ్రేడేషన్‌కు భారీగా నిధులు కేటాయించడంతో ఏపీలో రహదారి కనెక్టివిటీ మరింత మెరుగుపడుతుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత ప్రయాణ సమయం తగ్గడంతో పాటు రవాణా వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్ట్ కీలకంగా మారనుందని పేర్కొన్నారు. మెరుగైన రహదారి సౌకర్యాల వల్ల పరిశ్రమలు, వ్యాపార కార్యకలాపాలు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. లక్షలాది మంది ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణ సౌకర్యం అందించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# ప్రధాని పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

### డిజిపి హరీష్ కుమార్ గుప్తా

**విజయనగరం, జులై 24 ప్రభాతవార్త:** భోగాపురంలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి ఆగస్టు 1న విచ్చేస్తున్న సందర్భంగా జిల్లా పోలీసుశాఖ ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లను రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన ఎయిర్ పోర్టు టెర్మినల్, ట్రంపెట్, మీటింగ్ నిర్వహించే ప్రజా వేదిక, వీఐపీ వాహనాలు పార్కింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలం, మీటింగ్ హాజరయ్యేందుకు ఇతర ప్రాంతాల నుండి వచ్చే వాహనాల పార్కింగ్ కు కేటాయించిన పార్కింగ్ స్థలాలను, సందర్శించి, ఏర్పాట్లును పరిశీలించి, సంబంధిత అధికారులకు డిజిపి పలు సూచనలు చేసారు. ప్రధాన మంత్రి పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ ఇబ్బందులు తలెత్తకుండా భద్రత చర్యలు



శుక్రవారం ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

చేపట్టాలన్నారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను రెగ్యులేట్ చేసేందుకు, వాహనాలకు పార్కింగ్ స్థలాల్లో నిలిపేందుకు ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని నియమించాలన్నారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చే వాహనాలను ఏ ప్రాంతంలోని పార్కింగ్ చేయాలో స్పష్టంగా మార్గ నిర్దేశం చేయాలన్నారు. ఎయిర్ పోర్టు పరిసరాలు, సభా స్థలం, పార్కింగ్ స్థలాలను మరియు ఎయిర్ పోర్టు పరిసరాల్లోని ఇతర ప్రాంతాలను క్షుణ్ణంగా యాంటీ సెబిటేజ్ తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్, ఎస్.పి.జి. భద్రత సిబ్బందితో సమన్వయంతో పని చెయ్యాలని అధికారులను డిజిపి ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుండి వచ్చే వాహనాలు పార్కింగ్ కు ప్రత్యేకంగా ఐదు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు, వీటికి అదనంగా మరో 9 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసామని జిల్లా ఎస్పీ డిజిపికి పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ప్రధాని పర్యటనకు భద్రత ఏర్పాట్లను 17 విభాగాలుగా విభజించి, భద్రత ఏర్పాట్లు చేపట్టామని, భద్రత పర్యవేక్షణకు సీనియర్ పోలీసు అధికారులను నియమిం చామన్నారు. ప్రారంభోత్సవంకు విజయనగరం, >>2

25-7pg2exHMNWJQE_25-7pg2exHMNWJQE.qxd 25/Jul/26 12:29 AM Page 1



# సర్కారీ బడులకు రాజయోగం



శుక్రవారం రంపచోడవరంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్

సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని అన్నారు. పాఠశాల విద్యాశాఖ రూపొందించిన డ్రగ్స్ వద్దు బ్రో హ్యాండ్‌బుక్‌ను ఆయన ఆవిష్కరించారు. బడి కోసం డోనర్థ్ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. పోర్టల్ ప్రారంభించిన వెంటనే రంపచోడవరం ఉన్నత పాఠశాల అభివృద్ధికి మీ సేవా ఆపరేటర్ పూర్వ విద్యార్థి చిట్టిబోయిన ఉదయ్ కుమార్ రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. నెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పారిశ్రామికవేత్త పూర్ణచంద్రరావు రూ.4 కోట్ల విరాళాన్ని ప్రకటించి ముఖ్య మంత్రికి చెక్కులను అందజేశారు. మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలో వివిధ శాఖల పనితీరును సభలో చదివి వినిపించి, చక్కటి పనితీరు కన బరిచిన అధికారులను అభినందించారు. వారికి సభికులతో చప్పట్లు కొట్టించారు. తల్లిదండ్రులిద్దరూ పిల్లల బాధ్యత తీసుకోవాలని అన్నారు. కొత్తగా జిల్లా ఏర్పడిన తర్వాత మొదటి సారి పోలవరం జిల్లాకు వచ్చానని, అందరూ ఎంతో ఉత్సాహంగా ఉన్నారని అన్నారు. మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్‌లో పాల్గొంటూ తాను కూడా ఒక టీచర్‌గా మారానని, నేర్చుకోవడానికి విద్యార్థిగా, తల్లిదండ్రులకు చెప్పడానికి మెంటర్‌గా వ్యవహరిస్తున్నానని పేర్కొన్నారు. పిల్లల బాధ్యతను తల్లి, తండ్రి ఇద్దరూ తీసుకోవాలని, తల్లిదండ్రులిద్దరూ పిల్లల భవిష్యత్తుపై శ్రద్ధ పెడితే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని అన్నారు. పేరెంట్-టీచర్స్ సమావేశాలకు తల్లులతో పాటు తండ్రులు కూడా తప్పనిసరిగా హాజరు కావాలని సూచిం చారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రజల ఆదరణ పెరుగుతోందని, ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మార్పులు ప్రారంభమయ్యాయని సీఎం అన్నారు. విద్యార్థుల మార్కులు తగ్గితే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు మార్కులు తగ్గినట్లేనని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులు వెళ్లే పరిస్థితి ఉన్నప్పటికీ, ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది చేరారని తెలిపారు. గిరిజన విద్యార్థులకు ఐఐటీ కోచింగ్ అందిస్తున్నామని, గిరిజన ప్రాంతాల్లో రెసిడెన్షియల్ పాఠశాలలను మరింత పెంచుతామని తెలిపారు. హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థుల డైట్ ఛార్జీలను 10 శాతం పెంచామని చెప్పారు. విద్యే పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే ఆస్తి అని, విద్య ద్వారానే తెలుగు వారు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు పిల్లలను భారంగా భావించే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు పిల్లలే కుటుంబానికి సంపద, ఆదాయ వనరులుగా మారుతున్నారని అన్నారు. ఎక్కువ మంది పిల్లలు ఉన్న తల్లుల ఖాతాల్లో ఎక్కువ మొత్తంలో తల్లికి వందనం నిధులు జమ అవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని, ప్రతి నెలా మొదటి తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. స్త్రీశక్తి ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2.0 ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు, సోలార్ విద్యుత్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు ఆర్థిక అసమానతలను తగ్గించేలా చర్యలు తీసుకుం టున్నామని, సంక్షేమ పథకాలతో పాటు ప్రజలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా పీ4 విధానాన్ని అమలు చేస్తున్నామని అన్నా రు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి, విద్యాశాఖ కమిషనర్ కోన శశిధర్, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్టీ కమిషన్ చైర్మన్ బుజ్జి రెడ్డి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శుక్రవారం కుంకీ ఏనుగులకు పచ్చజెండా ఊపి పార్వతీపురం జిల్లాకు పంపిస్తున్న డి.సిఎం పవన్

### కుంకీ ఏనుగులు జయంత్, అభిమన్యుకు

## స్వాగతం పలికిన డి.సిఎం పవన్

### విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో పంట పొలాలను ధ్వంసం చేస్తున్న ఏనుగులు తరిమేందుకు 'కుంకీ'లు రంగప్రవేశం

**విజయవాడ, జులై 24,ప్రభాతవార్తప్రతినిధి:** విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పంట పొలాలను ధ్వంసం చేస్తూ రైతులను భయాందోళనలకు గురిచేస్తున్న అడవి ఏనుగుల గుంపును అదుపు చేసేందుకు అటవీశాఖ కుంకీ ఏనుగులను రంగంలోకి దించింది. ఈ నేపథ్యంలో పలమనేరు నుంచి పార్వతీపురం మన్యం జిల్లాకు బయలుదేరిన జయంత్, అభిమన్యు అనే రెండు కుంకీ ఏనుగులకు మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద ఉపముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా స్వాగతం పలికారు. కుంకీ ఏనుగులకు పూలమాలలు వేసి, స్వయంగా చెరుకు గెడలను ఆహారంగా తినిపించిన పవన్ వాటికి వీడ్కోలు పలికారు. ఈ రెండు కుంకీ ఏనుగులను మొదట పార్వతీపురం మన్యం జిల్లాలోని గుచ్చిమి క్యాంపునకు తరలించి, అక్కడి నుంచి అడవి ఏనుగులు తిరుగుతున్న ప్రాంతాలకు తీసుకెళ్లి వాటిని నియంత్రించేందుకు అటవీ అధికారులు పక్కా ప్రణాళిక రూపకల్పన చేశారు. జయంత్, అభిమన్యులకు గతంలో కూడా ఇలాంటి క్లిష్టమైన ఆపరేషన్లు నిర్వహించిన అనుభవం ఉండటంతో అధికారులు మొదట వీటినే రంగంలోకి దించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

ముఖ్యంగా ఒడిశా సరిహద్దుల నుంచి ఏనుగులు రాష్ట్రంలోకి వచ్చి పంటలను నాశనం చేస్తున్నందున, ఆ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి సమన్వయం చేసుకోవాలని సూచించారు. అవసరమైతే ఒడిశా నుంచి కూడా మరి కొన్ని కుంకీ ఏనుగులను రప్పించి ఏనుగుల దాడులకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఆలోగా మన వద్ద ఉన్న కుంకీలతోనే జనవాసాల్లోకి వచ్చిన ఏనుగులను వీలైనంత త్వరగా తిరిగి అడవుల్లోకి మళ్లించేలా చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

# పార్లమెంట్‌లో ఐదో రోజూ ప్రతిష్టంభన

### రాజ్యసభలో ప్రవేశపెట్టిన 'వందేమాతరం' బిల్లు

### సోమవారానికి సభలు వాయిదా

**న్యూఢిల్లీ,జులై 24:** ప్రశ్నాపత్రం లీక్ వివాదం, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ తదితర అంశాలపై పార్లమెంట్ ఉభయ సభల్లో శుక్రవారం వరుసగా ఐదో రోజూ తీవ్ర ప్రతిష్ఠంభన నెలకొంది. లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష సభ్యుల నిరసనలతో సమావేశాలు సజావుగా సాగకుండా వాయిదా పడ్డాయి. మధ్యాహ్నం 12 గంటలకు లోక్‌సభ తిరిగి సమావేశమైన సందర్భంగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి మాట్లాడారు. నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరపడానికి ప్రభుత్వం పలుమార్లు ప్రతిపక్షంతో సంప్రదింపులు జరిపిందని తెలిపారు. ప్రతిపక్షంలోని పలువురు సభ్యులు చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ సభ్యులను కూడా చర్చకు ఒప్పించాలని రాహుల్ గాంధీకి సూచించారు. చర్చకు ముందస్తు షరతులు విధించడం, సాకులు చెప్పడం దేశ ప్రజలకు తప్పుదోవ పట్టించే సంకేతాలను పంపుతుందని రిజిజు వ్యాఖ్యానించారు. ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కఠినమైన చట్టాన్ని తీసుకురావాలని ప్రధాని నరేంద్ర మోడీ హామీ ఇచ్చారని, నిందితులపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ జరిగేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ ప్రతిపాదిత చట్టంపై కేంద్ర మంత్రివర్గం శుక్రవారం నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలిపారు. సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ తన నిరాహార దీక్షను విరమించుకున్న విషయాన్ని కూడా ప్రస్తావించారు. కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై తమ డిమాండ్‌ను కొనసాగించాయి. "ఇస్తీఫా దో" అంటూ సభలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడేందుకు ప్రయత్నించగా, సభాధ్యక్ష స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ ముందుగా మంత్రులు సభ పత్రాలను టేబుల్‌పై ఉంచిన అనంతరం అవకాశం ఇస్తానని చెప్పారు. అయితే ఆ తర్వాత సభను సోమవారం వరకు వాయిదా వేయడంతో రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం లభించలేదు. గత ఐదు రోజులుగా నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ప్రతిపక్ష నిరసనల కారణంగా లోక్‌సభ సమావేశాలు పదేపదే వాయిదా పడుతున్నాయి.

## 8 కొత్త డ్రైపోర్టులకు ఓకే

కేంద్రం అనుసరిస్తున్న వ్యూహాత్మక మార్గదర్శకాలను మంత్రి వివరించారు. లాజిస్టిక్స్ సాంద్రత ఆధారంగా రాష్ట్రాలను మూడు జోన్లుగా వర్గీకరించినట్లు పేర్కొన్నారు.

**గ్రీన్ జోన్:** లాజిస్టిక్స్ విస్తరణకు అపార అవకాశాలున్న తెలంగాణ వంటి రాష్ట్రాలను గ్రీన్ జోన్‌లో చేర్చారు. ఇక్కడ సరికొత్త పరిశ్రమలను ప్రోత్సహించేందుకు డ్రై పోర్టుల కనీస విస్తీర్ణ పరిమితిని 7హెక్టార్ల నుండి 3 హెక్టార్లకు సడలిస్తూ కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకుంది.

**బ్లూ జోన్:** పారిశ్రామికంగా ముందంజలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఈ జోన్‌లో ఉంది. ఇక్కడ పారిశ్రామిక డిమాండ్ ఎక్కువగా ఉండి, వసతులు తక్కువగా ఉన్న ప్రత్యేక ప్రాంతాలలో (శ్రీసిటీ వంటి పొజిషన్స్) కొత్త డ్రై పోర్టుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తారు.

**దూర పరిమితి:** డ్రై పోర్టుల ఆర్థిక మనుగడను కాపాడటానికి ఒకదానికి ఒకటి 100 కిలోమీటర్ల పరిధిలో కొత్త గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులను అనుమతించరు. సముద్ర ఓడరేవు నుండి 200 కిలోమీటర్లకంటే ఎక్కువ రవాణా దూరం ఉంటేనే రైల్వే అనుసంధాన ఐసీడీలకు ప్రాధాన్యత ఇస్తారు.

## ప్రధాని పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

విశాఖపట్నం, అనకాపల్లి, అరకు, పార్వతీపురం మన్యం జిల్లాల నుండి సుమారు రెండు లక్షల మంది ప్రజలు పాల్గొనే అవకాశం ఉన్నందున క్రౌడ్ మేనేజ్మెంట్ కు ప్రత్యేకంగా చర్యలు చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. సుమారు 5 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లుగా జిల్లా ఎస్పీ వివరించారు.

ఈ కార్యక్ర మంలో శాంతిభద్రతల అడిషనల్ డీజీ ఎన్. మధుసూదన రెడ్డి, విశాఖ కమీషనర్ శంకుబ్రత బాగ్చి, విశాఖ రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టి, ఐజీ కే.శ్రీకాంత్, ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ, శాంతి భద్రతల డీఐజీ ఫకీరప్ప, రోడ్డు సేఫ్టీ డీఐజీ సిహెచ్.విజయారావు, డీజీ పర్సనల్ డీఐజీ అన్బురాజన్, గ్రేహౌండ్స్ డీఐజీ అట్టాడ బాపూజీ, విజయనగరం ఎస్పీ ఎఆర్ దామోదర్, శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, పార్వతీపురం ఎస్పీ ఎస్.వి.మాధవ రెడ్డి, అనకాపల్లి తుషీర్ సిన్హా, అదనపు ఎస్పీలు పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ పి.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే సహాయ మంత్రి రవ్‌నీత్‌సింగ్ రాజీనామా: ఆమోదించిన రాష్ట్రపతి

**న్యూఢిల్లీ,జులై 24:** దేశ వ్యాప్తంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ ఢిల్లీ వేదికగా పెద్ద ఎత్తున విద్యార్థులు ఆందోళన చేస్తుండగా అనూహ్యంగా కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు రాజీనామా చేయడం ఆమోదించడం కూడా జరిగిపోయింది. ప్రధాని మోడీ సూచన మేరకు వెంటనే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రవ్‌నీత్ సింగ్ రాజీనామాను ఆమోదించారు. ఆకస్మిక పరిణామంలో రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు కేంద్ర మంత్రివర్గం నుంచి తన రాజీనామాను సమర్పించారు. రాజ్యసభ ఎంపీగా ఉన్న రవ్‌నీత్ సింగ్ పదవీకాలం జూన్‌లో ముగిసింది. మరోసారి అవకాశం దక్కలేదు. ఇదిలా ఉంటే వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పంజాబ్‌లో పోటీ చేసేందుకు రాజీనామా చేసినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం పంజాబ్‌లో ఆప్ అధికారంలో ఉంది. అయితే పంజాబ్‌లో అధికారంలోకి వచ్చేందుకు రవ్‌నీత్ సింగ్‌ను బీజేపీ రంగంలోకి దింపుతున్నట్లుగా తెలుస్తోంది. పంజాబ్‌లో బీజేపీ వ్యూహంలో భాగంగానే జరిగినట్లుగా సమాచారం.

## మోడీ ధన్యవాదాలు

నలు అందించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో విడుదల చేసిన తాజా వీడియోలో ప్రధాని మాట్లాడుతూ, "నిన్న రాత్రి మీతో మాట్లాడే అవకాశం లభించింది. నిన్న నేను పోస్ట్ చేసిన వీడియోకు మీరు ఇచ్చిన స్పందన ఎంతో సానుకూలంగా ఉంది. చాలా మంచి సూచనలు అందాయి. స్పందించిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని పేర్కొన్నారు. పరీక్షల్లో పేపర్ లీకేజీలను పూర్తిగా అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునే దిశగా ముందుకు సాగుతోందని, ఈ అంశంపై యువత నుంచి వచ్చిన అభిప్రాయాలు, సూచనలు ప్రభుత్వానికి మరింత దోహద పడతాయని ప్రధాని మోడీ తెలిపారు. యువత భాగస్వామ్యంతో పారదర్శకమైన, నమ్మకమైన పరీక్షా వ్యవస్థను నిర్మించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన సంకేతమిచ్చారు. తాను ఇన్‌స్టా విడియోలు విడుదలచేయడమే కాకుండా ప్రధాని మోడీ కేబినెట్ సమావేశంలో మంత్రివర్గ సహచరులను కూడా ఇన్‌స్టా వినియోగించుకుని యువత, జన్‌జీకి చేరువకావాలనిపిలుపునివ్వడం గమనార్హం.

## ధర్మేంద్ర ప్రధాన్‌పై నేడు నిర్ణయం!

కేంద్ర ఆరోగ్య మంత్రి జెపి నడ్డా, ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ పాల్గొనగా, సిజెపి తరఫున అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా హాజరయ్యారు. నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీక్ అంశంపై కొనసాగుతున్న ఆందోళనల మధ్య కేంద్రం ముందుంచిన మూడు ప్రధాన డిమాండ్లలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే అత్యంత కీలకమని సిజెపి వెల్లడించింది. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన సిజెపి ప్రతినిధులు, మిగిలిన రెండు డిమాండ్లకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందన్నారు. నీట్ పరీక్షకు సిద్ధమైన విద్యార్థుల ఆత్మహత్యలతో బాధపడుతున్న కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించడం, ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు, ఇతర న్యాయపరమైన కేసులను ఉపసంహరించుకోవడం వంటి అంశాలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సిజెపి ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై ప్రభుత్వం రేపు మధ్యాహ్నం వరకు గడువు కోరింది. ఆయనను త్వరలోనే పదవి నుంచి తప్పిస్తారని ఆశిస్తున్నాం. నష్టపరిహారం, విద్యార్థులపై నమోదైన కేసుల ఉపసంహరణ అంశాలకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. స్పష్టమైన నిర్ణయం వెలువడే వరకు మా ఆందోళన కొనసాగుతుందని తెలిపారు. మరోవైపు కేంద్ర మంత్రి జెపి నడ్డా మాట్లాడుతూ, దాదాపు రెండు గంటలపాటు సమావేశం జరిగినట్లు చెప్పారు. వారి నుంచి మూడు ప్రధాన డిమాండ్లు, పరీక్షల సంస్కరణలకు సంబంధించిన ఐదు సూచనలు వచ్చాయి. వాటిపై ప్రభుత్వంలో చర్చించి, రేపు మధ్యాహ్నం మరోసారి సమావేశమై మానిర్ణయాన్ని వారికి తెలియజేస్తామని వెల్లడించారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వ హామీల నేపథ్యంలో సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజులుగా కొనసాగించిన నిరాహార దీక్షను గురువారం అర్ధరాత్రి విరమించిన కొన్ని గంటలకే ఈ సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వం, సిజెపి మధ్య ఇది మూడో అధికారిక సమావేశం. అంతకుముందు జూలై 20న కేంద్ర మంత్రి నడ్డా నివాసంలో వరుసగా రెండు సమావేశాలు నిర్వహించగా, వాటిలో కూడా సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా పాల్గొన్నారు

## భారీ ప్రక్షాళన

ప్రశ్నపత్రం లీక్ అయినట్లు ఆరోపణలు రావడంతో, మే 3న నిర్వహించిన పరీక్షను మే 12న ఎన్‌టిఎ రద్దు చేసింది. అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జూన్ 21న తిరిగి పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ వ్యవహారంతో ఎన్‌టిఎ పనితీరుపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తగా, ఇప్పుడు సంస్థలో చేపడుతున్న భారీ సంస్కరణలు కీలకంగా మారాయి.

## పేపర్ లీక్ కేసుల్లో కఠిన శిక్షలు

**న్యూఢిల్లీ, జులై 24:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గతంలో ఇచ్చిన హామీ మేరకు, పేపర్ లీక్‌లు, పరీక్షల అవకతవకల కేసుల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడం, కఠిన శిక్షలు విధించడం లక్ష్యంగా రూపొందించిన ఒక బిల్లుకు, దానికి సంబంధించిన నిబంధనలకు కేంద్ర కేబినెట్ శుక్రవారం ఆమోదం తెలిపింది. ప్రతిపాదిత ఈ చట్టాన్ని వచ్చే వారం పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. కఠిన చర్యలకు సంబంధించిన నిబంధనలతో కూడిన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు గురువారం ప్రధానమంత్రి మోడీ ప్రకటించగా, మరుసటి రోజే కేబినెట్ సంబంధిత బిల్లును ఆమోదించడం విశేషం. బిల్లులో సూచించినట్లుగా, ప్రతిపాదిత ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు మూడు నెలల్లోగా విచారణలను పూర్తి చేసి, తీర్పులను వెలువరించాల్సి ఉంటుందని వర్గాలు తెలిపాయి. అలాగే వ్యవస్థీకృత పేపర్ లీక్ సిండికేట్‌లకు పాల్పడిన వారికి గరిష్ఠంగా 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా నిబంధనలు తీసుకురానున్నారు.

### నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా

## విద్యాసంస్థల బంద్

**విజయవాడ,జూలై 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో నీట్ పేపర్ లీక్ వివాదానికి వ్యతిరేకంగా శుక్రవారం వివిధ విద్యార్థి సంఘాలు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ జరిగింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళనలు చేపట్టారు. ఎస్ఎఫ్ఐ పీడీఎస్‌యూ , ఏఐఎస్ఏ , ఎన్ఎస్‌యూఐ, డీవైఎఫ్ఐ ఏఐవైఎఫ్ తదితర సంఘాల ఆధ్వర్యంలో ఈ బంద్ నిర్వహించారు. విజయవాడలో విద్యార్థులు లోక్‌భవన్‌ను ముట్టడించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. గుంటూరు హిందూ ఫార్మసీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా నిర్వహించారు. శ్రీకాకుళం విశాఖ, మచిలీపట్టణం, నగరం, ఏలూరు, కాకినాడ, రాజమహేంద్రవరం, గుడివాడ, విజయనగరం, తిరుపతి, ఒంగోలు, నెల్లూరు ప్రాంతాల్లో ఢిల్లీలో విద్యార్థులకు మద్దతుగా ఆందోళనలు చేపట్టారు.

## ఆత్మహత్య

పలుమార్లు కౌన్సిలింగ్ తీసుకునే వాడని. మందులు సక్రమంగా వడకుండా మధ్య మధ్యలో ఆపేసేవాడని సహచర వైద్య విద్యార్థులు తెలిపారు. ఏఎంసీ లో చేరిన తర్వాత కూడా విశాఖ మానసిక ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు గత మే నెల నుంచి ఇప్పటి వరకు రెండుసార్లు అతడు ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడని వారి తల్లి దండ్రులుకు తెలియజేసామని ఫారెన్సిక్ విభాగం అధిపతి డాక్టర్ వెంకట రమణతెలిపారు. శుక్రవారం ఠాకూర్ నాథ్ విధులకు హాజరు కాకపోవడంతో తన రూమ్ మేట్ డాక్టర్ సూర్య ను పీజీ హాస్టల్ కు పంపగా రూమ్ తలుపులకు గడవేసుకొని బెడ్ షీట్ తో సీలింగ్ ఫ్యాన్ కు ఉరి వేసుకో వ్రేలాడుతూ కనించే సరికి సహచర విద్యార్థుల సాయంతో తలుపు లు బద్దలు కొట్టి ఫ్యాన్ కు వేరేలాడుతున్న ఠాకూర్ నాథ్ ను క్రింద కు దించి పరీక్షించగా అప్పటికే అతడు మృతి చెందినట్టు తెలిపారు. తన గదిలో ఎవరు లేనప్పుడు సుమారుగా పదకొండు పన్నెండు గంటల ప్రాంతలో అతడు ఆత్మ హత్య కు పాల్పడినట్టు వన్ టౌన్ సీఐ వరప్రసాద్ తెలిపారు. మెడికల్ కాలేజీ ఇంచార్జి ప్రిన్సిపాల్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టు మార్టంకు తరలిచి దర్యాప్తు చేస్తున్నట్టు సి ఐ చెప్పారు.

### పారిశ్రామిక వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపి చింతకాయల విజయ్

**విశాఖపట్నం, జులై 24 ప్రభాతవార్త:** పారిశ్రామిక వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాజ్యసభ సచివాలయం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. రాజ్యసభ నిబంధనావళిలోని రూల్ 269(1) ప్రకారం రాజ్యసభ ఛైర్మన్ ఈ నియామకాన్ని చేపట్టినట్లు సచివాలయం ప్రకటనలో తెలిపింది. 2026 జూలై 23వ తేదీ నుండి ఈ నియామకం అమలులోకి వచ్చినట్లు పేర్కొంది. దేశంలో పారిశ్రామిక రంగానికి సంబంధించి కీలకమైన విధానపరమైన నిర్ణయాలు, సమీక్షలు నిర్వహించే ఈ కమిటీలో చింతకాయల విజయ్ సభ్యుడిగా వ్యవహరించనున్నారు. కమిటీ సభ్యుల జాబితాతో పాటు అవసరమైన సమాచారాన్ని రాజ్యసభ డైరెక్టర్ నియాంగ్ ఖాన్నేమ్ గుయ్తే ఎంపీకి పంపారు.



### అమరావతి నిర్మాణం వేగంగా జరపండి

ఓపెన్ యూనివర్సిటీ భవన నిర్మాణం పూర్తై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. అలాగే బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, కెనరా బ్యాంక్ భవనాలను 2028 జనవరి నాటికి, నాబార్డ్, బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్మాణాలను త్వరలో ప్రారంభించి అదే గడువులో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కార్యాలయం, విదేశ్ భవన్ (ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం), న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ భవనాలను 2028 జూలై నాటికి సిద్ధం చేయనున్నట్లు వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, అమరావతి అభివృద్ధికి ఈ కేంద్ర ప్రభుత్వ నిర్మాణ ప్రాజెక్టులు చారిత్రాత్మకమని పేర్కొన్నారు.

## తూర్పులో పెరుగుతున్న కరోనా

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై 24, ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లాలో కరోనా కేసులుపెరుగుతున్నాయి. రాజమహేంద్రవరం జి జి హెచ్ లో శుక్రవారం 19 మందికి రాపిడ్ టెస్ట్ చేయగా ఒక్కరికి కూడా కోవిడ్ లక్షణాలు లేవని డీఎంహెచ్ ఓ కోమలి తెలిపారు. ఈనెల 19న ఒకటి 21న రెండు 22న మూడు 23న ఐదు చొప్పున కేసులు నమోదు అయ్యాయి. కేసులు పెరుగుతున్నందున ప్రజల అప్రమత్తంగా ఉండాలని మాస్కులు భౌతిక దూరం పాటించాలనిసూచించారు. జ్వరము దగ్గ ఒళ్ళు నొప్పులు గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే కోవిడ్ టెస్ట్ చేయించుకోవాలని కోరారు.

## వారం - వర్జ్యం

25-07-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
ఏకాదశి ఉ.11.34, జ్యేష్ఠ పూర్తి
వర్జ్యం : ఉ.10.54-మ.12.42
దు.తె.5.45-ఉ.7.25
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** కొన్ని విషయాలలో తొందరపాటు వద్దు. కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. సాంకేతిక విద్యావకాశాలు వస్తాయి.

**వృషభం:** ఉద్యోగులకు బదిలీల సూచన. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. ఆర్థికంగా చెప్పుకోదగిన ఒడిదుడుకులుండవు.

**మిథునం:** పట్టుదలతో ముందుకుసాగి పనులు చక్కబెట్టుకుంటారు. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**కర్కాటకం:** ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. దైవ చింతన కలిగివుంటారు. బంధువుల కలయిక

**సింహం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. కోపతాపాలకు దూరంగా ఉండండి.

**కన్య :** చర్చలు, శుభకార్యాలలో ఎక్కువగా పాల్గొంటారు. సంతానంపట్ల ప్రత్యేక శ్రద్ధకనబరుస్తారు. వాహనసౌఖ్యం.

**తుల:** పెట్టుబడులు కొద్దికాలం వాయిదా వేయటం మంచిది. దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**వృశ్చికం:** సభలు, సమావేశాలలో పాల్గొంటారు. వృత్తిలో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

**ధనుస్సు:** భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. చిన్ననాటి మిత్రుల నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**మకరం:** ఎదుటివారికి సైతం మీ సహాయ సహకారాలు అందిస్తారు. మీలోని ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది.

**కుంభం:** అమ్మకాలు, కొనుగోలు వ్యవహారాలకు దూరంగా ఉండండి. ఎదుటి వారి మాట సావధానంగా ఆలకించండి.

**మీనం:** పొదుపు పథకాలు అవలంభిస్తారు. మీ తొందరపాటు తనంవల్ల కాంట్రాక్టులు చేజారిపోయే పరిస్థితి వుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కూటమి పరిధిలోనే 'స్థానిక' పోటీ

### యువత, మహిళల చైతన్యంతో జనసేన పార్టీ తొలి అడుగులు: మంత్రి నాదెండ్ల

**విజయవాడ,జులై24,ప్రభాతవార్తప్రతినిధి:** యువతను, మహిళలను చైతన్య పరిచేలా జనసేన పార్టీ తొలి అడుగులు వేసిందని ఆ పార్టీ రాజకీయవిభాగ సంచాలకులు , మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేసారు. తమ పార్టీలో ఎటువంటి వర్గాలుండవని ఉన్నందల్లా పవన్ గ్రూపు మాత్రమేనన్నారు. కూటమి ప్రభుత్వ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే స్దానిక సంస్దల ఎన్నికల్లో పార్టీ పోటీ చేస్తుందన్నారు. సార్వత్రిక ఎన్నికల నాటి పొత్తులు అప్పటి పరిస్దితులను బట్టి జరిగాయన్నారు. స్దానిక సంస్దల ఎన్నికల్లో పొత్తులు ఆయా అంశాల ఆధారంగా ఉంటాయన్నారు. జనసేన పార్టీ బలోపేతం కోసం ఎంతోమంది పని చేస్తున్నారని అన్నారు. శుక్రవారం విజయవాడలోని తూర్పు, సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల జనసేన నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పటి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను అప్రజాస్వామిక పద్ధతిలో ఏకగ్రీవాలు చేసుకోవాలని ప్రయత్నిస్తే, ఎదురొడ్డి నిలబడిన కార్యకర్తలు జనసేనలోనే ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టిన పార్టీ జనసేన అని పునరుద్ఘాటించారు. విజయవాడ జనసేన పార్టీ సమీక్ష సమావేశం శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి నాదెండ్ల మనోహర్ పాల్గొని, ప్రసంగించారు. కార్యకర్తలతో స్వయంగా మాట్లాడి, వారి సూచనలను విన్నారు. పార్టీ ప్రత్యేకంగా రూపొందించిన అప్లికేషన్ ఫాంను అందరికీ పంచి, వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి చాలా మంది భయపడ్డారని, జనసేనలో వీర మహిళలు, జన సైనికులు ధైర్యంగా నిలబడ్డారన్నారు. విజయవాడ కార్పొరేషన్‌లో 34 స్థానాల్లో నిలబడ్డారని, క్లిష్ట



పరిస్థితిని ఎదుర్కొని నిలబడిన తీరు ఆదర్శమని కొనియాడారు. ఎవరూ నోరు జారవద్దని, అనవసర రాద్ధాంతాలు చేయవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాన్ని బలంగా తిప్పి కొట్టాలి. మనకు పత్రికలు, ఛానళ్లు లేవు.. కార్యకర్తలే మన మీడియా. పవన్ ఆలోచనలు ప్రజల్లోకి తీసుకువెళ్లండి అంటూ పిలుపునిచ్చారు. ఇప్పుడు పంచాయతీ రాజ్ శాఖను దేశంలోనే రెండో స్థానంలో పవన్ కల్యాణ్ నిలబెట్టారని మంత్రి తెలిపారు. విజయవాడలోని 64 డివిజన్లలో జనసేన బలోపేతం కావాలన్నారు.

## ముందు ముందు ఎఐ టీచర్ వస్తున్నారు..

చాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యార్థులు డ్రగ్స్ దూరంగా ఉండాలని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. లీప్ యాప్ ను ప్రతి తల్లిదండ్రులు వారి వారి మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవాలని, మీ పిల్లల హాజరు, విద్య ప్రమాణాలు మీరే నేరుగా తెలుసుకోవచ్చు అని సూచించారు. భవిష్యత్తులో ఏ ఐ టీచర్ ను అందుబాటులో కి తెస్తామని అన్నారు. అనంతరం విద్యార్థుల చేత తల్లిదండ్రులకు పాద నమస్కారం చేయించారు. వేధికమీద తన తండ్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాళ్ళకు నమస్కారించి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు,రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ విద్యా ర్థులతో కలిసి భోజనం చేశారు. చిన్నారులను ఆప్యాయంగా పలకరించి, చిన్నారుల కళ్ళలో ఆనందాన్ని నింపారు. పోలవరంజిల్లా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్

25-7Pg3fG_25-7Pg3fG.qxd 25/Jul/26 12:20 AM Page 1



# రూ.25 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ్డ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్

## మరో ఐదు రోజుల్లో పదవీ విరమణ



**అనంతపురం క్రైమ్, జులై 24 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. దేవాదాయ శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న మల్లికార్జున ప్రసాద్‌ను లంచం తీసుకుంటున్న సమయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎసిబి డిఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ పుట్లూరు మండలం రామలింగేపల్లిలో గుడి నిర్మాణం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ రూ.10 లక్షలు మంజూరు చేసింది. అందులో రూ.2 లక్షల మంజూరు కోసం అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ రూ.25 వేలు లంచం అడిగారన్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి నుంచి రూ.25 వేలు లంచం తీసుకుంటుండగా రైడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామన్నారు. అయితే అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ ఈ నెల 31న రిటైర్డ్ అవుతున్నట్లు సమాచారం ఉందన్నారు. మల్లికార్జున ప్రసాద్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితున్ని కర్నూలు ఎసిబి కోర్టుకు తరలిస్తున్నట్లు వివరించారు. ఈ దాడుల్లో ఎసిడి డిఎస్పీ ప్రసాద్ రెడ్డి, సిఐ హమీద్ ఖాన్. సిబ్బంది పాల్గొన్నారు.

## జోగి రమేష్ కుటుంబీకులపై గృహహింస కేసు

**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబ సభ్యులపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్ భార్య మేఘన ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ సభ్యుల నుంచి తనకు నిరంతరం వేధింపులు ఎదురయ్యాయని, మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేశారని మేఘన తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. మేఘన ఫిర్యాదులో గృహ హింస వరకట్న వేధింపులు హత్యాయత్నం వంటి తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా మాజీ మంత్రి జోగి రమేష్, జోగి రాము కుటుంబాలకు చెందిన మొత్తం 11 మంది సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసులో పేర్కొన్న ఆరోపణలపై అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇబ్రహీంపట్నం పిఎస్‌లో జోగి రమేష్ కుటుంబసభ్యులపై జోగి రాజీవ్ భార్య మేఘన ఫిర్యాదు చేసారు.

## రౌడీషీటర్ డిస్కో వెంకీపై పిడి యాక్ట్

**నెల్లూరు (క్రైం), జులై 24 ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ మండలం సుందరయ్య కాలనీకి చెందిన దేవేళ్ల వెంకటేష్ అలియాస్ డిస్కో వెంకీపై వేదాయపాలెం పోలీస్ స్టేషన్లో రౌడీ షీట్ వుంది. ఓ వ్యక్తికి కత్తి చూపించి నగదు దోచుకున్న ఘటనలో డిస్కో వెంకీని గత నెల 21వ తేదీన వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు అరెస్ట్ చేసారు. అప్పటి నుంచి డిస్కో వెంకీ జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో వున్నారు. జిల్లా కలెక్టర్ అనుమతితో వెంకీపై పిడి యాక్ట్ నమోదు చేసి 23న కడప కేంద్ర కారాగారానికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు.

### భూ పోరాట యోధుడు, సిపిఐ సీనియర్ నాయకులు

## పముజుల దశరథ రామయ్య కన్నుమూత



**నెల్లూరు(అగ్రికల్చర్), జులై 24 ప్రభాతవార్త:** ఉద్యమాలే ఊపిరిగా పేదల పక్షాన నిలిచి అనేక పోరాటాలు సాగించి తన సర్వస్వాన్ని అణగారిన వర్గాల కోసం ధారబోసిన కామ్రేడ్ పముజుల దశరథ రామయ్య శుక్రవారం కన్నుమూశారు. ఒక్కసారిగా అస్వస్థతకు గురై కారులో హాస్పటల్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో సాయంత్రం 6:10 నిమిషాలకు తుది శ్వాస విడిచారు. అయినా ఆయన బతికి ఉన్నాడన్న చివరి ఆశతో కుటుంబ సభ్యులు, సిపిఐ నేతలు అపోలో హాస్పిటల్‌కి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ వార్త నెల్లూరు జిల్లాలో దావానలంలా వ్యాపించింది. ఆయన స్వగ్రామం సౌత్ మోపూరు శోకసంద్రంలో మునిగిపోయింది. అనేక సమస్యల పరిష్కారానికి ముందుండి నిలిచి పోరాడి నెల్లూరు రూరల్‌లో వేల ఎకరాల భూమిని, ఇళ్ల స్థలాలను పేదలకు పంచిన తమ నేత లేడన్న వాస్తవం తెలుసుకొని పేద ప్రజలు కన్నీరు మున్నీరయ్యారు. ఆయన మృతదేహం వద్దకు చేరి గ్రామస్తులు పెద్ద ఎత్తున పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

## కాలువలో మునిగి ముగ్గురు బాలురు మృతి

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రతినిధి, జులై 24 ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్ అంబెడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో కాలువలో మునిగి ముగ్గురు బాలురు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన చోటుచేసుకుంది. స్థానిక పంట కాలువలో స్నానానికి దిగిన ముగ్గురు మునిగి మృతి చెందారు. మృతులను కనికెళ్ల రంజిత్ (15), బొక్క వీరేంద్ర (19), వేమన పావని (14)గా గుర్తించారు. ఈ ఘటనతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థుల మృతి పట్ల కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి తెలిపారు.

## పలమనేరు నుండి విజయవాడ వరకు డ్రగ్స్ నియంత్రణపై యువకుడు సైకిల్ యాత్ర



సైకిల్‌యాత్రను ప్రారంభిస్తున్న డిఎస్పీ డేగల ప్రభాకర్

**పలమనేరు, జులై 24 ప్రభాతవార్త:** డ్రగ్స్ నియంత్రణపై ప్రజలను చైతన్య వంతులను చేయడానికి బషీర్ అనే యువకుడు పలమనేరు నుండి విజయవాడ వరకు సుమారు 700 కి.మీలు సైకిల్ యాత్ర చేపట్టాడు. శుక్రవారం ఈ యాత్రను పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద డిఎస్పీ డేగల ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. సిఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ లోకేష్ సంఘీభావం తెలిపారు. పలమనేరుకు చెందిన బషీర్ డ్రగ్స్ నియంత్రణకు తన వంతు సహకారం అందించడానికి శ్రీకారం చుట్టాడు. ఎంతో మంది యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. దీనిపై సైకిల్ యాత్ర ద్వారా వాడవాడలా తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించాడు. ఈ విషయం తెలుసుకున్న డిఎస్పీ డేగల ప్రభాకర్ వెన్ను తట్టి ప్రోత్సహించారు. దీంతో బషీర్ పలమనేరు నుండి సైకిల్ యాత్ర ప్రారంభమైంది. నెల రోజుల పాటు సైకిల్ యాత్ర పూర్తి చేసి తిరిగి పలమనేరుకు చేరుకుంటాడు.





ఆషాడం సారె సమర్పించి దుర్గమ్మకి మొక్కుతున్న భక్తులు

# యేటా డిఎస్సీ... ఉపాధ్యాయ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం

- విద్యావ్యవస్థ బలోపేతానికి చర్యలు
- మెగా డిఎస్సీపై వైసిపి అసత్య ప్రచారం
- మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్



**జె. పంగులూరు, జులై 24 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. జె.పంగలూరు మండలం రేణింగవరం ఉన్నత పాఠశాలలో ఎంఈఓ ఎస్.కె.కాలేషావలి ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కి ముఖ్యఅతిథిగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రేణింగవరం ఉన్నత పాఠశాలలో 88 మంది విద్యార్థిని, విద్యార్థులకు దాతల సహాయంతో ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడిన మంత్రి గొట్టిపాటి విద్యా రంగ సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారికి వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే మెగా డిఎస్సీ ద్వారా 16,000కు పైగా టీచర్ పోస్టులను భర్తీ చేశామని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం డిఎస్సీ ద్వారా మంత్రి లోకేష్ ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తూ విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తల్లికి వందనం ద్వారా పేద విద్యార్థుల చదువులకు సుమారు రూ.8,500 కోట్లను వ్యయం చేస్తున్నది దేశంలో ఏ ఒక్క ప్రభుత్వం కూడా ఇంత పెద్ద మొత్తం ఇచ్చిన దాఖలు లేవు లేవని, ఒక్క కూటమి ప్రభుత్వంలో సిఎం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. మంత్రి లోకేష్ మెగా డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేశారన్నారు. విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేస్తున్నామని, అధ్యాపకులు విద్యార్థిని, విద్యార్థులను ఉత్తమ స్థాయి ఉత్తీర్ణులుగా తీర్చిదిద్దాలని మంత్రి కోరారు. విద్యార్థిని, విద్యార్థులందరూ బాగా చదవాలన్నారు. విద్యా వ్యవస్థకు నష్టం కలిగించేలా మెగా డిఎస్సీపై వైఎస్సార్ కాంగ్రెస్ నేతలు... అసత్యాలు, అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి గొట్టిపాటి మండిపడ్డారు. దీని వలన విద్యా వ్యవస్థతో పాటు సమాజానికి నష్టం జరిగిందన్నారు. విద్యా వ్యవస్థ బలోపేతమైతే అన్ని వ్యవస్థలూ గాడిన పడతాయని ఆయన వివరించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులే పిల్లలను మంచి విద్యార్థులుగా, భావి భారత పౌరులుగా తీర్చి దిద్దాలని పిలుపునిచ్చారు. త్వరలోనే ఇంధన శాఖలో 630కు పైగా ఖాళీలను భర్తీ చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ప్రక్రియ కూడా పూర్తయిందని ఆయన తెలిపారు. చివరగా మంత్రి గొట్టిపాటి గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల పలు సమస్యల అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తాం: మంత్రి నారాయణ



**నెల్లూరు(వైద్యం), జులై 24 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరు నగరంలోని డిఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్‌టీచర్స్ మీట్ 4.0లో ఆయన పాల్గొన్నారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ఆత్మీయంగా మాట్లాడి పిల్లల చదువు, భవిష్యత్తు లక్ష్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2024 ఎన్నికల సమయంలో వీఆర్ పాఠశాల అభివృద్ధికి ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే నిలబెట్టుకుని అంతర్జాతీయ స్థాయిలో పునర్నిర్మించామని చెప్పారు. వీఆర్ పాఠశాలలో చదివిన ఎంతో మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తుచేశారు. పిల్లల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించిన మంత్రి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. పేరెంట్‌టీచర్స్ మీటింగ్ ఉద్దేశం విద్యార్థుల ఆసక్తులు, సామర్థ్యాలను తల్లిదండ్రుల ద్వారా తెలుసుకుని వాటికి అనుగుణంగా ప్రోత్సహించడమేనని వివరించారు. ప్రతి పాఠశాలలో తరగతి గదులతో పాటు విద్యార్థుల ప్రతిభ, వికాసానికి అవసరమైన 18రకాల ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. చదువుతో పాటు సంగీతం, క్రీడలు తదితర రంగాల్లో విద్యార్థులకు ఆసక్తి ఉన్న వాటిలో శిక్షణ అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, డిఇఒ బాలాజీ రావు, ఎంఇఒ తిరుపాల్, ప్రిన్సిపాల్ పద్మావతి, డివిజన్ టిడిపి నేతలు అనంగి ప్రసాద్, బిజెపి నేత మిడతల రమేష్, టీచర్స్, పేరెంట్స్ పాల్గొన్నారు.

## 'తల్లికి వందనం'తో పేద కుటుంబాల్లో ఆనందం నింపాం: ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**కోవూరు, (నెల్లూరు), జులై 24 ప్రభాతవార్త:** ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో 34,253 మంది విద్యార్థులకు రూ.51.38 కోట్ల ఆర్థిక సాయం అందిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. తల్లికి వందనం పథకం అమలు, ప్రజల నుంచి వస్తున్న స్పందనపై ఆమె శుక్రవారం సాయంత్రం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి వాటిని సూపర్‌హిట్‌గా మార్చామని తెలిపారు. పిల్లల చదువులకు తోడ్పాటుగా కూటమి ప్రభుత్వం ఇటీవలే రెండో ఏడాది తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసిందన్నారు. తల్లిదండ్రులు తమకు అందిన సాయంపై సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, తనకు స్వయంగా ధన్యవాదాలు చెప్పేందుకు వస్తుండటం ఆనందంగా ఉందన్నారు. పేద కుటుంబాల్లో ఆనందం నింపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

### రేబలా హైస్కూల్ అభివృద్ధికి కృషి చేస్తా

**బుచ్చి (నెల్లూరు), జులై 24 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాలలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో కోవూరు శాసనసభ్యులు రాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ రేబాల జడ్‌పి హైస్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న గదులు త్వరలో పూర్తి చేస్తామని హామి ఇచ్చారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి పాళెం రూరల్ బ్యాంకు చైర్మన్ ఏటూరు శివరామకృష్ణారెడ్డి, వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ, ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, నీటి సంఘం అధ్యక్షులు నెల్లూరు రమణారెడ్డి, నాటరరాణి ప్రసాద్, తూపిలి వెంకటరమణారెడ్డి, లఘంతోటి మస్తానయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'నీట్' వివాదం సాకుతో విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర

### - బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధాని మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం యువత భవిష్యత్తును పరమావధిగా చేసుకుని పనిచేస్తోందని బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యా రంగంలో మోడీ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చిందని, దేశవ్యాప్తంగా ఐఐటిలు, ఐఐఎంలు, గిరిజన విశ్వవిద్యాలయాలను నెలకొల్పడంతో పాటు మెడికల్ సీట్లను భారీగా పెంచిందని వివరించారు. గత ప్రభుత్వాల హయాంతో పోలిస్తే తమ పాలనలోనే విద్యా పేపర్ లీకేజీలు గణనీయంగా తగ్గాయని, నీట్ వ్యవహారంలో సమస్య వెలుగుచూడగానే కేంద్రం తక్షణమే కఠిన చర్యలు తీసుకుందని తెలిపారు.

నీట్ వివాదాన్ని సాకుగా చూపి కొందరు విపక్ష నేతలు ఢిల్లీ వేదికగా మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నీట్ సాకుతో ప్రధానితో పాటు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, నటుడు ప్రకాశ్‌రాజ్ సహా కొందరు విద్రోహకర, దేశ వ్యతిరేక వ్యాఖ్యలకు పాల్పడటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొన్ని విద్యా సంఘాలు విద్యార్థుల ప్రయోజనాలను పక్కనబెట్టి వారి భవిష్యత్తును నాశనం చేసేలా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి దమ్ముంటే తమ సొంత పాలనలో జరిగిన పేపర్ లీకేజీలపై పార్లమెంట్‌లో మాట్లాడాలని, సభలో చర్చల్లో పాల్గొనే ధైర్యం లేకనే ఆయన దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారని బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ సవాల్ విసిరారు.

## అమరావతి ఎన్‌జిఓ టవర్స్ నిర్మాణ పనుల్లో కీలక అడుగు

**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (ఎన్‌జీఓ) టవర్స్ నిర్మాణ పనుల విషయంలో మరో కీలక అడుగు పడింది. నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ టవర్స్ తుది దశ నిర్మాణ పనుల కోసం రూ. 83.99 కోట్ల విలువైన కాంట్రాక్టును ఎల్ అండ్ టీ సంస్థకు అమరావతి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ గ్రీన్‌ఫీల్డ్ సిటీస్ లిమిటెడ్ అందజేసింది. శుక్రవారం రాయపూడిలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో ఎల్ అండ్ టీ సంస్థకు ఎల్ఓఏను ఏజీఐసీఎల్ ఎండీ అభిషేక్ కుమార్ అందజేశారు. టెండర్ ప్రక్రియలో ఎల్ 1 బిడ్డర్‌గా నిలిచిన ఎల్ అండ్ టీకి ఈ పనులను అప్పగించారు. ఈ ఒప్పందం ప్రకారం ఎన్‌జీఓ టవర్స్‌లో మిగిలిన తుది దశ పనులను ఈ సంస్థ పూర్తి చేయనుంది. ముఖ్యంగా భవనాల అంతర్గత పనులతోపాటు ఫినిషింగ్ పనులు, మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం, కాంపౌండ్ వాల్స్, అంతర్గత మౌలిక వసతులతోపాటు ఇతర అనుబంధ పనుల నిర్మాణం చేపట్టనుంది. రాజధాని అమరావతిలో ప్రభుత్వ కాంప్లెక్స్‌తోపాటు వివిధ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఈ నిర్మాణ పనుల వేగం ఊపందుకుంది. ఎన్‌జీఓ టవర్స్ నిర్మాణాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేసి ఉద్యోగులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

## ఎస్వీయూలో న్యూట్రి-టెక్ అంతర్జాతీయ సదస్సు

**తిరుపతి (విద్య), జులై 24 ప్రభాతవార్త:** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం హోమ్ సైన్స్ విభాగం, రూసా-2.0 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో న్యూట్రి-టెక్-2026, ప్రిసిషన్ న్యూట్రిషన్ అండ్ స్మార్ట్ అండ్ సస్టైనబుల్ ఫుడ్ టెక్నాలజీస్ ఫర్ గ్లోబల్ హెల్త్ అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ఎస్వీయూ సెనేట్ హాల్‌లో ప్రారంభమైంది. ఉపకులపతి ఆచార్య టాటా నరసింగ రావు సదస్సును ప్రారంభించి మాట్లాడుతూ, వ్యవసాయం, ఆరోగ్యం, సాంకేతికత, సుస్థిర అభివృద్ధి వంటి రంగాలను అనుసంధానించడంలో ఆహార శాస్త్రం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రపంచ ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొనే పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రెక్టార్ ఆచార్య సి.హెచ్. అప్పారావు మాట్లాడుతూ, ప్రజలకు సురక్షిత మైన, నాణ్యమైన ఆహారం అందించేందుకు ఆహార కల్తీ, కాలుష్య నివారణపై శాస్త్రవేత్తలు మరింత దృష్టి సారించాలని సూచించారు. ఆహార భద్రతలో ఆధునిక సాంకేతికత పాత్ర కీలకమని చెప్పారు. సదస్సు కన్వీనర్, హోమ్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య కె.వి.సుచరిత మాట్లాడుతూ, ప్రపంచం సాధారణ పోషకాహార విధానాల నుంచి ప్రిసిషన్ న్యూట్రిషన్ వైపు అడుగులు వేస్తోందన్నారు. వ్యక్తిగత ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా స్మార్ట్ ఫుడ్ టెక్నాలజీల అభివృద్ధి అవసరమని వివరించారు. జాతీయ పోషకాహార సంస్థకు చెందిన డా. జి. సుబ్బారావు అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారాల వల్ల పెరుగుతున్న అంటు వ్యాధేతర వ్యాధులపై ప్రసంగించగా, సిఎఫ్‌టిఆర్ఐ శాస్త్రవేత్త డా.రాజగోపాల్ సాంప్రదాయ ఆహారాల ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రధానోపన్యాసకు రాలు డా. లావణ్య పేగు చిన్న జీవ వ్యవస్థ ఆరోగ్యంపై పాలీఫినాల్స్ ప్రభావాన్ని వివరించారు.

రెండు రోజుల సదస్సులో స్మార్ట్ ఫుడ్ టెక్నాలజీలు, సుస్థిర ఆహార వ్యవస్థలు, ప్రిసిషన్ న్యూట్రిషన్, ప్రపంచ ఆరోగ్యానికి వినూత్న ఆవిష్కరణలపై జాతీయ, అంతర్జాతీయ నిపుణుల ఉపన్యాసాలు, సాంకేతిక సమావేశాలు, పరిశోధనా పత్రాల సమర్పణలు జరగనున్నాయి. మొత్తం 66 మౌఖిక పరిశోధనా పత్రాలు, 22 పోస్టర్ ప్రజెంటేషన్లు ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఆషాఢం సారె తెచ్చిన భక్తులతో ఇంద్రకీలాద్రి రద్దీ

**ఇంద్రకీలాద్రి, జులై 24 ప్రభాతవార్త:** దుర్గమ్మకి ఆషాఢం సారె తెచ్చిన భక్తజనంతో ఆలయంలో రద్దీ నెలకొంది. శ్రీ కనకదుర్గమ్మని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర, సారెలతో ఇంద్ర కీలాద్రికి 10వ రోజు శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు 42 సారె బృందాలకు చెందిన 16890 మంది భక్తులు సారె సమర్పణ చేశారు.

దుర్గమ్మ దర్శనానంతరం 6వ అంతస్తులోని శ్రీ అమ్మవార్లకు సారెను సమర్పించి పూజాధికాలు నిర్వహించారు. భవానీ అనుగ్రహ దర్శన్ రూ.100లు క్యూ లైన్ దర్శనం సారె భక్తులకు కేటాయించారు.

**వేదవిద్య విద్యార్థులకు ధ్రువపత్రాలు:** బెజవాడ దుర్గమ్మ ఆలయ నిర్వహణలోని పోరంకి వేదపాఠశాలలో వేదవిద్యనభ్యసించి విజయవంతంగా పూర్తిచేసుకున్న విద్యార్థులకు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వికె శీనా నాయక్ శుక్రవారం ధ్రువపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్య వి శివప్రసాద్ శర్మ, ముఖ్య అర్చకులు శ్రీనివాసశాస్త్రి, వేదపాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## కోనలో నృసింహా స్వామికి తిరుప్పావడ సేవ



**రాపూరు (నెల్లూరు), జులై 24 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారికి శుక్రవారం అన్నకూటోత్సవం (తిరుప్పావడ సేవ) శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారికి అభిషేకం, 9 గంటలకు స్వామి వారి సన్నిధిలో ఆలయ ప్రధానార్చకులు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా తిరుప్పావడ సేవ నిర్వహించారు. భక్తుల తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.

## కన్నుల పండువగా అర్జున తపస్సు



అర్జున తపస్సుకు హాజరైన జనం

**శ్రీకాళహస్తి, జులై 24 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి తిరునాళ్ళలో ప్రధాన ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. సాయంత్రం అర్జున తపస్సు కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో అర్జునుని చక్కగా అలంకరించారు. ఏర్పాట్లను ఇఓ బికె వెంకటేశులు స్వతహాగా పర్యవేక్షించారు. ఉత్సవాలు నుంచి ఊరేగింపు వరకు అలంకారాలను ఆయనే దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అర్జున తపస్సు సందర్భంగా ఆలయంలో అర్జుని ఉత్సవ మూర్తికి చక్కగా అలంకారం జరిపారు. అలంకారాల్లో సిద్ధ హస్తులైన రాజేష్‌గురుకుల్ పర్యవేక్షించారు. ఆలయం నుంచి ఊరేగింపు జరిపారు. ఆలయ ఆవరణలో తాటి చెట్టును ఏర్పాటు చేసారు. ఇక్కడ విశేష పూజలు జరిపారు. గుమ్మడికాయను కొట్టి కర్పూర హారతులిచ్చి అర్జునుడు పాశుపతాస్త్రాన్ని చేసిన తపస్సును నిర్వహించారు. అర్జున్ పాత్రధారి నాగేశ్వరరావు, శివుడుగా ఆశోక్, పార్వతి దేవిగా కృష్ణమూర్తి చక్కగా అభినయించారు. తాటిమొక్కపై నుంచి విసిరే నిమ్మకాయలతో సంతాన ప్రాప్తి కల్గుతుందనే నమ్మకం ఉండటంతో జనం ఎగబడ్డారు. కార్యక్రమాల నిర్వహణలో ఈ ఏడాది ఇఓ బికె వెంకటేశు, డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, ఇన్‌చార్జి దుర్గా ప్రసాద్‌లు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, సభ్యుడు గుర్రప్పశెట్టి, మహాలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## గోసంరక్షణకు హైదరాబాదువాసుల విరాళం



**శ్రీకాళహస్తి, జులై 24 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న వివిధ పథకాలకు భక్తుల నుంచి విరాళాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం గోసంరక్షణకి హైదరాబాదు వాసులు కోడాలి వెంకటేశ్వరరావు రూ.1,01,516లు విరాళంగా అందించారు. కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇఒ బికె వెంకటేశులు, బోర్డు సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, పి.హేమావతి, కడప శ్రీను పాల్గొన్నారు. విరాళం అందించిన కొడాలి వెంకటేశ్వరరావుకు ఆలయంలో వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.

## విజయవాడలో ఎంఎస్ఎంఇ కాన్‌క్లేవ్

**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త:** యువపారి శ్రామికవేత్తలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో బిఎన్ఐ ఆధ్వర్యంలో విజయవాడలో యంఎస్‌యంఈ ఎక్స్‌పో కాన్‌క్లేవ్ శుక్రవారం ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వివిధ పరిశ్రమల స్టాళ్ళను అతిధులు స్టాళ్ళను పరిశీలించి ఉత్పత్తుల తయారీ విధానం, బ్రాండింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్, వ్యాపార విస్తరణ అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ లక్ష్మీశా మాట్లాడుతూ వివిధ కంపెనీలు తయారు చేసిన యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార నమూనాలు ఒకే వేదికపై అందుబాటులో ఉండటంతో పరిశ్రమలు స్థాపించాలనుకునే యువతకు అవసరమైన సమాచారం సులభంగా లభిస్తుందన్నారు. ఎక్స్‌పో చైర్మన్ త్రినాధ్ నందూరి, డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాంచారరావు, బిఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జె.దేశాయ్, విశాల్ దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి కృష్ణాలో సజావుగా రిజిస్ట్రేషన్‌లు

**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త:** ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ రిజిస్ట్రేషన్ సేవలు యధావిధిగా అందుతున్నాయని రాష్ట్ర రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ విజయవాడ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ కె.రామారావు తెలిపారు. ప్రజలకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా పెండింగ్‌లో ఉన్న దస్తావేజుల నమోదును త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నాలుగురోజులుగా పెండింగ్‌లో ఉన్న దస్తావేజులను నమోదు చేసేందుకు శుక్రవారం రాత్రి 9గంటల వరకు అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పనివేళలను పొడిగించినట్లు తెలిపారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ ...విశ్వాసానికి మరో పేరు! (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
డి.నెం.9-13-45/2/8/1, 8వ అంతస్తు, ఎమ్‌విఆర్ వినాయగర్ ట్రేడ్ సెంటర్, సిబిఎమ్ కాంపౌండ్, విఐపి రోడ్డు, విశాఖపట్నం-530003.

ప్రకటన

పంజాబ్ నేషనల్‌బ్యాంక్ యొక్క గౌరవనీయ కస్టమర్లకి తెలియజేయునది ఏమనగా!!!
ప్రియమైన ఖాతాదారులారా!
ఆర్‌బిఐ నిబంధనల ప్రకారము కస్టమర్లందరికీ సమయానుసారంగా కెవైసి అప్‌డేషన్ తప్పనిసరి. మీ ఖాతాకు కెవైసి అప్‌డేషన్ గడువు 30.06.2026, నాటికి ముగిసిపోయి ఉంటే మీరు PNB One/ఇంటర్నెట్ బ్యాంకింగ్/రిజిస్టర్ ఇ-మెయిల్/పోస్ట్/వాట్సాప్/ఎస్ఎంఎస్ ద్వారా లేదా స్వయంగా ఏదైనా శాఖ ద్వారా మీ కెవైసిని 31.07.2026లోగా అప్‌డేట్ చేసుకోగలరు. లేని యెడల మీ ఖాతాలో లావాదేవీలు అనుమతించబడవు. దయచేసి గమనించగలరు. సం/- అధీకృత సంతకందారు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం. 56 నుండి 58/2026-27 తేది: 23.07.2026
ఇరిగేషన్ డివిజన్, గుంటూరు-గుంటూరు జిల్లా నందు 2 చెరువులు మరియు గుంటూరు చానల్ యొక్క హెడ్ రెగ్యులేటర్ యొక్క పునరుద్ధరణ కొరకు 3 పనులకు అంచనా విలువ: రూ. 29.56 లక్షలకు టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్లు దాఖలు చేయుటకు చివరి తేది: 27.07.2026, సా.5.00గం.ల వరకు. వివరాలను www.tender.apeprocurement.gov.in లో పొందగలరు. ఫోన్: 0863-2234193.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, ఇరిగేషన్ డివిజన్, గుంటూరు.
DIPR.NO. 21013/CL/ADVT/1/1/2022-23 తేది: 24.07.2026

25-7pg4_25-7pg4.qxd 24/Jul/26 10:29 PM Page 1




వార్త

అందరికీ ఆశయాలుంటాయి. కాని కొందరు మాత్రమే ఆలోచిస్తారు, చాలా కొందరు మాత్రమే ఆచరిస్తారు.

న- బిషప్ బక్కిలీ


# అవినీతే అసలు సమస్య!

ధర్మాధర్మాలు తెలియవని కాదు, మొదటి ఒంటబట్టడం లేదు, రెండోది వదిలిపెట్టడం లేదు అన్నట్లుగా ఉంది అవినీతి విషయంలో కొందరు పెద్దలు వ్యవహరిస్తున్న తీరు. ఏ కోణంలో చూసినా అవినీతికిపాల్పడడం ధర్మకాదని అందరికి తెలిసిందే. పైగా అది చట్టబద్ధనేరం కూడా. కానీ దేశంలో అవినీతికి పాల్పడేవారి సంఖ్య కోట్లల్లో ఉంది. అవినీతి నిర్మూలనకు దశాబ్దాల తరబడి ప్రయత్నాలు జరుగుతున్నా ఏమాత్రం తగ్గడం లేదు. అంతకంతకు పెరిగిపోతున్నది. ముఖ్యంగా ఉన్నతస్థాయిలో జరుగుతున్న అవినీతికి అడ్డూఅదుపు లేకుండాపోతున్నది. కిందిస్థాయిలో అవినీతిని అరికట్టే ముందు ఉన్నతస్థాయిలో ముఖ్యంగా రాజకీయ అవినీతిని నియంత్రించే ప్రయత్నం చేస్తే బాగుంటుందనే అభిప్రాయంతో గతంలో ఒక వ్యూహం ప్రకారం ఏకంగా లంచం ఇచ్చి ఒకమంత్రిని ఇంటికి పంపారు. అప్పట్లో అది రాజకీయసంచలనం రేపింది. ఈ డబ్బు సంపాదనలో మంచి, చెడు ఆలోచించడం లేదు. అందుకే ప్రభుత్వం చేపడుతున్న అనేక పథకాలు క్షేత్రస్థాయిలో పూర్తిగా అర్హులైన లబ్ధిదారులకు అందడం లేదు. ప్రాజెక్టుల నిర్మాణాల్లో వేలాది కోట్ల రూపాయలు పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వాలు మారి కొత్త ప్రభుత్వాలు వచ్చినప్పుడు అంతకుముందు ఉన్న ప్రభుత్వాలు కీలక బాధ్యత వహించినవారిపై విచారణ జరిపించడం సర్వసాధారణమైపోయింది. వాటిల్లో కూడా సమర్థవంతంగా దర్యాప్తు జరిపి తిరుగులేని రుజువులతో న్యాయస్థానాల ముందు దోషులను నిలబెట్టలేక పోతున్నారు. ఫలితంగా అన్ని పథకాల్లోనూ, కార్యక్రమాల్లోనూ ప్రాజెక్టుల నిర్మాణాల్లోనూ అవినీతి చోటు చేసుకుంటున్నది. నిరుపేదలకు ఇచ్చే ఇళ్ల కేటాయింపుల్లోకానీ, వృద్ధాప్యపు పెన్షన్లు, సంక్షేమ కార్యక్రమాలు ఏవి తీసుకున్నా దేశవ్యాప్తంగా దళారులు ఈ అవినీతి అధికారులతో చేతులు కలిపి ప్రజా సొమ్మును భోంచేస్తున్నారు. అవినీతిని అడ్డుకొని ప్రజాధనాన్ని కాపాడేందుకు ఏనాటి నుంచో ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాష్ట్రస్థాయిలో అవినీతి నిరోధక శాఖ, కేంద్రస్థాయిలో సిబిఐతోపాటు ఇడి, నిఘా విభాగాలు మరెన్నో పనిచేస్తున్నాయి. ఎన్నో చట్టాలు చేశారు. జీతభత్యాల రూపేణా కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. వేలాది మంది అధికారులను వలపన్ని పట్టుకుంటున్నారు. మరెందరినో ఆదాయానికి మించిన ఆస్తులను కూడబెట్టినందుకు కేసులు నమోదు చేసి అరెస్టు చేసి జైళ్లకు పంపుతున్నారు. ఎంతమందిపై చర్యలు తీసుకున్నా అవినీతిని నియంత్రించలేకపోతున్నారు. అధికారుల్లో, ఉద్యోగుల్లో ఉన్న అవినీతి ఒక ఎత్తు అయితే కీలక పదవులు నిర్వహిస్తున్న కొందరు పెద్దలు, ప్రజాసేవ ముసుగులో చెలామణి అవుతున్న కొంత మంది రాజకీయ నాయకులు, దళారుల వల్లనే పరిస్థితి అదుపు తప్పిపోతున్నదేమోననిపిస్తున్నది. వారి రాజకీయ అధికారం ధాటికి నిజాయితీ, సమర్థులైన అధికారులు సైతం నిస్సహాయంగా ఉండిపోతున్నారు. అవినీతి మూలంగా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు ఎన్ని లక్షలకోట్ల రూపాయలు భారత్‌కోల్పోయిందో అంచనాకే అందదు. అవినీతికి ఆరోప్రాణమైన కొందరు నేతలే చట్టానికి చుట్టాలై చక్రం తిప్పుతున్న సంఘటనలు గతంలో ఎన్నో బయటపడ్డాయి. పశ్చిమ బెంగాల్ మాజీ మంత్రి ఒకరు ఉపాధ్యాయుల నియామక కుంభకోణంలో కోట్ల రూపాయలు దిగమింగి తన ఆప్త మిత్రురాలి ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా దాచిపెట్టిన వైనాన్ని గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రట్టు చేసింది. కర్ణాటకలో బాధ్యత కలిగిన మంత్రి తన చావుకు కారణమని ఆ మధ్య ఒక యువ కాంట్రాక్టరు ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో తప్పని పరిస్థితుల్లో ఆ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చింది. సబ్బుల తయారీలో ముడిసరుకుల టెండర్ ఆమోదముద్ర పొందడానికిలంచం ముట్టచెప్పాల్సిందేనని కాంట్రాక్టరుగా ఆ ప్రాంతపు ప్రజా ప్రతినిధి తన కుమారుడికి అప్పగించడంతో ఏకంగానలభై లక్షల రూపాయలు తీసుకుంటూ లోకాయుక్త పోలీసులకు చిక్కుకున్నారు. అంతేకాదు సాక్ష్యాత్తు హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో లక్షలాది రూపాయల నోట్లకట్టలు బయటపడ్డాయి. రాజ్యాంగంకల్పించిన రక్షణ వల్ల ఆయనపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేని పరిస్థితి. దీంతో ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో, ఎవరు ఎందుకోసం ఇచ్చారో అనే ప్రశ్నలకు జవాబు దొరకలేదు. అయితే చివరకు ఆయన ఆ పదవి నుంచి వైదొలగాల్సివచ్చింది. ఒడిశాలో సబ్‌కలెక్టర్‌గా పని చేస్తున్న ఒక ఐఎఎస్ అధికారి పదిలక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఆయన ఇంట్లో సోదాలు చేస్తే నలభై లక్షలకుపైగా నగదును అధికారులు కనుగొన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ఎసిబి దాడుల్లో వందలాది కోట్ల రూపాయల విలువైన ఆదాయానికి మించిన ఆస్తులను కనుగొంటున్నారు. అరెస్టులు చేస్తున్నారు. జైళ్లకు పంపుతున్నారు. అయినా ఈ అవినీతి ఆగడం లేదు. ఎంతో మంది ఉన్నతాధికారులపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేసి చర్యలకు సిద్ధమైనా అనుమతి లేక ఆగిపోయిన సంఘటనలు కోకొల్లలు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ కమిషన్ రాంచంద్ర సమాల్ బయటపెట్టిన విషయాలు అద్దంపడుతున్నాయి. ఇవన్నీ మూడోకంటికి తెలియకుండా జరుగుతున్న అవినీతి సంఘటనలు. వాటిని కూడా పసిగట్టి పరిశోధించి బయటపెట్టగలుగుతున్నారు. బహటంగా నిర్లజ్జగాజరుగుతున్న అవినీతిని పసిగట్టకపోవడం అనే ప్రశ్న ఉదయించదు. ఏదిఏమైనా అవినీతి శృతిమించిపోతున్నది. ఉన్నత స్థాయిలో ప్రధానంగా రాజకీయ అవినీతి అరికట్టకుండా దేశం నుండి దాన్ని పారద్రోలడం అంత సులభం కాదు.



ఒక పని అంటే గాని, లేదా దానివల్ల కలిగే ఫలితాలంటే గానీ భయపడి, ఆ పని చేయడాన్ని మానుకోవడం చాలా చిన్నతనం.

మహాత్మా గాంధీ



జీవితంలో విజయాలకు చాలా ఉపాయాలున్నాయి. కానీ మనం పని చెయ్యనిదే అవి పనిచేయవు.

షేక్స్పియర్

# ప్రజావాక్కు



## విశ్వవిద్యాలయాలు ఆవిష్కరణల కేంద్రాలు

ఒక దేశభవిష్యత్తును నిర్ణయించేది దాని సహజ వనరులు మాత్రమేకాదు, సమస్యలను అవకాశాలుగా మలిచే పరిశోధన సామర్థ్యంకూడా. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన భారత్‌కు ప్రతిభ కొరత లేదు. కానీ ఆ ప్రతిభ భారతఅవసరాలకు అనుగుణమైన సాంకేతిక పరిష్కారాలుగా రూపాంతరం చెందుతున్నదా?అన్న ప్రశ్నకు సంతృప్తికర సమాధానం ఇంకా కనిపించడం లేదు. విదేశాల్లో విజయవంతమైన నమూనాలను అనుసరించడం తాత్కాలిక ప్రయోజనం కలిగించవచ్చు. అయితే భారత వాతావరణం, సామాజిక పరిస్థితులు, గ్రామీణ జీవనం, ఆర్థిక సామర్థ్యానికి సరిపోయే స్వదేశీ సాంకేతికతను అభివృద్ధి చేసినప్పుడే నిజమైన ఆత్మనిర్భరత సాధ్యమవుతుంది. పరిశోధన పత్రాల ప్రచురణతో విశ్వవిద్యాలయాల బాధ్యత ముగియదు. ఆ పరిశోధన రైతు పొలంలో, పరిశ్రమలో, ఆసుపత్రిలో, గ్రామీణపాఠశాలలో, ప్రజలదైనందిన జీవితంలోఉపయోగపడినప్పుడే దానివిలువ తెలుస్తుంది.

- సి.హెచ్.ప్రతాన్, శ్రీకాకుళం

## మన బాధ్యత

పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన జీవితానికి బలమైన పునాది. ఎక్కడ పడితే అక్కడ చెత్తను పారవేయడం వల్ల పరిసరాలు కలుషితమై అనేక వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంటుంది. మన ఇల్లు మాత్రమే కాదు, మన వీధి, మనగ్రామం, మనపట్టణం కూడా శుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలి. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, చెత్త బుట్టల్లో మాత్రమే వేయడంమంచి అలవాటు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమలు, ఈగలు వంటి హానికర కీటకాల పెరుగుదలను తగ్గించవచ్చు. పరిశుభ్రత అనేది మన సంస్కృతిని, క్రమశిక్షణను ప్రతిబింబించే గొప్ప లక్షణం. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను అలవాటుచేసుకోవాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## మంచి, చెడు

పచ్చటి పంట పొలాల మధ్య కొన్ని కలుపు మొక్కలు కూడా పెరుగుతుంటాయి. అలాగని పంటపొలాలను నాశనం చేయకూడదు. కలుపు గంజాయి మొక్కలను పీకి పారేయాలి. అలాగే కొన్నిసంస్థల్లో కార్యాలయాల్లో అవినీతిపరులుంటారు. వారి మూలంగా ఆ సంస్థ మొత్తానికి చెడ్డపేరు వస్తుంది. అలాంటి వారిని ఏరిపారేయాలి.

- ఎమ్.కిరణ్‌కుమార్, హైదరాబాద్

## విశ్వవిద్యాలయాలలో మృత్యుంజయ యాగాలా ?

2023లో అనంతపురం కేడీ యూనివర్సిటీలో జరిగిన ఒక సంఘటన యూనివర్సిటీ వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్‌లు ఇద్దరు సైన్స్ లోఅధ్యాపకులు. ఆయూనివర్సిటీలో ఒక రెండుమూడు నెలలలో ఇద్దరో ముగ్గురి స్టాఫ్, ఇద్దరో విద్యార్థులు చనిపోయారు. ఈమరణాలతో ఆవేదన చెందినరిజిస్ట్రార్ , వైస్ చాన్సలర్ ఇద్దరు చావులు ఆపేందుకు బోధన ఉద్యోగులు 500 ,ఇతర స్టాఫ్ 100చందాతో మృత్యుంజయ యాగం చేసేందుకు సిద్ధమయ్యారు. అప్పుడే హేతువదసంఘం దీన్నివ్యతిరేకిస్తూ పత్రికలకు లేఖలు వ్రాయటం జరిగింది. యూనివర్సిటీ పాలకులే ఇంతగా దిగజారి వ్యవహరిస్తుంటే ఏమిచెయ్యాలో సైన్స్ సంఘాలు ముందుకురావాలి. మొత్తానికి ఫిబ్రవరిలో జరగవలసిన మృత్యుంజయ యాగం రద్దు చేస్తున్నట్లు 23 తేదీ రిజిస్ట్రార్ ప్రకటించాడు. మన ఆలోచన గలిగిన ఒక అడ్వకేట్ ఏపీ హైకోర్టులో కేసువేశాడు. ఈవిషయం బయటకు రానీయకుండా, వస్తే పరువు పోతుందని రిజిస్ట్రార్ రద్దు చేశాడు. ఇలాంటివి ఈమధ్య చాలా జరుగుతున్నాయి. కానీ ఎవరు సరిగా స్పందించటం లేదు. సరిగా స్పందిస్తే ప్రభుత్వాలు చేస్తున్న మూఢ నమ్మకాలకు గుడ్ బై చెప్పవచ్చు. చాలా ఆపవచ్చు.

- నార్నె వెంకటసుబ్బయ్య ప్రకాశం జిల్లా

## భూ కబ్జాలను అరికట్టాలి

మండల కేంద్రాలలోని కొన్ని కాలనీలలో భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఎస్సీ ఎస్టీ వికలాంగులైన నిరుపేద బాధితులు రెవిన్యూ అధికారులకు, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా కూడా భూ సమస్యలు నెరవేరడం లేదు. అధికారుల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి తిరిగి విసిగి వేసారి పోతున్నారు. జిల్లా కలెక్టర్లు ఆయా జిల్లాలలోని రెవెన్యూ కార్యాలయాలలో, పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న భూకబ్జాల దరఖాస్తులు పరిశీలించి పరిష్కరించాలి. కాలనీకి సంబంధించిన కొలతలు, విస్తీర్ణం, సరిహద్దులు అన్ని రెవెన్యూ రికార్డులను చూసి పరిష్కరించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

## ఆపదలో మిత్రులను ఆదుకోవాలి

మానవ సమాజంలో ప్రతి వ్యక్తికి ఇతర వ్యక్తులతో నిరంతరం అవసరాలు ఉంటాయి. అవసరాలు లేవు వీడితో నాకేం పని అనేకోణంలో ఎప్పుడూ ఆలోచించదవద్దు. చిన్నచూపుచూడొద్దు విపత్కర పరిస్థితుల్లో ఆదుకున్న మిత్రులను జీవిత కాల మొత్తం రుణపడి ఉండాలి. మిత్రులందరూ కలిసిమెలిసిగా ఉండాలి. అందరుకలిసిఉంటేనే అన్నిసక్రమంగా జరుగుతాయి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# కల్తీ సామ్రాజ్యానికి కాపలాదారులెవరు?

*ఇలాంటి సంఘటనలు పరిశీలిస్తే సంబంధిత అధికారులకు తెలియకుండా ఈ కల్తీ జరిగే అవకాశం లేదని చెప్పొచ్చు. కల్తీని అడ్డుకునేందుకు అప్పుడప్పుడు ప్రయత్నాలు జరుగుతున్నా అవి సఫలీకృతం కావడం లేదు. పాలకులతోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ కల్తీని నిరోధించేందుకు నడుం కట్టాల్సిన సమయమిది. అయితే ఈ కల్తీపై యుద్ధం చేయాలంటే అంత తేలికయిన పనికాదు. అందుకు ఎంతో ఆత్మవిశ్వాసం, గుండెనిబ్బరం, చిత్తశుద్ధి కావాలి. ఒత్తిడిని తట్టుకునే ఓపిక, బెదరింపులను లెక్కపెట్టని సాహసం ఉండాలి. ఎదురయ్యే అవమానాలను సహించి సమన్వయంతో సొంత పనులకు జరిగే నష్టాలను తట్టుకునే త్యాగగుణాలు కలిగిన నిస్వార్థపరులు, త్యాగధనులు ముందుకువస్తే తప్ప ఈ కల్తీని అరికట్టడం సాధ్యంకాదేమో.*

దామెర్ల సాయిబాబ

ఇందుగలడు అందులేడని సందేహం వలదు చక్రి సర్వోపగతుండు ఎందెందు వెతికి చూసినా అందెందే గలడన్నట్లు ఇక్కడా, అక్కడా అని కాదు అంతటా 'కల్తీ' పొగమంచులా విస్తరించింది, విస్తరిస్తున్నది. కల్తీ వ్యాపారాన్ని నిరోధించేందుకు పాలకులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా మరెన్ని చట్టాలు చేస్తున్నా ఇంకెంత మంది అధికారులను నియమించి దాడులను నిర్వహిస్తున్నా ఆగడంలేదు. ఎటు చూసినా కల్తీమయమైపోతున్నది. తాగే నీటిలో కల్తీ, పాలల్లో కల్తీ, తినే పప్పులో కల్తీ, ఉప్పులో కల్తీ, నూనెలో కల్తీ, కారంలో కల్తీ, ఎరువుల్లో కల్తీ, విత్తనాల్లో కల్తీ, చివరకు ప్రాణాపాయస్థితి నుండి కాపాడే అత్యవసర మందుల్లో కల్తీ, ఇది అది అని కాదు, ఎటుచూసినా ఎక్కడ చూసినా కల్తీమయమైపోతున్నది. కల్తీ లేని సరుకులు లభ్యం అనేది గగనమైపోయింది. రానురాను కల్తీ మనిషి మనుగడకేప్రమాదం వాటిల్లే సూచనలు కన్పిస్తున్నాయి. కల్తీ ఇంత ప్రమాదకరంగా తయారవుతున్నా, చాపకింద నీరులా వ్యాపిస్తున్నా అడ్డగించేవారు, కనీసం నియంత్రించేందుకు త్రికరణ శుద్ధిగా ప్రయత్నాలు జరగడంలేదు. అసలు కల్తీకి, అవినీతికి అవినాభావ సంబంధం ఉంది. ఒకటిని విడిచి మరొకటి ఉండవు. ఉండలేవు కూడా. అందుకే పెరుగుతున్న అవినీతికి రెట్టింపు స్థాయిలో కల్తీ విస్తరిస్తున్నది. దీన్ని అరికట్టేందుకు పాలకులు చర్యలు తీసుకోలేదని చెప్పడం లేదు. చట్టాలు చేశారు. ఆ చట్టాలను అమలు చేసి కల్తీ పెరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించి దేశవ్యాప్తంగా లక్షలసంఖ్యలో అధికారులను నియమించారు. ఈ అధికారులు కానీ, ఆ చట్టాలుకానీ, కల్తీని నిరోధించలేకపోతున్నాయి. ఫలితంగా దేశంలో కోట్లాదిమంది తీవ్ర అనారోగ్యానికిగురై ఆస్పత్రుల పాలవుతుండగా ఇందులో కొందరు శాశ్వత రోగపీడితులు అవుతున్నారు. ఇంకొందరి ప్రాణాలను ఈ కల్తీ బలితీసుకుంటున్నది. ఈ సమస్యఇంత తీవ్రరూపంలో విలయతాండవం చేస్తున్నా ఆ వైపు పాలకులు అంతగా శ్రద్ధపెట్టడం లేదేమోననిపిస్తున్నది. అప్పుడప్పుడు జనం కన్నీళ్లు తుడవడానికి తమ ఉనికిని గుర్తుచేయడానికి అధికారులు దాడులు చేస్తున్నారేతప్ప ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్న ఈకల్తీని నిరోధించడానికి పటిష్టమైన నిర్మాణాత్మక చర్యలు చేపట్టి పునరావృతం కాకుండా చేయలేకపోతున్నారు. కట్టుదిట్టమైన చట్టం లేకపోవడం కూడా ఒక లోపంగా చెప్పవచ్చు. అందుకే ఈ కల్తీ వ్యాపారం చేస్తూ పట్టుబడినవారు జైలుకు వెళ్లినా తిరిగివచ్చి అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. ఈ కల్తీఎక్కడో మూడోకంటికి తెలియకుండా జరగడం లేదు. ఇందులో రహస్యం ఏమీలేదు. పరిశోధించి, రాత్రింబవళ్లు శ్రమించి మాటువేసి, పట్టుకోవాల్సిన పని అంతకంటే లేదు. కల్తీసరుకుల అమ్మకాలు రహస్యంగా జరగడం లేదు. ఇందులో దొంగచాటు అసలే లేదు. పబ్లిక్‌గా ప్రదర్శించి మరీ అమ్ము కుంటున్నారు. ఇదెక్కడో మారుమూల ప్రాంతాల్లో జరగడం లేదు. ఇక్కడా అక్కడా అని తేడా లేకుండా పట్టణాల్లోనూ, నగరాల్లోనూ చివరకు పాలకగణంతోపాటు అధికారులందరూ కొలువైఉన్నరాజధాని నగరాల్లో కూడా పెద్దఎత్తున ఈకల్తీ జరుగుతున్నది. అమాయక ప్రజలు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఆర్థికంగా నష్టపోతే పోయారు కానీ ఆరోగ్యాన్ని కోల్పోతున్నారు. క్షయ, కేన్సర్, ఊపిరితిత్తులు, గుండె జబ్బులు లాంటి రోగాలకు గురైకోలుకోలేక ఏళ్లతరబడి మంచానికి అంకితమై కృంగి కృశించి అసులువు బాస్తున్నారు. పసిపిల్లల నుండి వృద్ధుల వరకు వయసుతో సంబంధం లేకుండా ఏదో ఒక రూపంలో సేవించే పాలలో కూడా పెద్దఎత్తున కల్తీ జరుగుతున్నది. పెరుగుతున్న వినియోగానికి తగినట్టుగా పాల ఉత్పత్తి జర

**ఒక్క మాట**

గకపోవడంతో ఆ వ్యత్యాసాన్ని భర్తీ చేసేందుకు కల్తీపాలను తయారు చేసి అమ్ముకొంటున్నారు. ప్రమాదకరమైన రసాయనికాలు కలుపుతున్నట్లు కూడా సమాచారం. కొందరు వ్యాపారులు పశువుల్లో కృత్రిమంగా పాలఉత్పత్తిని పెంచేందుకు అత్యంత ప్రమాదకరమైన ఆక్సోడోసిన్ ఇంజక్షన్‌ను విచ్చలవిడిగా వాడుతున్నవైనం బయటపడుతున్నది. గతంలో ఇలాంటి ముఠాను అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ ఇంజక్షన్‌లు చేయడంవల్ల గేదె సహజంగా ఇచ్చే పాలకంటే రెండు, మూడు రెట్లు ఎక్కువగా ఇస్తాయంటున్నారు. ఈ ఇంజక్షన్ ఇచ్చిన పాలు తాగితే హార్మోన్ల సమతుల్యం దెబ్బతింటుందని చిన్నతనంలోనే మోకాళ్ల సమస్యలు, కిడ్నీ వ్యాధులు తదితర శారీరక రుగ్మతలు సంభవించే అవకాశం ఉన్నట్లు డాక్టర్లు అభిప్రాయపడుతున్నారు. నూనెకల్తీగురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదేమో. పశుకళేబరాల నుంచి తీసిన నూనె నిరాటంకంగా సరఫరా అవుతున్నట్లు అనేకసార్లు బయటపడింది. నెయ్యిలో కూడా భారీ ఎత్తున కల్తీ జరుగుతున్నది. గతవారంలో హైదరాబాద్‌లో పోలీసులుజరిపిన తనిఖీల్లో ఎనిమిది వందల యాభైకిలోలకు పైగా కల్తీనెయ్యి పట్టుబడింది. గతంలో కూడా భారీఎత్తు కల్తీనెయ్యి పట్టుబడిన సంఘటనలున్నాయి. చివరకు కోట్లాది మంది ఇలవేల్పు తిరుపతి వెంకన్న కూడా ఈ కల్తీ నెయ్యి నుండి తప్పించుకోలేకపోయారు. ఇక నిరుపేదల దగ్గరనుండి కోటీశ్వరుల వరకు నిత్యం వాడే కాఫీ, టీ పొడుల్లో భారీ ఎత్తున కల్తీ జరుగుతున్నట్లు ఇటీవల బయటపడుతున్న సంఘటనలు చెబుతున్నాయి. ఇవేమీ కొత్త విషయాలు కాదు. అప్పుడప్పుడు అధికారులు జరుపుతున్న దాడుల్లో వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి టీ పొడులు వాడితే తొలిదశలో అజీర్ణ సమస్య ప్రారంభమై క్రమంగా అల్సర్‌గా మారి తుది దశలో కేన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందని డాక్టర్లు చెబుతున్నారు. అలాగే ప్రజలు నిత్యంవాడే కారం, పసుపు, బియ్యం నిత్యావసర వస్తువుల్లో కూడా కల్తీకి అదుపులేకుండాపోతున్నది. కారంపొడిలో రంపపు పొట్టు, కందిపొట్టు పొడిని కలుపుతున్నారు. ప్రభుత్వ వసతిగృహాలకు సరఫరా అవుతున్న సరుకులను ఒక్కసారి తనిఖీ చేస్తే, వాటి నాణ్యతను పరిశీలిస్తే అనేక ఆశ్చర్యకరమైన అంశాలు వెలుగులోకి వస్తాయి. ఇక మందుల విషయం వేరేచెప్పక్కర్లేదు. భారీఎత్తున నాసిరకం, నకిలీ మందులు వినియోగమవుతున్నాయి. రోగులకు తెలిసే అవకాశం లేదు. కనుక ఇష్టానుసారంగా చేస్తున్నారు. ప్రాణాధార మందులు కాస్త అటుఇటూ అయినా ప్రాణాలు కబళిస్తాయి. ఇది తెలియందికాదు. కనీసం వీటి విషయంలో నిర్దిష్టమైన చర్యలు తీసుకొని కల్తీ, నాసిరకం మందులను ఏరివేసి బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోలేకపోతున్నారు. ముఖ్యంగా పశువుల మందుల్లో కల్తీజరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పశుసంవర్ధకశాఖకు సరఫరా అవుతున్న మందుల్లో నాసిరకం కాలం చెల్లినవి చేర్చడంతో భారీఎత్తున గోల్‌మాల్ జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పెట్రోలు, డీజిల్‌లాంటి వాటిల్లో కూడా కల్తీ తక్కువేమీ జరగడం లేదు. దీంతో వాయుకాలుష్యం పెరిగి ప్రజలు అనేక రకాల జబ్బులకు లోనవుతున్నారు. ఇక ఈ కల్తీ అన్నదాతలను కోలుకోలేకుండా చేస్తున్నది. విత్తనాల దగ్గరనుంచిఎరువులు, క్రిమిసంహారక మందులు, నాసిరకం, నకిలీవి ఎక్కువకావడంతో రైతులకు కష్టాలు తప్పడంలేదు. గతవారంలోనల్గొండ జిల్లాలో ఒక రైతుకు ఇచ్చిన సమాచారంతో డిఎపిఎరువు నాణ్యతలో అనుమానం రావడంతో క్షుణ్ణంగా పరిశీలించడంతో అది నకిలీదని తేలింది. వివరాలు సేకరించి కూపీ లాగడంతో హైదరాబాద్‌లో ఒక గోదాములో రహస్యంగా ఈ నకిలీ డిఎపి ఎరువులుతయారు చేస్తున్నట్లు బయటపడింది. ఏకంగా వెయ్యి బస్తాలకుపైగా డిఎపి ఎరువులను అధికారులు కొనుగొన్నారు. కేసును నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు. నాగర్‌కర్నూల్‌జిల్లాలో నాసిరకం, నకిలీలు బయటపడినా చర్యలు తీసుకునే విషయంలో మీనమేషాలు లెక్కబెడుతున్నట్లు చెప్తున్నారు. ఇలాంటి సంఘటనలు పరిశీలిస్తే సంబంధిత అధికారులకు తెలియకుండా ఈ కల్తీ జరిగే అవకాశం లేదని చెప్పొచ్చు. కల్తీని అడ్డుకునేందుకు అప్పుడప్పుడు ప్రయత్నాలు జరుగుతున్నా అవి సఫలీకృతం కావడంలేదు. పాలకులతోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ఈకల్తీని నిరోధించేందుకు నడుంకట్టాల్సిన సమయమిది. అయితే ఈ కల్తీపై యుద్ధం చేయాలంటే అంత తేలికయిన పనికాదు. అందుకు ఎంతో ఆత్మవిశ్వాసం, గుండె నిబ్బరం, చిత్తశుద్ధి కావాలి. ఒత్తిడిని తట్టుకునే ఓపిక, బెదరింపులను లెక్కపెట్టని సాహసం ఉండాలి. ఎదురయ్యే అవమానాలను సహించి సమన్వయంతో సొంత పనులకు జరిగే నష్టాలను తట్టుకునే త్యాగగుణాలు కలిగిన నిస్వార్థపరులు, త్యాగధనులు ముందుకు వస్తే తప్ప ఈ కల్తీని అరికట్టడం సాధ్యంకాదేమో. ●

# బిసిలకు సామాజిక న్యాయం జరుగుతున్నదా?

బూర్గుపల్లి కృష్ణ యాదవ్

భారత రాజ్యాంగం ప్రతిపౌరుడికి సమానత్వం, సామాజిక న్యాయం, సమాన అవకాశాలను కల్పించాలనే ఉన్నత ఆశయాలతో రూపొందించబడింది. అయితే స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా, దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్న వెనుకబడిన తరగతుల (బీసీలు)కు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా పూర్తిస్థాయి న్యాయం ఇంకా జరగలేదు. అందుకే పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలనే డిమాండ్ దేశవ్యాప్తంగా బలంగా వినిపిస్తోంది. బీసీలు వ్యవసాయం, పశుపోషణ, చేతివృత్తులు, చిన్నవ్యాపారాలు, సేవా రంగం వంటి అనేక రంగాలకు వెన్నెముకగా ఉన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో కీలకమైనది. అయినప్పటికీ, నిర్ణయాత్మక స్థాయిలో వారికి తగిన ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల వారి సమస్యలు, అవసరాలు ప్రభుత్వ విధానాల్లో సరైన స్థానం పొందడం లేదని నిత్య సత్యం. భారత పార్లమెంట్‌లో అనేక కీలక బిల్లులు తక్కువ సమయంలోనే ప్రవేశపెట్టి ఆమోదించబడిన సందర్భాలున్నాయి. అలాగే 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ బిల్లు కూడా వేగంగా ఆమోదం పొందింది. అదే విధంగా, ఎన్నో దశాబ్దాలుగా బీసీలు కోరుతున్న రాజకీయ రిజర్వేషన్ బిల్లును కూడా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చర్చించి నిర్ణయం తీసుకోవాలి. రాజకీయ ప్రాతినిధ్యం అనేదికేవలం పదవుల కోసంకాదు. ప్రజల సమస్యలను చట్టసభల్లోప్రస్తావించి, వారికి అవసరమైన చట్టాలు, సంక్షేమ పథకాలు, బడ్జెట్ కేటాయింపులు సాధించడానికి అది కీలకసాధనం. అందుకే లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్ర శాసనసభల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించే విధంగా రాజ్యాంగబద్ధమైన చర్యలు అవసరం. బీసీల సంక్షేమానికి కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలనే డిమాండ్ కూడా చాలా కాలంగా కొనసాగుతోంది. ప్రస్తుతం బీసీలకు సంబంధించిన అంశాలు వివిధశాఖల పరిధిలో ఉండటంతో సమన్వయం లోపిస్తోందని, ప్రత్యేకశాఖ ఉంటే వారి అభివృద్ధికి దీర్ఘకాలిక విధానాలు అమలు చేయడం సులభమవుతుంది. అలాగే క్రీమీలేయర్ విధానంపై కూడా బీసీసంఘాలుపునః సమీక్ష కోరుతున్నాయి. ఈ విధానం వల్ల అనేక మంది అర్హులైన విద్యార్థులు, యువత అవకాశాలు కోల్పోతున్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం విస్తృత చర్చ నిర్వహించి, సామాజిక న్యాయం దృష్ట్యా తగిన నిర్ణయం తీసుకోవాలి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో బీసీలపై వివక్ష, సామాజిక అవమానాలు, దాడులఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. అలాంటి సంఘటనలను అరికట్టేందుకు ప్రత్యేక బీసీ అట్రాసిటీ చట్టం తీసుకురావాలి. చట్టపరమైన రక్షణతో పాటు బాధితులకు త్వరిత న్యాయంఅందేలా చర్యలుతీసుకోవాలి. దేశ జనాభా గణనలో బీసీ కులాల గణన నిర్వహించడం కూడా అత్యంత అవసరం. కచ్చితమైన జనాభాగణాంకాలు ఉంటేనే సంక్షేమపథకాల రూపకల్పన, నిధుల కేటాయింపు, రిజర్వేషన్ విధానాల అమలులో పారదర్శకత పెరుగుతుంది. చట్టసభల స్థానాలపెంపు వంటి కీలక నిర్ణయాలు తీసుకునే ముందు బీసీలకు చట్టసభలలో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి. చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు పెంచకుండా పార్లమెంటులో డీలిమిటేషన్ బిల్లు ఆమోదంపొందితే రాజకీయ, సామాజిక, ఆర్థిక అసమానతలు మరింత పెరిగే అవకాశం ఉంది. అదేవిధంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు రాజకీయాలకు అతీతంగా ఏకమై బీసీల హక్కుల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. రాజకీయ విభేదాల కంటే రిజర్వేషన్ల సాధనకై కేంద్రంపై ఒత్తిడి తేవాలి. బీసీల సమస్యలు ఏ ఒక్క రాష్ట్రానికి పరిమితం కావు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల జీవనప్రమాణాలు, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశాలివి. అందువల్ల కేంద్రం అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. ●

# చట్టం అమలులో సమానత్వం అవసరం



ఆరెల్లి మల్లేష్

ప్రజాస్వామ్యంలో అత్యంత కీలక బాధ్యత ప్రజా శాంతిభద్రతలను పరిరక్షించడం. అదే సమయంలో ప్రతి పౌరుడి గౌరవం, స్వేచ్ఛ, గోప్యతను కాపాడటం కూడా రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతే. ఈ రెండు విలువల మధ్య సమతుల్యతను కాపాడేందుకు రూపొందించిన పరిపాలనా సాధనాల్లో రౌడీ షీట్ ఒకటి. అయితే పర్యవేక్షణ ఉద్దేశం శిక్ష విధించడం కాదు. ప్రజా శాంతిభద్రతలకుముప్పు ఉందని అందుబాటులో ఉన్న సమాచారం, రికార్డుల ఆధారంగా సంబంధిత అధికారులు అంచనా వేసిన సందర్భాల్లో, అలాంటి వ్యక్తుల కార్యకలాపాలను చట్టపరమైన పరిధిలో పర్యవేక్షించడం మాత్రమే దీని ఉద్దేశం. అందువల్ల ఇది ప్రతి కేసులోనూ, ప్రతి నిందితుడిపైనా స్వయంచాలకంగా వర్తించే వ్యవస్థ కాదు. అదే సమయంలో ఇది పౌర హక్కులను అనవసరంగా పరిమితం చేసే సాధనంగా మారకూడదు. ఈ సమతుల్యతే చట్టపాలనకు అసలు పరీక్ష. రౌడీ షీట్ వ్యవస్థకు రాష్ట్రానుసారం పోలీస్ స్టాండింగ్ ఆర్డర్స్‌లో భిన్నమైన నిబంధనలు ఉండవచ్చు. నమోదైన రికార్డులు, అలాగే ప్రజా శాంతిభద్రతలకు నిరంతర ముప్పు ఉందనే పరిపాలనా అంచనాల ఆధారంగా వ్యక్తులపై నిఘా ఉంచేందుకు రౌడీ షీట్ వ్యవస్థను ఉపయోగిస్తారు. హత్య, హత్యా యత్నం, దోపిడీ, బలవంతపు వసూళ్లు వంటి తీవ్రమైన లేదా పునరావృత నేరాలకు సంబంధించిన నమోదైన కేసులు, అందుబాటులో ఉన్న సమాచారం, సంబంధిత చట్టపరమైన ప్రమాణాల మేరకు పరిశీలనలో భాగం కావచ్చు. అయితే కేవలం కేసు నమోదు కావడం, దర్యాప్తు కొనసాగుతుండడం లేదా ఆరోపణలు ఎదుర్కొనడం మాత్రమే ప్రతి సందర్భంలో స్వయంచాలకంగా ఇటువంటి చర్యకు ఏకైక ఆధారం కాకూడదు. దళిత గిరిజన వర్గాలకు రాజ్యాంగబద్ధంగావచ్చిన వజ్రాయుధమే అట్రాసిటీ ఆక్ట్ దాన్ని కాపాడే దిశగా ప్రభుత్వాల నిర్ణయాలు గాని, అధికారయంత్రాంగం కూడా ముందుకు సాగాలి. ఈ మధ్య సరైన విచారణ లేకుండా తరుచూ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం, దాంతో నిందితులు పరస్పర కేసులు నమోదు అవ్వడంతో చట్టం నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉంది. కావున సంబంధిత అధికారులు సేకరించిన సమాచారం, వ్యక్తి గత నేరచరిత్ర, నేరాల పునరావృతం, ప్రజా శాంతిభద్రతలకు భవిష్యత్తులో ఏర్పడే ముప్పు, అందుబాటులో ఉన్న ఆధారాలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరమే పరిపాలనా నిర్ణయం తీసుకోవాలి. అలాంటి నిర్ణయాలు కూడా కాలానుగుణ సమీక్షకు లోబడి ఉండాలి. భారత రాజ్యాంగంలోని



ఆర్టికల్ 14 చట్టం ముందు సమానత్వాన్ని, ఆర్టికల్ 19(1)(ఏ) భావ ప్రకటనా స్వేచ్ఛను, ఆర్టికల్ 21 గౌరవప్రదమైన జీవితం, వ్యక్తిగత స్వేచ్ఛను హామీ ఇస్తాయి. జస్టిస్ కె.ఎస్. పుట్టస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2017) కేసులో సుప్రీంకోర్టు, వ్యక్తిగత గోప్యత కూడా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసింది. మరోవైపు నేరాలను అరికట్టడం, ప్రజల భద్రతను కాపాడడం పోలీసు శాఖకు చట్టం అప్పగించిన బాధ్యత. అందువల్ల ప్రజాభద్రత, పౌర హక్కులు అనే రెండు అంశాలను పరస్పర విరుద్ధాలుగా కాకుండా పరస్పర పూరకాలుగా చూడాలి. పరిపాలనా అధికారాల వినియోగం కూడా న్యాయ సమీక్షకు అతీతం కాదు. అందువల్ల ప్రతి నిర్ణయం చట్టబద్ధత, సహేతుకత, నిష్పాక్షికత, అవసరానుగుణత వంటి ప్రమాణాలను తట్టుకోవాలి. నిఘా చర్యలు అవసరమైన సందర్భాల్లో మాత్రమే చట్టబద్ధంగా అమలుకావాలి. వాటి అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, కాలానుగుణ సమీక్ష వంటి సూత్రాలు పాటించబడాలి. ఒక వ్యక్తి తనపై తీసుకున్న చర్య చట్టబద్ధం కాదని భావిస్తే, సంబంధిత ఉన్నతాధికారులను లేదా భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 226 కింద హైకోర్టును ఆశ్రయించే హక్కు కలిగి ఉంటాడు. ఇదే రాజ్యాంగబద్ధమైన పరిష్కార మార్గం. ఈ నిఘా విధానంపై జరుగుతున్న చర్చ ఏ ఒక్క వ్యక్తి గురించో లేదా ఏ ఒక్క కేసు గురించో మాత్రమే కాదు. కొన్ని సందర్భాల్లో క్రిమినల్ కేసులు లేదా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (దౌర్జన్యాల నిరోధక) చట్టం, 1989 కింద నమోదైన కేసుల అనంతరం తీసుకునే పరిపాలనా చర్యల విషయంలో, సంబంధిత చట్టపరమైన ప్రమాణాలు సమానంగా పాటించబడుతున్నాయా అనే ప్రశ్నలు ప్రజా చర్చలో వినిపిస్తున్నాయి. అలాంటి ప్రతి సందర్భంలోనూ సంబంధిత చర్యలు వాటి స్వంత చట్టపరమైన ప్రమాణాలు, అందుబాటులో ఉన్న ఆధారాలు, వాస్తవ పరిస్థితుల ఆధారంగానే సమీక్షించబడాలి. అయితే ప్రతి కేసు దాని సొంత వాస్తవాలు, చట్టపరమైన నిబంధనలు, సంబంధిత అధికారుల నిర్ణయాల ఆధారంగానే పరిశీలించబడాలి. ఒక సందర్భాన్ని ఆధారంగా చేసుకుని సాధారణ నిర్ధారణలకు రావడం సముచితం కాదు. ప్రజా భద్రత కోసం రాష్ట్రానికి కల్పించిన అధికారాలు, పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు – ఈ రెండింటి మధ్య సమతుల్యతను కాపాడడమే ప్రజాస్వామ్య స్ఫూర్తి. చట్టం కఠినంగా ఉండటం కంటే, అది న్యాయంగా, పారదర్శకంగా, వివక్ష లేకుండా అమలు కావడమే ప్రజాస్వామ్యానికి మరింత అవసరం. ఇలాంటి పరిపాలనా చర్యలకు స్పష్టమైన కారణాలు, నమోదైన ఆధారాలు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ, కాలానుగుణ సమీక్ష వంటి అంశాలు నిరంతరం పాటించబడితే ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది. అదే సమయంలో ప్రజా శాంతి భద్రతలకు నిజమైన ముప్పుగా వ్యవహరించే వ్యక్తులపై చట్టబద్ధంగా, సమర్థవంతంగా చర్యలు తీసుకోవడం కూడా రాష్ట్రం బాధ్యత. ప్రజాస్వామ్యంలో పౌర హక్కులు, పోలీసు అధికారాలు, న్యాయపాలన – ఈ మూడు ఒకదానికొకటి ప్రత్యర్థులు కావు. పరస్పర పూరకాలు. చట్టం ముందు అందరూ సమానులే అనే రాజ్యాంగ సూత్రం, చట్టం అమలులో

25MN 5 PG-GNT_25MN 5 PG-GNT.qxd 25-07-2026 AM 01:47 Page 1



## పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే,ప్రభుత్వలక్ష్యం: దుగ్గిరాల మార్కెట్ యార్డుమాజీ ఛైర్మన్ సాంబిరెడ్డి.

కొల్లిపర, జూలై 24(ప్రభాతవార్త): విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే ప్రభుత్వ లక్ష్యమని దుగ్గిరాల మార్కెట్యార్డుమాజీ ఛైర్మన్ వంగా సాంబిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గ్రామాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయ ల ఆత్మీయ సమావేశాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి,అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలల్లో ఉన్న మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించడంతో పాటు ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ, తల్లికి వందనం నగదు ఎంత మంది పిల్లలుంటే అంత మందికి బ్యాంకు ఖాతాలో జమ అయినట్లు చెప్పారు.కొల్లిపర మండల తహసీల్దార్ సిద్ధార్ల మాట్లాడుతూ,విద్యార్థులు చెడువ్యసనాలకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకోకుండా సన్మార్గంలో నడవాలన్నారు.ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యను అందిస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు తన వంతు సహాయంగా సాంబిరెడ్డి అధికారులతో కలిసి నోట పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో ఝాన్సీలత, గ్రామపెద్దలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)కు సంబంధించి ముగిసిన గడువు

### అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ ఐ. కిషోర్

గుంటూరు కార్పొరేషన్, జులై 24 ( ప్రభాత వార్త ) : కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)కు సంబంధించి గడువు శుక్రవారంతో ముగిసిన్నందున సర్ లో సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ ఐ. కిషోర్ తెలిపారు. శుక్రవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కు సంబంధించి నగరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ బి.యల్.ఓలు ఇప్పటికే నగరంలో ఓటర్లకు ఎన్యుమరేషణ్ ఫారాలను అందజేయుట, వాటి డిజిటలైజేషన్ ప్రక్రియ నూరు శాతం పూర్తైయ్యందన్నారు. ప్రస్తుతం గుంటూరు నగరంలో జరుగుతున్న సర్ ప్రక్రియను నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది, బి.యల్.ఓ లు ఎటువంటి తప్పులు లేకుండా ట్రాన్స్పరెంట్ గా చేశారని తెలియచేశారు. బి.యల్.ఓ లు స్థానిక బి.యల్.ఏ ల తో సమావేశాలు ఏర్పాటు చేసి, జరిగిన మీటింగ్ యొక్క మినిట్స్ ను అప్ లోడ్ చేయాలని తెలియచేశారు. సర్ ప్రక్రియకు గడువును జూలై 24 వ తేదీతో ముగిసిన నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు మ్యాపింగ్ లో, ఏ.యస్.డి (అబ్సెంట్, షిఫ్టింగ్, డెత్, డూప్లికేట్)లో ఏమైనా సందేహాలు లేదా తప్పులు ఉన్నట్లు గుర్తించినట్లైతే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే వాటిని పరిష్కరిస్తామని తెలియచేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 31 మొదటి డ్రాఫ్ట్ పబ్లికేషణ్ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశం నందు ఈస్ట్ ఏఈఆర్ఓ సాంబశివరావు,డిటిలు నాగమల్లేశ్వరావు, సుధా కిరణ్మయి, మరియు ఎలక్షన్ సూపరింటెండెంట్ బాలాజీ బాష, రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి ఓంకార్, సతీష్, జీలాని, బిజెపి నారాయణ రెడ్డి, కుమార్, వైస్సార్సీపీ మహేష్ రెడ్డి, కిషోర్ బాబు, బియస్పి వాసు, జనసేన త్రినాద్, కాంగ్రెస్ షేక్ జానీ బాషా, సిపిఐ(యం) ఖాసిం షహేద్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన డీఎస్పీ

గుంటూరు క్రైమ్,జులై24,ప్రభాతవార్త: గుంటూరు తూర్పు సబ్‌డివిజన్ డీఎస్పీగా నియమితులైన టి. సీతారాం శుక్రవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎస్పీ నూతన బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీకి శుభాకాంక్షలు తెలియజేసి,ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.అనంతరం టి.సీతారాం గుంటూరు నగరంలోని లాలాపేటలో ఉన్న గుంటూరు తూర్పు సబ్‌డివిజన్ డీఎస్పీ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పోలీసు అధికారులు,సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.టి. సీతారాం గతంలో మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో డీఎస్పీగా విధులు నిర్వహించి,పరిపాలనాపరమైన అనుభవంతో పాటు సమర్థవంతమైన సేవలను అందించారు.ఇప్పుడు గుంటూరు తూర్పు సబ్‌డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం ద్వారా శాంతి భద్రతల పరిరక్షణ,నేర నియంత్రణ,ప్రజలకు త్వరితగతిన పోలీసు సేవలు అందించడం,మహిళలు,చిన్నారుల భద్రత,మాదకద్రవ్యాల నిర్మూలన,ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ గుంటూరు తూర్పు సబ్‌డివిజన్ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్,బాధితులకు సత్వర న్యాయం,పెండింగ్ కేసుల వేగవంతమైన దర్యాప్తు,నేరాల నియంత్రణ,కమ్యూనిటీ పోలీసింగ్‌కు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని డీఎస్పీ టి. సీతారాంకి సూచించారు.




## ఐదుగురు వ్యక్తులు అరెస్ట్

గుంటూరు క్రైమ్,జులై24,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత మత్తు టాబ్లెట్ల విక్రయం,ఇంజెక్షన్ రూపంలో వినియోగంపై టాస్క్ ఫోర్స్ బృందం దాడులు నిర్వహించి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుంది. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు,డీఎస్పీ అలహరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో టాస్క్ ఫోర్స్ సీఐ2 ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రైలుపేట 3వ లైన్‌లో ఉన్న శ్రీ సత్య గ్రాండ్ లాడ్జిపై దాడులు నిర్వహించారు.లాడ్జిలో టాపెంటాడోల్ 100 మి.గ్రా నిషేధిత మత్తు టాబ్లెట్లను నీటిలో కలిపి సిరంజుల ద్వారా చేతి నరాల్లోకి ఇంజెక్ట్ చేసుకుంటున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో షేక్ మహబూబ్ సుభాని,షేక్ సమీర్,షేక్ నాగూర్,పల్లా నాగమధు రెడ్డి అనే నలుగురి వద్ద టాపెంటాడోల్ టాబ్లెట్లు,సిరంజులు స్వాధీనం చేసుకున్నారు.విచారణలో పాతగుంటూరుకు చెందిన షేక్ ఫిరోజ్ అనే వ్యక్తి ఒక్కో టాబ్లెట్‌ను రూ.300 చొప్పున విక్రయిస్తున్నట్లు వెల్లడించారు.అనంతరం షేక్ ఫిరోజ్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతని వద్ద 15 షీట్లు (మొత్తం 150 టాపెంటాడోల్ టాబ్లెట్లు) లభించాయి. వీటి విలువ సుమారు రూ.45 వేలుగా పోలీసులు అంచనా వేశారు. ఈ ఘటనలో మొత్తం ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, 15 షీట్లు (150) టాపెంటాడోల్ టాబ్లెట్లు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.నిందితులను,స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి విచారణ నిమిత్తం కొత్తపేట పోలీసులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు

## కాకాని శివాలయములో త్రయాహ్నిక దీక్షతో సహస్రఘటాభిషేకం

గుంటూరు, జులై 24,ప్రభాతవార్త :ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో కొన్ని ప్రాంతాలలో వర్షాభావ పరిస్థితి నెలకొని ఉన్న దృష్ట్యా అనావృష్టి నివారణార్ధం దేశము, రాష్ట్రము పాడి పంటలతో సుభిక్షముగా ఉండుటకు మరియు లోకకళ్యాణార్ధం, రాష్ట్రానికి వరుణ దేవుని అనుగ్రహము కొరకు వరుణ సూక్త పారాయణములు, జపములు, రుద్రహోమములు మరియు సహస్ర ఘటాభిషేకములు నిర్వహించవలసినదిగా దేవాదాయశాఖ కమిషనరు వారి ఆదేశములతో పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానము నందు శనివారం నుండి సోమవారం వరకు త్రయాహ్నిక దీక్షతో పూజాది కార్యక్రమములు నిర్వహించుట జరుగునని ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్, పాలకమండలి



ఛైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు తెలిపారు.సహస్ర ఘటాభిషేకములో భాగముగా మొదటి రోజు శనివారము ఉదయం గం.9.00 నుండి విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, రుత్విక్వరణం, అంకురార్పణం, కలశస్థాపన, వరుణ జపములు ప్రారంభించుట, రెండవ రోజు ఉదయం గం.8.00 నుండి వరుణ జపములు, బుష్యశృంగ జపము, వరుణ మంత్రహోమములు నిర్వహిస్తారని, అలాగా మూడవ రోజు ఉదయం గం. 7.00 నుండి శ్రీ మల్లేశ్వరస్వామి వారికి మహాన్యాసపూర్వక సహస్రఘటాభిషేకము నిర్వహించి తదుపరి నీరాజన, మంత్రపుష్పము జరుగునని ఆలయ స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమములో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారి కృపకు పాత్రులు కావలసినదిగా దేవస్థానం అధికారులు భక్తులకు విజ్ఞప్తి చేసినారు.జులై .27 సోమవారము శ్రీ మల్లేశ్వరస్వామి వారికి సహస్ర ఘటాభిషేకము సందర్భముగా ఉదయం అభిషేకములు, అమ్మవారికి కుంకుమ పూజలు రద్దు చేయటమైనదని దేవాలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ తెలిపినారు. సదరు విషయమును భక్తులు గమనించవలసినదిగా ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్, పాలకమండలి ఛైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు విజ్ఞప్తి చేసినారు.

# గుంటూరు వార్త



## ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాల ప్రదానం

గుంటూరు మెడికల్ , జులై 24 :(ప్రభాత వార్త )ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమలులో విశేష కృషి చేసిన వైద్యాధికారులు, గర్భిణీ స్త్రీలను వంద శాతం అభ (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్)తో అనుసంధానం చేసిన ఆరోగ్య కార్యకర్తలను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ ప్రశంసించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్లోని డి ఆర్ సి హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన ప్రోగ్రాం ఆఫీసర్స్ డా. ఈ. అన్నపూర్ణ, డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖఅధికారి, తెనాలి, డా. కె. సుజాత, డీ.పీ.ఎం. ఓ లకు జాయింట్ కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రజారోగ్య పరిరక్షణ, కుటుంబ సంక్షేమ కార్యక్రమాల సమర్థవంతమైన అమలులో వారి సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేసేందుకు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. గర్భిణీలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రతి అర్హురాలిని అభతో అనుసంధానం చేయడంలో సిబ్బంది చూపిన అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. విజయలక్ష్మి, ప్రశంసా పత్రములు పొందిన వైద్యులు డా. గోవిందనాయక్, డా. రేష్మ, డా. శ్రీవల్లి, డా. శ్రీధర్, డా. భార్గవ్, డా. అనూష, డా. పద్మలత, డా. సతీష్ పాల్గొన్నారు.




ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ అషుతోష్ శ్రీవాత్సవ

## నేడు ఐ ఎం ఏ లో సీ.ఎం.ఇ కార్యక్రమం

గుంటూరు మెడికల్,జూలై24(ప్రభాతవార్త )ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో వైద్యులకు జీర్ణాశయ సంబంధ వ్యాధుల చికిత్సలు, మధుమేహం అంశాలపై నిరంతర వైద్య విద్యా కార్యక్రమం (సీఎంఇ) నిర్వహిస్తున్నట్టు ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ టి .సేవ కుమార్ ,డాక్టర్ బి. సాయికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ శనివారం సాయంత్రం జి ఎం ఏ బిల్డింగ్ లో నిర్వహించే ఈ కార్యక్రమంలో జీర్ణాశయ ఆరోగ్యంలో బయో మార్కర్స్, మధుమేహం చికిత్సలో సెమాగ్లుటైడ్ అనే అంశాలపై హైదరాబాద్ ఎ ఐ జి హాస్పిటల్స్ ఫిజీషియన్ డాక్టర్ దాసరి అనూష ,గుంటూరుకు చెందిన ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ కె .లావణ్య ప్రసంగిస్తారన్నారు. గుంటూరు నగర వైద్యులందరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా వారు ఆ ప్రకటనలో కోరారు.

## కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను కనికరించండి..!

### - 8వ రోజు ఏఎన్‌యు, ఒంగోలు వర్సిటీ అధ్యాపకుల మద్దతు

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై24, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం 2023 జూన్‌లో ఇచ్చిన జీఎం ఎంఎస్.నెం.20ను రద్దుచేయాలని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డిమాండ్ చేస్తున్నారు. విశ్వవిద్యాలయాల్లో బోధన చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ నిరసన కార్యక్రమం 8వ రోజుకు చేరుకుంది. రాష్ట్రంలోని ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ పిలుపుమేరకు చేస్తున్న శాంతియుత ఆందోళన నిర్వహిస్తున్నారు. శుక్రవారం దీక్షా శిభిరం వద్దకు ఏఎన్‌యు ప్రొఫెసర్‌లు ఆచార్య కె.మధుబాబు(సిడిసి మాజీ డీన్), ఆచార్య సరస్వతీ రాజు అయ్యర్ (మాజీ ఐక్యుఏసి డైరెక్టర్), ఆచార్య జి.చెన్నారెడ్డి (మాజీ ఐఎస్‌సి డైరెక్టర్)లు వచ్చి కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు




సంఘీభావం తెలిపారు. అలాగే ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ కె.శివాజీ, డా. డి.హాసన్, డాక్టర్.ఐ.దేవీ వరప్రసాద్‌లు మద్దతు తెలిపారు. శుక్రవారం డాక్టర్ పి.రవి, డా.ఎ.వి.వి.రాధిక, డా.కె.లక్ష్మీ భవాని, డా.సి.హెచ్.బసవయ్యలు దీక్షల్లో పాల్గొన్నారు. వర్సిటీలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాలు అందజేశారు. సేవలు క్రమబద్ధీకరణ, సమానపనికి సమానవేతనం, యూజిసి పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్షలు చేస్తున్నారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు వర్సిటీలో నిరంతరం సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించాలని విన్నవించారు. వర్సిటీ న్యాక్ అక్రిడిటేషన్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్, వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్, అకడమిక్ ఆడిట్‌లు, పరిశోధనలు వంటి అనేక విద్యావిషయక సంబంద విధులు నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వర్సిటీల్లో ఖాళీల భర్తీ ప్రక్రియను ప్రారంభించే ముందు రాష్ట్రంలోని వివిధ వర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీకి అనుగుణంగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని జీ.ఓ ఎంఎస్ నెం.114ను తక్షణమే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం మా న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించిన తరువాతే వర్సిటీల్లో పోస్టుల భర్తీకి ముందుకెళ్ళాలని విన్నవించారు.

## అంటరానితనంపై అక్షరంతో పోరాటం చేసిన కలం యోధుడు గుర్రం జాషువా..

ప్రత్తిపాడు, జూలై 24, ప్రభాతవార్త : సమాజంలో అసమానతలపై, అంటరానితనంపై అక్షరముతో పోరాటం చేసిన కలం యోధుడు గుర్రం జాషువా సాహిత్యం చిరస్మరణీయమని వైసిపి శ్రేణులు పేర్కొన్నారు. గుంటూరు రూరల్ మండలం, ఏటుకూరు బైపాస్ వద్దనున్న వైసీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం గుర్రం జాషువా వర్ధంతిని వైసిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల, మహాకవి గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైసిపి పార్టీ శ్రేణులు మాట్లాడుతూ..తెలుగు సాహిత్య గగనతలానా అణగారిన వర్గాల ఆర్తిని, సామాజిక అసమానతలపై విప్లవాత్మక అక్షర సమరాన్ని సంధించిన నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల బిరుదాలతో గుర్తింపు పొందిన అమర మహాకవి గుర్రం జాషువా అన్నారు. గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించి తీవ్రమైన కుల వివక్షతను మరియు పేదరికాన్ని అనుభవించిన ఆయన తన అసాధారణమైన కావ్య సృష్టి ద్వారా తెలుగు పద్యానికి నూతన రూపాన్ని అందించారని తెలిపారు. ఆయన రాసిన గబ్బిలం, పిరదౌసి, కాండిజీ మరియు స్వప్నకథ వంటి ప్రసిద్ధ కావ్యాలు తెలుగు సాహిత్య చరిత్రలో సువర్ణ మైలురాళ్లుగా నిలిచాయని తెలియజేశారు. విశ్వమానవ సమానత్వానికి తన కలాన్ని ఆయుధంగా మలిచిన మహాకవి గుర్రం జాషువా తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. కుల వివక్ష, మూఢాచారాలు, సామాజిక అసమానతలను తన పదునైన కవిత్వంతో ప్రశ్నిస్తూ అద్భుత రచనల ద్వారా సమాజాన్ని ఆలోచింపజేసిన యుగకర్త జాషువా అని పేర్కొన్నారు. సమకాలీన కవిత్వంతో తిరుగుబాటు బావుటా ఎగురవేసి, అణగారిన వర్గాల ఆవేదనను ప్రపంచానికి వినిపించిన మహోన్నత కవి జాషువా అని, సమానత్వం, మానవత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సాహిత్య పోరాటం నేటికీ ప్రతి తరానికి స్ఫూర్తినిస్తోందన్నారు. రాజు మరణిస్తే శిలా విగ్రహాలలో ఉంటాడు, కవి మరణిస్తే ప్రజల నాలుకలలో ఉంటాడనే జాషువా అమర వాక్యాలు చిరస్థాయి ప్రజాకవిగా నిలిచిన గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. తెలుగు సాహిత్యానికి, సమాజ సంస్కరణకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో వంగ సీతారామిరెడ్డి, అశోక్ యాదవ్, బోరుగడ్డ రజిని, పాటిబండ్ల కవిత, ఉగ్గిరాల ఉదయ్, కాకుమాను సుబ్బారావు, వెంకట్రావు బొల్లెద్దుల,పరిశుద్ధ రావు, ప్రశాంత్, పాటిబండ్ల సుబ్బారావు, పెద్దింటి సామ్రాజ్యం, పిల్లి మేరీ, మబ్బు సుధాకర్, తదితర వైసిపి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో నిర్మాణ పనుల్లో అపశృతి

**నాలుగో అంతస్తు నుంచి కూలిన గోడ రాళ్లు.. కరోనా ఓపీ ఏర్పాటు... రోగుల రద్దీ తగ్గడంతో తప్పిన ప్రాణనష్టం..సకాలంలో నిలిపివేసిన పనులు ఎవరికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు**

గుంటూరు మెడికల్ , జూలై 24: గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో నిర్మాణంలో ఉన్న నూతన భవనంలో శుక్రవారం అపశృతి చోటుచేసుకుంది. డాక్టర్ పొదిలి ప్రసాద్ బ్లాక్‌పై నిర్మిస్తున్న నూతన నాలుగంతస్తుల భవనం పనులు కొనసాగుతున్న సమయంలో సింగిల్ కాలమ్‌పై నిర్మించిన గోడ ఒక్కసారిగా కూలిపోవడంతో నాలుగో అంతస్తు నుంచి భారీ రాళ్లు కిందకు జారిపడ్డాయి. రాళ్లు కింద ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు మీద పడటంతో షెడ్డు పూర్తిగా దెబ్బతింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటన జరిగిన ప్రదేశానికి సమీపంలోనే క్యాజువాలిటీ విభాగం, దానికి ఎదురుగా ఓపీ బ్లాక్ ఉండటంతో సాధారణంగా రోగులు, వారి బంధువులు రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. అయితే ఇటీవల క్యాజువాలిటీ సమీపంలో ప్రత్యేక కరోనా ఓపీ ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతంలో రోగుల రాకపోకలు కొంత తగ్గాయి. అంతేకాకుండా ఘటన మధ్యాహ్న సమయంలో జరగడంతో అక్కడ జనసంచారం తక్కువగా ఉండటం వల్ల ప్రాణనష్టం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు, రోగులు తెలిపారు. లేదంటే భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో ఆసుపత్రిలో జరుగుతున్న నిర్మాణ పనుల నాణ్యత, భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిర్మాణ పనులను పర్యవేక్షించాల్సిన ఏపీ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఐడీసీ) ఇంజినీర్లు తగిన స్థాయిలో పర్యవేక్షణ చేపట్టకపోవడం వల్లే ఈ ఘటన జరిగి ఉండవచ్చనే అనుమానాలను రోగులు, ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా నిర్మాణ పనుల నాణ్యతపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.ఘటన సమాచారం అందుకున్న వెంటనే గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బొజ్జ వెంకటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వెంటనే నిర్మాణ పనులను నిలిపివేయాలని ఆదేశిస్తూ, భవనం భద్రతపై పూర్తిస్థాయి పరిశీలన అనంతరం, అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టిన తర్వాత మాత్రమే పనులను పునఃప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆసుపత్రి ప్రాంగణంలో నిత్యం వేలాది మంది రోగులు, వారి బంధువులు రాకపోకలు సాగిస్తుండటంతో నిర్మాణ పనుల సమయంలో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ ఘటనను హెచ్చరికగా తీసుకుని నిర్మాణ పనులపై నిరంతర పర్యవేక్షణ, నాణ్యత నియంత్రణ, భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నాలుగో అంతస్తు నుంచి రాళ్లు జారి పడటంతో కింద పగిలిపోయిన షెడ్డు కింద జారిపడ్డ రాళ్లు...

## ఏఎన్‌యులో ఇంజనీరింగ్ హాస్టల్ విద్యార్థుల ఘర్షణ

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై24, ప్రభాతవార్త: వర్సిటీలోని ఇంజనీరింగ్ బాలుర హాస్టల్లో గురువారం అర్ధరాత్రి ఘర్షణ జరిగింది. 2ఏడాది, 3వ ఏడాది బి.టెక్ విద్యార్థుల మధ్య ఆధిపత్య పోరులో (సార్, అరెయ్ మాటల వద్ద) భాగంగా ఘర్షణ జరిగినట్లు తెలిసింది. క్రికెట్ ఆటలో జరిగిన ఘటన హాస్టల్‌లో వాగ్వాదానికి దారితీసింది. రాత్రి 11గంటలకు ప్రారంభమైన ఈ ఘటన అర్ధరాత్రి 2గం.వరకు జరిగింది. విషయాన్ని విధుల్లో ఉన్న డ్యూటీ వార్డెన్‌లు, వాచ్‌మెన్‌లు వార్డెలకు సమాచారం అందించారు. వార్డెన్ డాక్టర్ పుణ్యశేఖర్ హాస్టల్‌కు వచ్చి విద్యార్థులను సముదాయించారు. విద్యార్థుల్లో స్నేహభావం ఉండాలని, సీనియర్, జూనియర్‌ల మధ్య ఆదిపత్యం ఉంటే విద్యలో రాణించలేరని, హాస్టల్ విద్యార్థులు అన్నదమ్ములుగా ఉండాలని సూచించారు.

## వట్టిచెరుకూరు ఎస్సై బదిలీ

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూలై 24, ప్రభాతవార్త : జిల్లాలో నలుగురు పోలీస్ ఎస్ఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఎస్పి వకుల్ జిందాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వట్టిచెరుకూరు పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న బాబురావును గుంటూరు రూరల్ మండలం, నల్లపాడు పోలీస్ స్టేషన్ ఎస్ఐగా స్థానచలనం కల్పించారు. ఈ స్థానంలో తాడికొండ నియోజకవర్గం, మేడికొండూరు పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న షేక్ ఖాజీబాబును వట్టిచెరుకూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐగా నియమినట్లు ఎస్పీ కార్యాలయము నుండి ఉత్తర్వులు అందినట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.

## ఏఎన్‌యు వద్ద విద్యార్థి సంఘాల నిరసన

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై24, ప్రభాతవార్త: ప్రశ్నా పత్రాల లీకేజ్ ప్రధాన అంశంగా జరుగుతున్న నిరసన కార్యక్రమంలో ఏఎన్‌యు వద్ద ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డివైఎఫ్ సంఘాలు ఆందోళన చేపట్టాయి. నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా విద్యాశాఖ మంత్రికి అండగా నిలవడం బాధాకరమన్నారు. యువత, విద్యార్థులు రోడ్లెక్కి పేపర్ లీకేజ్‌లు ఏంటని న్యూఢిల్లీలో ధర్నా చేస్తుంటే వారిపై పోలీసులు హింసాత్మకంగా దాడిచేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. వైఎస్ఆర్‌సిపి విద్యార్థి విభాగం వర్సిటీ ఇన్‌చార్జ్ డా.పి.రమేష్ 28న వైఎస్ఆర్ సిపి విద్యార్థి విభాగం తరుపున రాష్ట్రంలో ఆందోళన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై దాడి చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.


**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

**SME బ్రాంచ్-63655, గ్రౌండ్ ఫ్లోర్, మధువాని అపార్ట్‌మెంట్, చిన్నరావూరు రోడ్డు, తెనాలి, గుంటూరు జిల్లా-522201**

(రూల్ 8(1) **స్వాధీనత ప్రకటన** (చర / స్థిరాస్తి కొరకు)

**NPA: Term Loan A/c No. 38400579104, Cash Credit A/c No. 40012602391, GECL A/c No. 40666233598**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 అనుబంధమైన నిబంధన 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో సదరు నోటీసు తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొనబడిన బకాయి **తేది. 07.05.2026 నాటికి రూ. 2,27,83,209.26/- (అక్షరాల రెండు కోట్ల ఇరవై ఏడు లక్షల ఎనభై మూడు వేల రెండు వందల తొమ్మిది రూపాయలు మరియు ఇరవై ఆరు పైసలు మాత్రమే)** చెల్లించవలసిందిగా **ఋణగ్రహీత : యూనిట్ చిరునామా: M/s యం.జి.ఆర్. ఇండస్ట్రీస్,** డి.నెం. 5-182/A/21/A, రెవెన్యూ వార్డు నెం. 5, బ్లాక్ నెం. 2, సాయి నగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522503. **మేనేజింగ్ పార్టనర్: శ్రీమతి మున్నంగి ఉషా రాణి భర్త: మున్నంగి గోపి రెడ్డి, మేనేజింగ్ పార్టనర్: శ్రీ మున్నంగి చిరంజీవి, తండ్రి: మున్నంగి గోపి రెడ్డి, పార్టనర్: శ్రీ మున్నంగి గోపి రెడ్డి తండ్రి: లేటు మున్నంగి వెంకటేశ్వర రెడ్డి, పార్టనర్: శ్రీమతి మున్నంగి విష్ణు వర్ధిని భర్త: మున్నంగి చిరంజీవి. పార్టనర్ కమ్ హామీదారులు చిరునామా: 1) శ్రీమతి మున్నంగి ఉషా రాణి భర్త: మున్నంగి గోపి రెడ్డి, మేనేజింగ్ పార్టనర్:** M/s **యం.జి.ఆర్. ఇండస్ట్రీస్,** డి.నెం. 5-182/A/21/A, రెవెన్యూ వార్డ్ నెం. 5, బ్లాక్ నెం. 2, సాయి నగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522503. **2) శ్రీ మున్నంగి చిరంజీవి, తండ్రి: మున్నంగి గోపి రెడ్డి, మేనేజింగ్ పార్టనర్:** M/s **యం.జి.ఆర్. ఇండస్ట్రీస్,** డి.నెం. 5-182/A/21/A, రెవెన్యూ వార్డ్ నెం. 5, బ్లాక్ నెం. 2, సాయి నగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522503. **3). శ్రీ మున్నంగి గోపి రెడ్డి, తండ్రి: లేటు మున్నంగి వెంకటేశ్వర రెడ్డి, పార్టనర్:** M/s **యం.జి.ఆర్. ఇండస్ట్రీస్,** డి.నెం. 5-182/A/21/A, రెవెన్యూ వార్డ్ నెం. 5, బ్లాక్ నెం. 2, సాయి నగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522503. **4). శ్రీమతి మున్నంగి విష్ణు వర్ధిని భర్త: మున్నంగి చిరంజీవి, పార్టనర్:** M/s **యం.జి.ఆర్. ఇండస్ట్రీస్,** డి.నెం. 5-182/A/21/A, రెవెన్యూ వార్డ్ నెం. 5, బ్లాక్ నెం. 2, సాయి నగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522503 వారిని కోరుతూ **తేది. 07-05-2026 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన రూల్ 8 ప్రకారం దిగువ వివరించిన ఆస్తిని తేది **20.07.2026** న **స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీత/హామీదారు & ప్రజానీకమునకు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ఋణగ్రహీత/హామీదారు మరియు యావన్మంది సాధారణ ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తితో జరిపే ఏ లావాదేవీలైనా **రూ.2,27,83,209.26/-** మరియు **తేది.07.05.2026** నుండి తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మొ॥నవి **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

**చరాస్తి వివరములు:** Hypothecation of Fixed Assets (Plant & Machinery) & Current Assets (Stocks & Book Debts)

**స్థిరాస్తి వివరములు:** మంగళగిరి యస్ఆర్.ఓ., డాక్యుమెంట్ నెం. **4679/2010, తేది.01.07.2010 ప్రకారం శ్రీ మున్నంగి చిరంజీవి తండ్రి: శ్రీ మున్నంగి గోపి రెడ్డి గారి పేరున ఆస్తి కలదు.**

గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్-జిల్లా, మంగళగిరి మున్సిపల్ టౌన్ ఏరియా, తూర్పు మరియు పడమర వైపు రోడ్డులో ఆర్.యస్,నెం. 223/B మంగళగిరి నందు 487 చ॥గ॥ (లేదా) 407.19 చ॥మీ॥ల స్థలంలో నిర్మించబడిన గ్రౌండ్, మొదటి మరియు రెండవ అంతస్తులు ఆర్.సి.సి. రూఫ్ డాబా భవనం. పాత డోర్ నెం. 5-184/B, కొత్త డోర్ నెం. 5-182A21A, సర్వే నెం. 202/A, అసెస్‌మెంట్ నెం. 1023008206, కరెంట్ సర్వీస్ నెం. 13577, 08435. **హద్దులు: తూర్పు:** మున్సిపల్ బజార్ - 44.6 అ॥లు, **దక్షిణం:** ఇండ్ల వెంకట నరసయ్య యొక్క ఆస్తి - 99.0 అ॥లు, **పడమర:** మున్సిపల్ బజార్ - 44.0 అ॥లు, **ఉత్తరం:** నాగళ్ల వెంకటేశ్వర్లు యొక్క ఆస్తి - 99.0 అ॥లు.

**తేది : 20.07.2026**
**ప్రదేశం : తెనాలి**

**సం/- అధీకృత అధికారి**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

# పల్నాడు జిల్లా వార్త



## ఘనంగా జాషువా వర్ధంతి



సత్తెనపల్లి, జూలై 24, ప్రభాతవార్త: సత్తెనపల్లి రఘురామ్ నగర్ కార్యాలయం నందు నవయుగ కవి చక్రవర్తి కవి కోకిల కళాపూర్ణ కవి దిగ్గజ విశ్వకవి సామ్రాట్ పద్మభూషణ్ గుర్రం జాషువా గారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన. తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ .ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ వార్డు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుగాలి హై స్కూల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం

సత్తెనపల్లి, జూలై 24, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం సుగాలి హై స్కూల్ లో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడి సభలో ప్రసంగించిన తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ .ముందుగా స్కూల్ లో విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు తిలకించిన శాసన సభ్యులు కన్నా గారు ... ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన నూతన తరగతి గదులను ప్రారంభించిన శాసన సభ్యులు కన్నా గారు పెద్ద ఎత్తున హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు ఆత్మ రక్షణ పై ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు మధ్యాహ్నం భోజనం నుంచి స్టూడెంట్ కిట్స్ వరకు నాణ్యత పెంచి దొక్కా సీతమ్మ మధ్యాహ్న



భోజన పథకాన్ని నాణ్యతతో అందిస్తున్నాము గత ప్రభుత్వ మాదిరిగా కాకుండా విద్యార్థులకు ఇచ్చే కిట్ల పై పార్టీ రంగులు చిహ్నాలు ఫోటోలు లేకుండా అందిస్తున్నాము గత ప్రభుత్వం విద్య వ్యవస్థను అస్తవ్యస్తం చేసింది విద్యాశాఖలో అమలు చేస్తున్న వివిధ సంస్కరణలను వివరించారు తల్లిదండ్రులను పాఠశాలలకు దగ్గర చేసి విద్యార్థుల అభ్యాస ప్రయాణంలో సమిష్టి జవాబుదారితనాన్ని పెంపొందించడానికి పేరెంట్ టీచర్ మీటింగ్ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సమాజం కలిసి పనిచేసే సంస్కృతిని స్థాపించడమే లక్ష్యం గత ప్రభుత్వం యొక్క నిర్లక్ష్య విధానాల వల్ల బలహీనపడిన విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది పాఠశాలలను విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు మొదటి మెట్టుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మార్చేస్తామని ప్రగల్భాలు పలికిన జగన్ సర్కారు బడుల రూప రేఖల సంగతి అటు ఉంచితే గత ఐదేళ్లలో లక్షల మంది విద్యార్థులను ప్రభుత్వ బడులకు దూరం చేసింది కూటమి ప్రభుత్వంలో మళ్లీ విద్యారంగ వెలుగుల ప్రపంచానికి అవసరమైన మేలిమి మానవ వనరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కేజీ నుండి పీజీ వరకు కరిక్యులంలో మార్పులు తెచ్చింది నాణ్యమైన విద్యను అందించేందుకు క్లాస్ కు ఒక టీచర్ తో విధానంలో 9,600 మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటయ్యాయి. గత ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల కారణంగా బలహీనమైన విద్యారంగాన్ని పునరుద్ధరించేందుకు కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రక్షాళన చర్యలు చేపట్టింది. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంగా విద్యా రంగాన్ని ఆధునికంగా మార్చుతూ, యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోంది ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న ఉపాధ్యాయులు ,రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న శాసనసభ్యులు కన్నా

సత్తెనపల్లి, జూలై 24, ప్రభాతవార్త: సత్తెనపల్లి కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నతెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కన్నా .ప్రజలు తాము ఎదుర్కొంటున్న



సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించిన శాసనసభ్యులు కన్నా గారుగత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు ... ఈ సందర్భంగా ప్రజలు. నా దృష్టికి కొన్ని సమస్యలు. గృహ,పెన్షన్, వైద్యం,పలు సమస్యలు తీసుకొచ్చారు. సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అందరి సమస్యలు పరిష్కరిస్తామని, హామీ ఇచ్చారు

## సత్తెనపల్లి నియోజక వర్గ పరిధిలో మ్యాపింగ్ ఎన్యూమరేషన్



సత్తెనపల్లి, జూలై 24, ప్రభాతవార్త: సత్తెనపల్లి నియోజక వర్గ పరిధిలో మ్యాపింగ్ ఎన్యూమరేషన్ ఈ రోజు తో ముగియనుండగా నియోజకవర్గ పరిధిలో నమోదు కాబడియుండగా.. 24.3048 మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారంలు పంపిణీ చేయబడినవి. 223828 మంది ఓటర్ల వివరములు డిజిటలైజేషన్ చేయబడి ఉన్నవి. మరియు 1.డెడ్ లు 8855 2.షిఫ్ట్ లు 4758 3.డబుల్ ఓటర్లు 3477 4.ఆబ్సెంట్ ఓటర్లు 2124 మందిగా బీఎల్ ఒ శాఖ లో గుర్తించబడినవి. వీనిలో 183 మంది ఓటర్లు స్వయంగా ఎన్యూమరేషన్ చేసుకొనియున్నారు.మ్యాప్ చేయబడిన 223828 ఓటర్లలో సెల్ఫ్ మ్యాపింగ్(2002 నాటికి ఓటర్లుగా ఉన్నవారు) 98992 మంది గాను ప్రోగిని మ్యాపింగ్ ద్వారా(2002 నాటికి ఓటరు గా లేకుండా తల్లి తండ్రి/తాతయ్య నాయనమ్మ ఓట్ల వివరములతో అనుసంధానించబడిన) 116091..గా ఉన్నవి అని ఓటర్ల నమోదు అధికారి, 98సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గం రెవిన్యూ డివిజనల్ అధికారి సత్తెనపల్లి తెలిపారు.

## పత్తి పంట పరిశీలన

సత్తెనపల్లి, జూలై 24, ప్రభాతవార్త: మండలంలోని పెదమక్కెన గ్రామం లో లామ్ ఫారం నుండి విచ్చేసిన శాస్త్రవేత్తలు పత్తి పంటను పరిశీలించడం జరిగినది. ప్రత్తి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల వలన ప్రత్తి పంటలో రసం పీల్చే పురుగులైన పచ్చ



దోమ, తామర పురుగుల యొక్క ఉధృతి ఎక్కువగా ఉన్న కారణంగా రసం పీల్చే పురుగుల నివారణ కొరకు ఫిప్రోనిల్ 2 మి. లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా డైఫెంథియురాన్ 1.25 గ్రా.లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. పై పురుగు మందులతో పాటు మల్టీ.కే లేదా 19.19.19 పోషకాలను మొక్కలకు పైపాటుగా పిచికారి ద్వారా అందించాలని సూచించారు. ప్రత్తి పంటను విత్తుకోవడానికి ఆగస్టు 15 వ తారీఖు వరకు అనుకూల సమయం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లామ్ ఫారం నుండి విచ్చేసిన శాస్త్రవేత్తలు డా. రాజమణి డా. వి మనోజ్ , డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డా. ఎం. నగేష్, సత్తెనపల్లి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి రవిబాబు , మండల వ్యవసాయ అధికారి బి సుబ్బారెడ్డి , మార్కెట్ యార్డ్ చైర్మన్ కోమటినేని శ్రీనివాసరావు ,గ్రామ నాయకులు మందడపు సాంబశివరావు,అలపర్తి రాంబాబు , గ్రామ ఉద్యాన సహాయకురాలు రజిని , మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జిని ఖండించిన సత్తెనపల్లి న్యాయవాదులు

సత్తెనపల్లి, జూలై 24, ప్రభాతవార్త: ఢిల్లీలో నీట్ ఎగ్జాం పేపర్ లీక్ గురించి జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేస్తున్నటువంటి విద్యార్థులపై పోలీసులు చేసిన దాడిని,లాఠీ ఛార్జ్ నీ తీవ్రంగా ఖండిస్తూ సత్తెనపల్లి న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులపై లాఠీ చార్జ్ చాలా దారుణమన్నారు. శాంతియుతంగా నిరసన తెలియజేసే



హక్కు రాజ్యాంగం ప్రతి ఒక్క భారతీయ పౌరుడికి కల్పించిందన్నారు. విద్యార్థులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోగా వారిపై దాడి చేయడం హేయమన్నారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నినాదాలు చేస్తూ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు, గుంటూరు బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## గుఱ్ఱం జాషువా 55 వ వర్ధంతి

సత్తెనపల్లి, జూలై 24, ప్రభాతవార్త: విశ్వకవి సామ్రాట్, పద్మభూషణ్ గుఱ్ఱం జాషువా 55 వ వర్ధంతి సందర్భంగా, "కవికోకిల గుఱ్ఱం జాషువా సాహిత్య సేవా సంస్థ" నిర్వహించిన కార్యక్రమములో సాహిత్యాభిమానులైన రచయితలు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు. సత్తెనపల్లి స్టేషన్ రోడ్డు నందు ప్రతిష్ఠమై వున్న జాషువా విగ్రం వద్ద సమావేశమైన ఈ సభకు కోశాధికారి శ్రీ కలపాల ప్రేమ కుమార్ గారు అధ్యక్షత వహించగా పలువురు వక్తలు నవయుగ వైతాళికుడైన జాషువా గారి సాహిత్య ప్రభావాన్ని విశ్లేషిస్తూ ఉపన్యసించారు. అభ్యుదయ రచయిత కొరబండి అంటోనీ , ప్రముఖ సీనియర్ న్యాయవాది ఊటుకూరి పాపా రావు ,న్యాయవాది షైక్ జానీ ఖాజావలి,రచయిత్రి సరికొండ రమాదేవి, సంస్థ వ్యవస్థాపకులైన యిర్మీయ కి కార్యవర్గ సభ్యులు డా. ఏ.ఎన్.ఆర్. జక్కం, న్యాయవాది గుజ్జర్లపూడి సురేష్ బాబు, టి.డిపి.నాయకుడు కూచిపూడి కోటేశ్వర రావు, గాయకుడు గుజ్జర్లపూడి జాన్ బాబు, గుఱ్ఱం అనిల్ కుమార్, న్యాయవాది గుజ్జర్లపూడి జయకుమార్ గారు శ్రద్ధాంజలి ఘటించారు.

## విద్యార్థుల భవిష్యత్‌కు తల్లిదండ్రులు ఉపాధ్యాయుల భాగస్వామ్యం కీలకం : ఎమ్మెల్యే డా. చదలవాడ

నరసరావుపేట టౌన్, జూలై 24 ప్రభాతవార్త : పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (మెగా పీటీఎం) కార్యక్రమాలు నరసరావుపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. పట్టణంలోని 5వ వార్డు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మున్సిపల్ హైస్కూల్, మున్సిపల్ బాయ్స్ హైస్కూల్, మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్, యలమంద జెడ్పీ



హైస్కూల్, కోటప్పకొండ జెడ్పీ హైస్కూల్, ఎస్ ఎస్ ఎన్ డిగ్రీ కళాశాల, తిలక్ స్కూల్, క్రిస్టియన్ పాలెంలోని బరంపేటలోని ఎస్ భి ఆర్ హైస్కూల్స్ లో నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలలో సాంస్క ృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రగతి, హాజరు, అభ్యాస నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ పిల్లల విద్యలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమాన భాగస్వాములని అన్నారు. ఈ ఇద్దరి సమన్వయంతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు. తల్లికి వందనం, విద్యార్థులకు ఉచిత విద్యా కిట్లు, పాఠశాల బ్యాగులు, నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం, పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు, డిజిటల్ విద్య వంటి కార్యక్రమాల ద్వారా ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తల్లికి వందనం పథకానికి అర్హత ఉన్నప్పటికీ ఎవరికైనా నిధులు జమ కాకపోతే వెంటనే నా దృష్టికి తీసుకురండి. సంబంధిత అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అర్హులైన ప్రతి తల్లికి ఖితల్లికి వందనంఖి నిధులు అందేలా చర్యలు తీసుకుంటాను అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో టీడీపి నాయకులు నాగసరపు సుబ్బరాయ గుప్తా, కపలవాయి విజయ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలతో .... ప్రజలకు సులభతర సేవలు

### జిల్లా రిజిస్ట్రార్ రామ్ కుమార్

నరసరావుపేట,జూలై 24 ప్రభాతవార్త : పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలోనే జిల్లాలోని ప్రజలందరికీ అత్యంత వేగవంతమైన, పారదర్శకమైన మరియు సులభతరమైన సేవలందించేందుకు ప్రభుత్వం ప్రతి జిల్లా హెడ్‌క్వార్టర్‌లో ప్రత్యేకంగా "రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను" అందుబాటులోకి తీసుకువస్తోందని పల్నాడు జిల్లా రిజిస్ట్రార్ ఎస్. రామ్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నరసరావుపేట జాయింట్ సబ్ రిజిస్ట్రార్ 1 ఎం.వి. సుబ్బారావు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ 2 పి.వి. నాగేశ్వరావులతో కలిసి రామ్ కుమార్ మాట్లాడారు. ప్రభుత్వానికి ఆదాయం పెంచడంతో పాటు రిజిస్ట్రేషన్‌కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ముఖ్య ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సేవా కేంద్రాలలో విజిటర్స్ కోసం ప్రత్యేక రిసెప్షన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్



కౌంటర్లు, విశాలమైన ఎయిర్ కండిషన్డ్ వెయిటింగ్ హాల్, సురక్షితమైన తాగునీరు మరియు అత్యుత్తమ మౌలిక వసతులు అందుబాటులో ఉంటాయి. డాక్యుమెంట్ ప్రిపరేషన్, ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్, స్టాంప్ డ్యూటీ చెల్లింపు వంటి ప్రక్రియలన్నీ ఒకే చోట పూర్తి చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. కేంద్రంలోనే సబ్‌రిజిస్ట్రార్ మరియు ఆ శాఖ సిబ్బంది అందుబాటులో ఉండి పత్రాలను వెంటనే చట్టబద్ధంగా పరిశీలిస్తారు. అన్నీ సరిగ్గా ఉన్న డాక్యుమెంట్లను కేవలం 1 నుండి 2 గంటల వ్యవధిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి, ఒరిజినల్ పత్రాలను యజమానులకు అందజేస్తారు. ఇదే సమయంలో ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ల ఉపాధిపై వస్తున్న అపోహలను ఆయన ఖండించారు. ఈ సేవా కేంద్రాల వల్ల ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్లు ఉపాధి కోల్పోతారనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని అన్నారు. ప్రజలు నేరుగా సేవా కేంద్రానికే రావచ్చునని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 10 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని, రోజూ ఉదయం గం. 10 నుంచి సాయంత్రం గం. 6 వరకు అధికారులు, సిబ్బంది సేవలందిస్తారని వెల్లడించారు. డాక్యుమెంట్లు పెండింగ్‌లో పడతాయనే అనవసరపు అపోహలను పక్కనబెట్టి కొనుగోలుదారులు, అమ్మకందారులు నేరుగా కార్యాలయాలకు రావచ్చని కోరారు. డాక్యుమెంట్ ప్రిపరేషన్ లేదా ఇతర సేవలలో ఎలాంటి సమస్యలు ఎదురైనా నేరుగా అధికారులను లేదా జిల్లా రిజిస్ట్రార్‌ను సంప్రదిస్తే, దగ్గరుండి ప్రక్రియ పూర్తి చేయించి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తామని జిల్లా రిజిస్ట్రార్ హామీ ఇచ్చారు.

## ఎంఏఎం లా కళాశాలలో ఘనంగా లా గ్రాడ్యుయేషన్ డే

రొంపిచర్ల, జూలై 24 ప్రభాతవార్త :: న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైనదని, సమాజంలో బాధితులకు న్యాయం అందించడంలో లా గ్రాడ్యుయేట్ల పాత్ర అత్యంత కీలకమైనదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రముఖ అడ్వకేట్, ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక ఎంఏఎం లా కళాశాలలో 202326 ఎల్.ఎల్.బి బ్యాచ్ విద్యార్థుల "గ్రాడ్యుయేషన్ డే" వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి హాజరైన ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు నిరంతరం చట్టాలపై అవగాహన పెంచుకుంటూ, వృత్తిపరమైన విలువలను



కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ లా డీన్ డాక్టర్ సిహెచ్. సుధాకర్ బాబు న్యాయ విద్యార్థులకు పట్టాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంఏఎం గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు చట్టంపై పూర్తి అవగాహనతో ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కళాశాల డైరెక్టర్ దరువురి శ్రావ్య పృథ్వీరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, నిబద్ధతతో ముందుకు సాగి సమాజానికి ఉపయోగపడే మంచి న్యాయవాదులుగా స్థిరపడాలని ఆకాంక్షించారు. 202326 బ్యాచ్ లా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం

నరసరావుపేట టౌన్, జూలై 24 ప్రభాతవార్త : నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో ఎవరైతే నిందితులుగా ఉన్నారో వారిని కఠినంగా శిక్షించాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలైన ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంత "మైందని ఏఐవైఎఫ్జిల్లా అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సాయి, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ఆంజనేయరాజు తెలియజే



శారు. దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా విద్యార్థులు ఆందోళన చేస్తుంటే నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్యార్థుల పైన ఢిల్లీ పోలీసులు లాఠీచార్జి చేయడాన్నినిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బంద్ కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. బంద్ కు పిలుపునిచ్చిన నేపథ్యం లో విద్యాసంస్థలను స్వచ్ఛందంగా యాజమాన్యాలు బంద్ ను పాటించారని జిల్లా వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బంద్ విజయవంతం అయిందన్నారు. పట్టణంలో ఇంజనీరింగ్ కళాశాలలు, విద్యా సంస్థల దగ్గరికి వెళ్లి బంద్ చేయడం జరిగిందన్నారు. ఎస్ఎస్ ఎన్ కళాశాల నుండి అంబేద్కర్ విగ్రహం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ రావు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజ్ సంబంధించిన విషయంలో దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు పైన మోదీ ప్రభుత్వం పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడాని సిపిఐ, సీపీఎం పార్టీలు ఖండిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు జగదీష్, హేమంతు, శ్రీనివాస్, సన్నీ, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు అంజి రెడ్డి, రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఆనంద్ గిరిజన నాయకులు కొయ్య శీను, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆంజనేయ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఓరియంటల్ హైస్కూల్ లో ఘనంగా మెగా పిటియం

నరసరావుపేట టౌన్ , జూలై 24 ప్రభాతవార్త : పట్టణంలోని శ్రీరామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పిటియం ఘనంగా నిర్వహించారు.పాఠశాల ఇంచార్జ్ కె జ్యోతి సభకు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా



జ్యోతితో పాటు రిటైర్డ్ హెచ్ ఎం వై త్యాగరాజు,రిటైర్డ్ టీచర్ వి వి అంజనీకుమార్,పూర్వ విద్యార్థులు జూలకంటి సీతారామాంజనేయులు, గట్టా శ్రీనివాసరావు,స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు బి లక్ష్మీ,ఎం పరమేశ్వరి పేరెంట్స్ ను ఉద్దేశించి మాట్లాడారు.పాఠశాల అభివృద్ధిలో,విద్యార్థుల సాధించాల్సిన ప్రగతిలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని కోరారు.పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం సమిష్టిగా పనిచేయాల్సిన అవసరాన్ని వివరించారు.ఇటీవల పాఠశాలలో పూర్వ విద్యార్థుల సహకారంతో జరిగిన అభివృద్ధిని వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతిపై పేరెంట్స్ తో చర్చించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాంస్క ృతిక కార్యక్రమాలునిర్వహించారు.ఉపాధ్యాయ,ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## కోటప్పకొండలో తొలి ఏకాదశి సందర్భంగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్..

నరసరావుపేట, జులై 24ప్రభాతవార్త : నరసరావుపేటనియోజకవర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం వద్ద తొలి ఏకాదశి పండుగ సందర్భంగా గత రెండు రోజుల నుంచి నిర్వహించిన శానిటేషన్ డ్రైవ్ శుక్రవారం కూడా కొనసాగింది. ఈ నెల 25న జరగనున్న తొలి ఏకాదశి పండుగ సందర్భంగా ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివచ్చే నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు శుక్రవారం కోటప్పకొండ దిగువున



ప్రాంగణంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు.నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు శానిటేషన్ సిబ్బంది, ఆలయ సిబ్బంది, ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఈ డ్రైవ్ లో పాల్గొన్నారు. ఈ పి ప్రాంతాలను ఎమ్మెల్యే స్వయంగా చీపురు పట్టి శుభ్రం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ భక్తులందరికీ తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. జులై 25న జరగబోయే కోటప్పకొండ తిరునాళ్లకు వేలాదిమంది భక్తులు హాజరవుతారని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు, కలెక్టర్, పోలీసు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సూచించారు.

## నాగార్జున కుటుంబాన్ని ఆదుకుంటాం: డా. సాయికృష్ణ

నకరికల్లు, జూలై 24 ప్రభాతవార్త : కుంకలగుంట గ్రామం లో రెండు రోజుల క్రితం టిప్పర్ కింద పడి మృతి చెందిన ఆవుల నాగార్జున కుటుంబ సభ్యులకు తాను అండగా ఉంటానని టిడిపి నేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ తెలిపారు . శుక్రవారం నాగార్జున కుటుంబ సభ్యులను డా. సాయికృష్ణ పరామర్శించారు. నాగార్జున పిల్లలిద్దరికీ చదువుకునే ఖర్చును తాను భరిస్తానని వారు భరోసా ఇచ్చారు. కుంకలగుంట చెరువులో అక్రమ మైనింగ్ కారణంగా ఆవుల నాగార్జున చనిపోవడం



చాలా బాధాకరమన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే మైనింగ్ ను నిలిపివేసే విధంగా రెవిన్యూ, పోలీస్ , మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ జోక్యం చేసుకోవాలని డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ కోరారు. నాగార్జున కుటుంబ సభ్యులకు నరసరావుపేట ఎల్ జి సర్వీస్ సెంటర్ హరిబాబు మైనేని తో కలిసి ఆర్థిక సాయం అందించారు.

## విద్యార్థులకు న్యాయవాదుల సంఘీభావం ...విధులకు గైర్హాజరు

నరసరావుపేట క్రైమ్ , జూలై 24, ప్రభాతవార్త :: ఢిల్లీలోని జంతర్ మంతర్ లో విద్యార్థులపై జరిగిన అమానుష దాడిని ఖండిస్తూ శుక్రవారం విద్యార్థులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి స్థానిక న్యాయవాద సంఘ సభ్యులు సంఘీభావం తెలిపారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ లో చోటు చేసుకున్న ఘటనను ఖండిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. విద్యార్థులకు తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా విధులకు గైర్హాజరయ్యారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శనగా ఢిల్లీ ఘటనను ఖండిస్తూ నినాదాలతో వెళ్లారు.



న్యాయవాదులు వెనుదిరిగిన అనంతరం ఓ న్యాయవాది మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేయటానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొనడంతో సదరు దిష్టిబొమ్మను తీసుకువెళ్లాడు. ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ అధ్యక్షుడు జీవి సుబ్బారావు, న్యాయవాదులు కట్టా నారపరెడ్డి, జి అలెగ్జాండర్ సుధాకర్, బి సలీం, షేక్ అబ్దుల్ రజాక్, కే విజయకుమార్, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## అడిగోప్పలలో మహిళ, మాచర్లలో బాలిక అదృశ్యం

### దుర్గి పోలీసులకు ఫిర్యాదు

దుర్గి, జూలై 24, ప్రభాతవార్త : దుర్గి మండలంలో 23.7.2026న రెండు వేర్వేరు ప్రాంతాల్లో మహిళ, బాలిక అదృశ్యమైన ఘటనలు కలకలం రేపాయి.మార్కాపురం జిల్లా, తరుపాడు మండలం మంగళకుంటకు చెందిన పిక్కిలి హౌస్నమ్మ (42) గత 2 వారాలుగా అడిగోప్పలలో కూలి పని చేసుకుంటోంది. 23న ఉదయం 6 గంటల నుంచి ఆచూకీ లేదని పిక్కిలి హౌస్నమ్మ, 42 సం, 5.6 అడుగులు, చామన ఛాయ, నలుపు చీర, నలుపు జాకెట్ దుస్తులు ధరించిందని పోలీసులు తెలిపారు. ఇంకొక ఘటన మాచర్ల రెగులగుంట కాలనీకి చెందిన బయమ్మ (13) 23న అర్ధరాత్రి 1 గంటకు ఇంటి నుంచి కనిపించకుండా పోయింది. బయమ్మ, 13 సం, 5 అడుగులు, నలుపు రంగు, బూడిద టాప్, నలుపు ప్యాంటు పోలీస్ వివరాలు తెలిపారు. ఎస్.ఐ బి. గోపాల్ రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే దుర్గి పోలీస్ స్టేషన్ లేదా 100 కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## మెగా పిటీఎం 4.0

రాజుపాలెం జూలై 24, ప్రభాతవార్త : మెగా పిటీఎం 4.0 సందర్భంగా రాజుపాలెం మండలం కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో జ్యోతిర్మయి పేరెంట్స్ టీచర్స్ మీటింగు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ప్రత్యేక అధికారి ప్రసాద్, డిప్యూటీ



ఎంపీడీవో శ్యాం, మండల విద్యాశాఖ అధికారి 2 నరసింహా రావు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అంచుల నరసింహారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లికి వందనం కార్యక్రమం ద్వారా ప్రతి చదువుకునే విద్యార్థికి 15 వేల రూపాయలు అందించటం జరుగుతుందని, ఎంతోమంది పేద విద్యార్థులు చదువుకోటానికి అవకాశం లభించిందని, అమ్మకు వందనం ఒక మంచి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని పిల్లలు బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని అన్నారు. అనంతరం ముగ్గుల పోటీలు తగ్గ వార్ నిర్వహించారు. విద్యార్థుల సాంస్క ృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. జాతీయగీతం ఆలాపనతో కార్యక్రమాలకు ఘనంగా ముగింపు పలికారు,

## ఢిల్లీలో విద్యార్థులపై దాడికి నిరసనగా సత్తెనపల్లిలో విద్యాసంస్థల బంద్ సంపూర్ణం

సత్తెనపల్లి, జూలై 24, ప్రభాతవార్త: ఢిల్లీలో విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వ దాడికి నిరసనగా దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ సత్తెనపల్లి పట్టణంలో శుక్రవారం సంపూర్ణంగాను, ప్రశాంతంగా జరిగింది.ఈమేరకు పట్టణంలోని విద్యాసంస్థలు సంపూర్ణంగా బంద్ కు మద్దతు తెలుపుతూ విద్యాసంస్థలను మూసివేశారు. అనంతరం విద్యార్థులు అందరూ గుంటూరు రోడ్డు లో పుతుంబాక వెంకటపతి స్థూపం వద్ద నుండి విద్యార్థుల భారీ ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శన ఆర్టీసీ బస్టాండ్, తాలూకా సెంటర్, గడియార స్తంభం సెంటర్ మీదుగా తిరిగి తాలూకా సెంటర్ కు చేరుకొని గుంటూరు బస్టాండ్



లో మానవ హారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అధ్యక్షత వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ డి అమూల్య, సిపిఎం పట్టణ కార్యదర్శి డి విమల, సిఐటియు మండల కార్యదర్శి పి మహేష్, సిఐటియు పట్టణ కన్వీనర్ జే రాజ్ కుమార్, సిఐటియు నాయకులు ఎం హరిపోతురాజు, ఐద్వా పట్టణ కార్యదర్శి జి ఉమాశ్రీ లు మాట్లాడుతూ విద్యార్థులు లక్షలాది రూపాయలు హెచ్చించి కోచింగ్ తీసుకొని కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమైతే కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఈ నీట్ పేపర్ లీకేజీ అవడంతో ఒక్కసారిగా విద్యార్థులు నిరుత్సాహానికి గురై ఆత్మహత్యలకు పాల్పడడం దారుణమని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కమిటీ సభ్యులు భువనేశ్వరి లిఖిత నాయకులు రియాజ్ వెంకటరెడ్డి ఉదయ్ భాయ్ నాయక్ సాయికుమార్ మరియు విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

25MN 7PG-GNT_25MN 7PG-GNT.qxd 25-07-2026 AM 01:19 Page 1



## వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శాకాంబరి అలంకారం



సత్తెనపల్లి, జూలై 24, (ప్రభాతవార్త): సత్తెనపల్లి పట్టణంలో ఆషాఢ మాస శుక్రవారం సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ""శాకాంబరి ""అలంకారం

## రోడ్డు ప్రమాదంలో న్యాయవాది ఉమా శంకర్ మృతి

సత్తెనపల్లి, జూలై 24, ప్రభాతవార్త: నరసరావుపేట బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయవాది మట్టా ఉమా శంకర్ (36) శుక్రవారం సాయంత్రం సత్తెనపల్లిలో మురళి నగర్ వద్ద ఆర్టీసీ బస్ ఢీ కొని మృతి చెందారు . ద్విచక్ర వాహనం పై గుంటూరు నుంచి సత్తెనపల్లి వస్తున్న న్యాయవాది ఉమా శంకర్ మాచర్ల నుంచి గుంటూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు మురళి నగర్ వద్ద ఎదురెదురుగా ఢీ కొన్నాయి . దీంతో న్యాయవాది అక్కడికక్కడే మృతి చెందారు. పోలీస్ లు కేసు నమోదు చేసుకొని పోస్ట్ మార్టం నిమిత్తం మృత దేహాన్ని సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అయితే ఇతని గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## నీటి కొరతను అధిగమించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 24, ప్రభాతవార్త: ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే నీటికొరతను అధిగమించడంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎక్కడా ఎలాంటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని ప్రధాన చెరువుల్లో నీటి నిల్వలు తగ్గకుండా చూసుకోవాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు.



ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ప్రత్తిపాటి.. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కార నిమిత్తం సంబంధిత విభాగాల అధికారులకు పలు సూచనలు చేశారు. పట్టణ శివారు ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని, అన్ని ప్రాంతాలకు సక్రమంగా, సకాలంలో నీరందించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రత్తిపాటి ఆదేశించారు. ఎల్ నినో ప్రభావంతో ప్రభుత్వం సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా ఇప్పటికే ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. ఆ క్రమంలోనే పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు నీటిని విడుదల చేసిందన్నారు. తాగునీటి సరఫరా విభాగం, జలవనరుల శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సీఎం.ఆర్.ఎఫ్, ఎల్.ఓ.సీల పంపిణీతో ప్రజారోగ్య రక్షణలో ప్రభుత్వం. సీఎం.ఆర్.ఎఫ్ సాయానికి సంబంధించిన అర్జీలను పరిశీలించిన ప్రత్తిపాటి.. అనారోగ్య సమస్యలతో బాధపడేవారిని ఆదుకోవడంలో కూటమిప్రభుత్వం ఉదారంగా వ్యవహరిస్తోందన్నారు. గత ప్రభుత్వం సీఎం.ఆర్.ఎఫ్ సాయం పంపిణీని నిలిపివేసి, పేద.. మధ్య తరగతి వర్గాల ప్రాణాలతో చెలగాటమాడిందన్నారు. కూటమి ప్రభుత్వం సీఎం.ఆర్.ఎఫ్, ఎల్.ఓ.సీల పంపిణీతో తర, తమ బేధాలు లేకుండా ప్రజారోగ్య రక్షణకే అధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

## పీటీఎం, తల్లికి వందనం సమర్థ అమలుతో లోకేశ్ కొత్త చరిత్ర సృష్టించారు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 24, ప్రభాతవార్త: తల్లికి వందనం, పీటీఎం కార్యక్రమాల పారదర్శక అమలుతో విద్యారంగంలో లోకేశ్ సరికొత్త చరిత్ర సృష్టించారని, మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ కు గిన్నిస్ రికార్డ్స్ లో చోటు దక్కడం లోకేశ్ సమర్థతకు నిదర్శనమని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఆయన చిలకలూరిపేట, యడ్లపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. యడ్లపాడు మండలం ఉన్నవ జడ్పీహైస్కూల్ లో అసిస్ట్ సంస్థ చేపట్టిన అభివృద్ధి పనులకు గ్రామస్తులతో కలిసి శంకుస్థాపన చేసి, విద్యార్థులకు ఐటీసీ ఆధ్వర్యంలో డి.ఎఫ్ట్ ను అందజేసిన ప్రత్తిపాటి, అనంతరం బోయపాలెంలోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన మెగా పీటీఎంలో పాల్గొని, తల్లిదండ్రులు, విద్యార్థుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. పసుమర్రు జడ్పీ హైస్కూల్ పాఠశాలలో రూ.24 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదుల్ని ప్రారంభించిన ప్రత్తిపాటి, తల్లికి వందనంలో భాగంగా విద్యార్థులతో తల్లులకు గౌరవ, నమస్కారాలు చేయించి, వారిని గౌరవించడంపై అవగాహన కల్పించారు. అనంతరం షైనింగ్ స్టార్స్



అభినందన సభలో పాల్గొని 11 మంది పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. అనంతరం చిన్నారులకు స్వయంగా భోజనం వడ్డించిన ప్రత్తిపాటి.. భోజనం రుచి, నాణ్యత, భోజన నిర్వాహకుల పనితీరుపై విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అమ్మఒడిలో అర్హులకే పంగనామాలు పెట్టింది. వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పేరుతో ఒక్కో ఇంట్లో ఒక్కవిద్యార్థికే ఆర్థిక సాయం అందించిందని, అది కూడా అర్హులందరికీ ఇవ్వకుండా ప్రజలకు పంగనామాలు పెట్టిందని ప్రత్తిపాటి తెలిపారు. కూటమిప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి, ప్రతి ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే, అందరికీ తల్లికివందనం కింద ఏటా రూ.13వేల ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. మంత్రి లోకేశ్ తల్లికి వందనం అమలుతో విద్యార్థుల భవిష్యత్ ను తల్లుల చేతుల్లోనే పెట్టారని ప్రత్తిపాటి ప్రశంసించారు. తల్లిదండ్రుల కలల సాకారంతో పాటు, విద్యావ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశ పెట్టారన్నారు. రాష్ట్ర విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించాలన్న లక్ష్యంతోనే లోకేశ్ ఏకీకృత విద్యావిధానం తీసుకొచ్చారని ప్రత్తిపాటి తెలిపారు. తల్లికి వందనం సాయం ఇంకా ఎవరికైనా రానిపక్షంలో వారు తమ వివరాల్ని, తమ పిల్లలు చదివే పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించి, ప్రభుత్వ లబ్ది పొందాలని ఆయన సూచించారు. ఉన్నవ ప్రభుత్వ పాఠశాలలో పలు అభివృద్ధి పనుల నిర్మాణానికి అసిస్ట్ సేవా సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ సాయానికి తోడు.... దాతలు, స్వచ్ఛంద సంస్థలు, పూర్వ విద్యార్థుల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలలు మునుపెన్నడూ లేని విధంగా గొప్పగా అభివృద్ధి చెందుతాయని, ఈ సహాయ సహకారాలు భవిష్యత్ లోనూ కొనసాగాలని ప్రత్తిపాటి ఆకాంక్షించారు. నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, అసిస్ట్ డైరెక్టర్ జక్క రంగారావు, మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, కామినేని సాయిబాబు, డిప్యూటీ కలెక్టర్ బి. లీలారాణి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, మద్ది వెంకటేశ్వర్లు, కుర్ర రత్తయ్య, ఐటీసీ బాలాజీ, విశాల, కామినేని ఫణీంద్ర, టీడీపీ నాయకులు కొడాలి శ్రీనివాసరావు, జాలాది సుబ్బారావు, ఖాజా చౌదరి, సుదర్శన్, చైతన్య, దశరథ రామయ్య, కుర్ర శివరామకృష్ణ, షేక్ రాజా మహమ్మద్, బొద్దూరి నరసయ్య, షేక్ బడే, బీజేపీ గుట్టా హేమ, బండిల శ్రీను, ఎంఈవో, వివిధ హోదాల్లో ఉన్న అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిలకలూరిపేటలో పోయిన 17 సెల్ ఫోన్లు రికవరీ.. బాధితులకు అప్పగించిన అర్బన్ సీఐ రమేష్ బాబు

చిలకలూరిపేట, జూలై 24, ప్రభాతవార్త: ప్రజలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించి తిరిగి అప్పగించడంలో చిలకలూరిపేట అర్బన్ పోలీసులు మరోసారి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పోయిన 17 సెల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పోలీసులు విజయవంతంగా రికవరీ చేశారు. ఈ సందర్భంగా చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్ ది। పి. రమేష్ రికవరీ చేసిన సెల్ ఫోన్లను సంబంధిత బాధితులకు స్వయంగా



అందజేశారు. సెల్ ఫోన్లు తిరిగి అందుకోవడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ చిలకలూరిపేట అర్బన్ పోలీసులకు, ముఖ్యంగా ఇన్‌స్పెక్టర్ పి. రమేష్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, సెల్ ఫోన్ పోయిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు పోర్టల్‌లో నమోదు చేస్తే వాటిని గుర్తించి తిరిగి అప్పగించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ప్రజలకు సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చిలకలూరిపేట పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## రిటైర్డ్ ప్రిన్సిపల్, సామాజికవేత్త పేర్ల అంజయ్య మృతి



చిలకలూరిపేట, జూలై 24, ప్రభాతవార్త: రిటైర్డ్ ప్రిన్సిపల్, సామాజికవేత్త పేర్ల అంజయ్య నిన్న సాయంత్రం స్వర్గస్తులైనారు. ఈ విషయం తెలుసుకొని పండరీపురంలోని వారి స్వగృహం వద్ద ఉన్న వారి పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేసిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ , సోమేపల్లి వెంకట సుబ్బయ్య , సోమేపల్లి వాసు, గేరా లింకన్ , నాయుడు రమేష్ ..ఈ కార్యక్రమంలో వారివెంట తిజులీ సుభాని గారు, సాతులూరి కోటి , గ్రంధి ఆంజనేయులు , ఇమ్మడి జానకిపతి గారు, సయ్యద్ హిదాయతుల్లా , గట్టా రమేష్ , రావూరి దాసు , మహబుల్లా, నరేంద్ర రెడ్డి , జిలాని తదితరులున్నారు.

## అధికారులు స్పందిస్తేనే ప్రజా సమస్యలకు పరిష్కారం ప్రజాదర్బార్ లో ఎమ్మెల్యే జూలకంటి

వెల్దుర్తి, జూలై 24, ప్రభాతవార్త: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకున్నప్పుడే ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖిప్రజా దర్బార్ఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించుకుని అర్జీలను అందజేశారు.



అర్జీల పరిశీలన – అధికారులకు ఆదేశాలు: ప్రజల నుంచి స్వీకరించిన వినతిపత్రాలను ఎమ్మెల్యే జూలకంటి ప్రత్యక్షంగా పరిశీలించారు. బాధితులు తెలిపిన వివరాలను అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, అర్జీలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీలలో అధిక శాతం రెవిన్యూ సమస్యలు మరియు భూవివాదాలు స్థలాల ఆక్రమణలు, కొత్త పింఛన్ల మంజూరు కోసం విన్నపాలు వచ్చాయి. ప్రజాపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే తమ ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే వరకు ప్రజా దర్బార్ ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో నియోజకవర్గ ప్రజలు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవితకు కూటమి ప్రభుత్వం భరోసా

వెల్దుర్తి, జూలై 24, ప్రభాతవార్త: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం పూర్తి భరోసా కల్పిస్తోందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సతీమణి శోభారాణి అన్నారు. శుక్రవారం వెల్దుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులుఉపాధ్యాయుల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాలకు విచ్చేసిన ఆమెకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శోభారాణి మాట్లాడుతూ, విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్



కలసి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని కొనియాడారు. పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో, ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం ద్వారా సంక్షేమ సాయం అందిస్తున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్ము కిషోర్, టిడిపి నాయకులు కోట్ల శ్రీనివాసరెడ్డి, జూలకంటి పోలురెడ్డి, ఇతర స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు వరం తల్లికి వందనం

మాచర్ల టౌన్.. జూలై 24 ప్రభాతవార్త: : విద్యకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఖితల్లికి వందనంఖిపథకం పేదవిద్యార్థుల పాలిట వరం అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పునరుద్ఘాటించారు.



శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నందు నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పాఠశాలకు విచ్చేసిన ఎమ్మెల్యేకు విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల అవరణలో మన బడిమన భవిష్యత్తు పథకం ద్వారా రూ.1 కోటి 37 లక్షలతో నూతనంగా నిర్మించిన 9 అదనపు తరగతి గదులను ప్రారంభి, మొక్కలు నాటారు. వేదికపై విద్యర్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. అనంతరం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ స్కూల్ కిట్ లను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. తల్లికి వందనం పథకం ద్వారా రెండో విడత నగదు జమ అయిన తల్లిదండ్రులు కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ లకు ధన్యవాదాలు తెలిపారు. థాంక్యూ సీఎం సార్, థాంక్యూ లోకేష్ సార్ అంటూ ఒక్కసారిగా విద్యార్థులందరూ వెలుగెత్తి కృతజ్ఞతలు తెలపగా పాఠశాల అవరణమంతా ప్రతిధ్వనించింది. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ సందర్భంగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ..పల్నాడు ప్రాంతంలో అత్యంత వెనుకబడిన మాచర్ల నియోజకవర్గంలో విద్యా వికాసానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని, రూ.120.98 కోట్లతో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి నిధులు అందజేశారని చెప్పారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న తల్లిదండ్రులకు పిల్లల చదువులు భారం కాకూడదని ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకం ద్వారా తల్లుల ఖాతాలో ప్రభుత్వం నగదు జమ చేస్తుందని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో 48 వేల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద రూ.72 కోట్ల నగదు జమ చేశామని వివరించారు. తల్లిదండ్రుల ఆలోచన విధానాలు మారాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మాత్రమే క్వాలిఫైడ్ విద్య, విద్యార్థులకు అందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రతి విద్యార్థికి ప్రభుత్వం ఏటా రూ. 1లక్ష 30వేలు ఖర్చు చేస్తుందని వెల్లడించారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి గబ్రూనాయక్, మండల విద్యాశాఖ అధికారి అల్లి సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, శ్రీకృష్ణ జనరల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ గుర్రం రాజశేఖర్ రెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ మధు యాదవ్, పార్టీ నాయకులు కొమెర దుర్గారావు, కజ్జం సైదయ్య, గుండాల శ్రీనివాస్ యాదవ్, మాచర్ల వాసు, శాంతి, దుర్గా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తొలిఏకాదశికి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం సర్వం సిద్ధం భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి...ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల, జూలై 24, ప్రభాతవార్త: మండల కేంద్రమైన రెంటచింతల లోని కృష్ణానది ఒడ్డున గల శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం తొలి ఏకాదశి పర్వదినానికి సిద్ధమైంది. సనాతన ధర్మంలో అత్యంత ప్రాముఖ్యత ఉన్న తొలి ఏకాదశి నుంచే విష్ణువు యోగనిద్రలోకి జారుకుంటాడు. ప్రతినెలా శుక్ల పక్షంలో ఒకసారి, కృష్ణ పక్షంలో ఒకసారి ఏకాదశి వస్తుంది. అయితే, వీటన్నింటిలోకి ఆషాఢశుద్ధ ఏకాదశిని అత్యంత పుణ్యప్రదమైనదిగా పరిగణిస్తారు. హిందూ సంప్రదాయంలో భాగంగా ఈ పండుగ తరువాతనే హిందువుల పండుగలన్నీ ప్రారంభమోతాయి. ఏడాదిలో వచ్చే 24



ఏకాదశుల్లో నేడు నిర్వహించబోయే పండుగన తొలి ఏకాదశిగా ప్రసిద్ధి పొందింది. భక్తులు వేకువ జామునుంచే వివిధ రకాల పూజాది కార్యక్రమాలతో పర్వదినం ఆరంభం కానుంది. భక్తుల పాలిట కొంగుబంగారంగా భాసిల్లే ఈ ఆలయంలోని నాగమయ్యను పూజిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. పల్నాడులోని వివిధ ప్రాంతాల నుంచి వేల మంది భక్తులు వస్తారనే భావంతో ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్ జీవీ శివయ్య, ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డిలు చెప్పారు. కృష్ణానది ఒడ్డున భక్తుల సౌకర్యార్థం జల్లుస్నానం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వివిధ సామాజిక వర్గాలకు సత్రాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు..భక్తులకు ఎటువంటి లోటుపాట్లు రానీయొద్దు.. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తొలి ఏకాదశి సందర్భంగా అశేష భక్తజనంతో నిండిపోయే సత్రశాల ప్రాంగణంలో ఎలాంటి లోటుపాట్లు రానీయోద్దని ఆమేరకు ఏర్పాట్లుండాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. శుక్రవారం ఆలయ ఈవో రామిరెడ్డితో ఫోన్ ద్వారా మాట్లాడుతూ క్యూలైన్ల వద్ద పటిష్ట బందోబస్తుండాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో భక్తుల దాహార్తిని తీర్చడానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. వాహనాల పార్కింగ్ విషయంలో గందరగోళం ఉండటానికి వీల్లేదని ఎమ్మెల్యే ఆదేశించారు.. తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చే వాహనాలను టెయిల్పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు సమీపంలో పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. త్వరలో రూ. 5 కోట్లతో ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

## విద్యార్థుల హక్కులను కాపాడాలి: ఎస్ఎఫ్ఐ డిమాండ్

మాచర్ల టౌన్.. జూలై 24 ప్రభాతవార్త: దేశ రాజధాని ఢిల్లీలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, పెప్పర్ స్ప్రే ప్రయోగించడం, వాటర్ కానన్‌లతో చెదరగొట్టడాన్ని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) నాయకులు తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను హరించే చర్యలను వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. మాచర్ల పట్టణంలోని పుర వీధుల్లో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ స్థాయి పరీక్షల్లో చోటుచేసుకున్న పేపర్ లీకేజీల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనలకు రాజకీయ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీకేజీలపై పారదర్శక విచారణ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేసి విద్యార్థుల హక్కులు, భవిష్యత్తును పరిరక్షించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

## మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 4.0

చిలకలూరిపేట, జూలై 24, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 4.0 2 శుక్రవారం నాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాతులూరు నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి వెంకటరావు ఆధ్వర్యంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్ పర్సన్ ఎం సుబ్బారావు గారి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశము నందు నాదెండ్ల మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీమతి అమల కుమారి గారు, సాతులూరు గ్రామ స్పెషలాఫీసర్ టి వెంకటరావు మరియు పాఠశాల పూర్వ విద్యార్థి దాత బండారుపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సమావేశం ముందు పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధిని



విద్యార్థిని విద్యార్థుల యొక్క ప్రగతిని గురించి మరియు ప్రభుత్వం వారు విద్యార్థులకు ఇస్తున్న సంక్షేమ పథకాల గురించి తల్లిదండ్రులకు వివరించడమైనది. ఈ సందర్భంగా బండారుపల్లి సత్యనారాయణ గారు పాఠశాలకు అసంపూర్తిగా ఉన్న ప్రహరీ గోడను మరియు మెయిన్ గేటును నిర్మాణం చేయుటకు తమ వంతు కృషి చేస్తానని హామీ ఇవ్వడమైనది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులందరూ పాల్గొన్నారు

## గుర్రం జాషువా వర్ధంతి

చిలకలూరిపేట, జూలై 24, ప్రభాతవార్త: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) స్వచ్ఛంద సేవాసంస్థ, మరియు మహాకవి జాషువ సిద్ధాంత భూమిక ఆధ్వర్యంలో మహాకవి కవి గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమం జరిగింది. తొలుత మెయిన్ రోడ్డుపై ఉన్న జాషువ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గ్రంథాలయంలో జరిగిన సభాకార్యక్రమంలో పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తేళ్ల సుబ్బారావు, బిజెపి ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు పోట్రూ పూర్ణచంద్రరావు, మాజీ ఏజిపి దాసరి చిట్టిబాబు, డా.పీవీ.సుబ్బారావు, బొంత అజయ్ బాబు, పాల్గొని మాట్లాడారు. సాహితీ విమర్శకులు డా. పీవీ సుబ్బారావు మాట్లాడుతూ ఎక్కిరించిన సమాజాన్ని ధిక్కరించిన కవి జాషువా అన్నారు. అలాగే జనవిజ్ఞానవేదిక ప్రధాన కార్యదర్శి బొంత అజయ్ బాబు మాట్లాడుతూ మధురమైన విషాదాంత కావ్యాలు రాసిన మధుర శ్రీనాథుడు జాషువ అన్నారు. గ్రంథాలయ అధికారి డీ.వీర్రాజు, చుక్క విన్సెంట్ పాల్ , రిటైడ్ ఎక్సైజ్ సీఐ గోరంట్ల నారాయణ, దారా కొండయ్య దార్ల బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

## జీవో నెం.396 రద్దు చేయాలంటూ దస్తావేజు లేఖరుల ఆందోళన

చిలకలూరిపేట, జూలై 24, ప్రభాతవార్త: జీవో నెం.396 రద్దు చేయాలంటూ చిలకలూరిపేటలో దస్తావేజు లేఖరుల ఆందోళన రిజిస్టార్ కు వినతిపత్రం అందించి, నిరసన ర్యాలీలో పాల్గొన్న దస్తావేజు



లేకర్లుజూలై 20 నుంచి 31 వరకు ఖిపెన్ డౌన్ఖి ఉద్యమానికి శ్రీకారం దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు, డీటీపీ ఆపరేటర్లు విధుల బహిష్కర ఖిలీరీ కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్లను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంఘాలు ప్రజల ఆస్తుల భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం ప్రభుత్వం వెంటనే జీవో 396 ఉపసంహరించుకోవాలని డిమాండ్ డిమాండ్లు నెరవేరకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరి ప్రజల మద్దతు కోరిన చిలకలూరిపేట దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్ల సంక్షేమ సంఘం

## విద్యాసంస్థల బంద్ సంపూర్ణం

చిలకలూరిపేట, జూలై 24, ప్రభాతవార్త: నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన తీవ్ర లోపాలు, అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం, న్యాయమైన విద్యా వ్యవస్థ కోసం శుక్రవారం విద్యార్థి సంఘాలు చేపట్టిన బంద్ శుక్రవారం సంపూర్ణంగా, ప్రశాంతంగా కొనసాగింది. ప్రైవేటు విద్యాసంస్థలు ముందుగానే సెలవు ప్రకటించగా, ప్రభుత్వ పాఠశాలను విద్యార్థి సంఘాల నాయకులు ముయించి వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరుస పేపర్ లీకేజీలతో అపకీర్తి మూటగట్టుకున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని పూర్తిగా రద్దు చేయాలని, ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువజన నాయకులపై జరిగిన పోలీసుల లాఠీఛార్జ్, అక్రమ అరెస్టులపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని కోరారు. విద్యా వ్యవస్థను కేంద్రీకరించే నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజ్ ఘటన లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురి చేసిందన్నారు. సంవత్సరాల పాటు కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్య అని, పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగాల్సిన జాతీయ స్థాయి పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కావడం వల్ల విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో విశ్వాసం దెబ్బతిందన్నారు. విద్యా వ్యవస్థలో పేరుకుపోయిన అవినీతిని ఏరిపారేయాలని, విద్యార్థుల కష్టాన్ని బ్రోకర్లకు విక్రయించే వ్యవస్థను బూడిద చేయాలని కోరారు. ఇలాంటి తీవ్రమైన వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ సంబంధిత కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తి।స్త్రీ నియోజకవర్గ కార్యదర్శి కే మల్లికార్జున్, బొంత పృధ్వి, నాయకులు దుర్గ, వెంకటేష్, అనిల్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

చిలకలూరిపేట, జూలై 24, ప్రభాతవార్త: నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అభిజిత్ దీప్కే , దేశ పర్యావరణ శాస్త్రవేత్త సోనం వాంగ్ చుక్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు సంఘీభావంగా, అలాగే చలో పార్లమెంటు కార్యక్రమం చేపట్టిన లక్షలాదిమంది విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు చేసిన పాసవిక లాఠీచార్జిని ఖండిస్తూ చిలకలూరిపేట పట్టణంలో విద్యాసంస్థల బందును నిర్వహించి అనంతరం చిలకలూరిపేట తాసిల్దార్ కు శుక్రవారం మెమోరాండం ఇవ్వటం జరిగినది. ఈ సందర్భంగా లాల్ నీల్ ఐక్య పోరాట వేదిక రాష్ట్ర కార్యదర్శి బొంతా భగత్ సింగ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఢిల్లీలో విద్యార్థులు చేపట్టిన నిరసన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని అన్నారు. విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు చేసిన లాఠీ ఛార్జ్ అప్రజాస్వామికమని తెలిపారు. నీట్ పేపర్ లీక్ అవటం వలన దాదాపు 22 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవటం జరిగింది అని తెలిపారు. వారికి కేంద్ర ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని కోరారు. నీట్ పేపర్ లీకేజ్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి పేరు బోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఢిల్లీ నడిబొడ్డున విద్యార్థులు చేస్తున్న నిరసనను పట్టించుకోకపోవడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో లాల్ నీల్ ఐక్యవేదిక నాయకులు మెగావత్ సాయి నాయక్, నందిగం ప్రవీణ్, దిలీప్, తానికొండ ప్రభాకర్, బిరుదు అశోక్, గొట్టిపాడు దాస్, బొంతా ఆదిబాబు, వలపర్ల ప్రేమ సాగర్, మందా సురేష్, జే. అఖిల్, భకుల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ విజయవంతం

చిలకలూరిపేట, జూలై 24, ప్రభాతవార్త: చిలకలూరిపేట నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఖీ।ఖి) విజయవంతంగా పూర్తి...మొత్తం ఓటర్లు 2,26,959... ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 100 శాతం పూర్తి...1,99,568 ఫారాల డిజిటైజేషన్ పూర్తి... డిజిటైజేషన్ శాతం 87.93...మరణించిన ఓటర్లు 7,118... గుర్తించలేని/గైర్హాజరైన వారు 9,659...శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లు 8,016... ఇప్పటికే నమోదు అయిన వారు 2,575...మొత్తం 27,391 మంది (12.07 ) ఓటర్ల వివరాల్లో మార్పులు గుర్తింపు...రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్ల సహకారానికి ఎన్నికల ఓటర్ల నమోదు అధికారి బి. లీలారాణి ధన్యవాదాలు తెలిపారు.

## అగ్నికి ఆహుతైన రెండు ఇళ్లు బాధితులకు కూటమి నేతల చేయూత..

దుర్గి, జులై 24, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా దుర్గి గ్రామంలోని బుడగ జంగాల కాలనీలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో రెండు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న దుర్గి పట్టణ



కూటమి నాయకులు బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి 15 వేల రూపాయల ఆర్థిక సహాయం మరియు బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. అలాగే ప్రభుత్వం నుండి కూడా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దుర్గి తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు మారుగుండ్ల వేణుగోపాల్, జనసేన పట్టణ అధ్యక్షులు రుద్రాల రవి, భారతీయ జనతా పార్టీ నాయకులు వెలిడండి శ్రీనివాసరావు, కాపావాలియి శ్రీను, ఉప్పల అంజి, ఉల్లి అప్పారావు, మల్లయ్య, వేముల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ రైతులకు 80 సబ్సిడీపై డ్రోన్లు

దుర్గి, జూలై 24 ప్రభాతవార్త: దుర్గి మండల వ్యవసాయ అధికారి వై. అమీర్ రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ 2026 సీజన్ కు సంబంధించి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో నమోదు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. జిల్లాలో నోటిఫైడ్ పంటలైన వరి, ఎండు మిరప, కంది మరియు పత్తి సాగు చేసే రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. బీమా ప్రీమియం వివరాలు: వరికి ఎకరాకు రూ.80, ఎండు మిరపకు రూ.360, కందికి రూ.40, పత్తికి రూ.1900గా నిర్ణయించారు. పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, పంట నమోదు ధృవీకరణ పత్రం తీసుకుని సమీప కామన్ సర్వీసు సెంటర్లలో లేదా మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. బీమా నమోదుకు చివరి తేది 31072026మరోవైపు డ్రోన్ వినియోగానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ రైతులకు డ్రోన్ కొనుగోలుపై 80 వరకు సబ్సిడీ అందుబాటులో ఉందని అన్నారు. 10 లక్షల విలువ గల డ్రోన్ పై 8 లక్షలు సబ్సిడీ పోను రైతులు మిగిలిన 2 లక్షలతో డ్రోన్ పొందవచ్చు. రైతులకు స్వంత భూమి ఉండాలి. కనీసం 5 మంది సభ్యులతో గ్రూపుగా ఏర్పడాలి. గ్రూపులో ఒకరు తప్పనిసరిగా 10వ తరగతి లేదా ఆ పైన చదివి ఉండాలి. ఆసక్తి ఉన్న రైతులు వెంటనే గ్రూపులు ఏర్పాటు చేసుకుని పూర్తి వివరాలు, దరఖాస్తు మరియు అవసరమైన పత్రాల జాబితా తెలుసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వై. అమీర్ రెడ్డి కోరారు.

25MN 8 PG-GNT_25MN 8 PG-GNT.qxd 25-07-2026 AM 02:12 Page 1



## మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళల వాటా తేల్చండి

మంగళగిరి, జూలై 24, ప్రభాతవార్త : ఈనెల 27 సోమవారం గ్రీవెన్స్ డే రోజు 33 శాతం మహిళా రిజర్వేషన్ల లో బీసీ మహిళలకు ఉప కోటా తేల్చాలంటూ మెమోరాండంను అన్ని జిల్లా కలెక్టరేట్లలో ఫిర్యాదు చేయాలంటూ, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ కోరారు. శుక్రవారం స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో " చట్టసభలలో మహిళా రిజర్వేషన్లబీసీ మహిళలకు సబ్ కోటా "అంశంపై జరిగిన మీడియా సమావేశం లో అన్ని బీసీ సంఘాల జిల్లా కమిటీల కు ఆ మేరకు పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్, గుంటూరు జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు కాగితాల స్వాతి గౌడ్, మంగళగిరి పట్టణ మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి, సంఘ పట్టణ అధ్యక్షులు వెంకటకృష్ణ, జిల్లా యువజన నాయకులు ధనుంజయ రావు, దా నా గౌడ్, పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.



## ప్రతి విద్యార్థి కష్టపడి చదివి భావి భారత పౌరులుగా ఎదగాలి

పెదకూరపాడు, జూలై 24, ప్రభాతవార్త : విద్యారంగాన్ని ప్రగతి పదంలో ముందుకు నడపాలంటే తల్లిదండ్రుల సహాయ సహకారాలు, గ్రామ పెద్దల తోడ్పాటు ఎంతో అవసరమని టిడిపి బీసీ సెల్ నాయకులు మోదుగుల చంద్రశేఖర్ అన్నారు. కన్నెగండ్ల గ్రామంలోని ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాలలో చదువుతున్న 35 మంది విద్యార్థులకు ఐడెంటి కార్డులు,టై, లు తన సొంత నిధులతో వెచ్చించి విద్యార్థులకు అందించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి భావి భారత పౌరులుగా ఎదగాలని చంద్రశేఖర్ కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పివిడి ప్రసాద్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

పెదకూరపాడు, జూలై 24, ప్రభాతవార్త : పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల సహాయ సహకారాలు ఎప్పటికీ ఉండాలని హెచ్ఎం విజయమ్మ కోరారు. శుక్రవారం ఎంపీపీహెచ్ డబ్ల్యు పాఠశాల నందు మెగా పేరెంట్స్ డే ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రుల పాత్ర పిల్లలను బడికి పంపించడమే కాకుండా వారు చదువు పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలు గమనిస్తూ ఉండాలని ఉపాధ్యాయులు శివశంకర్ మాస్టర్ అన్నారు. డ్రాప్ అవుట్ పిల్లలను బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు జంగాల ప్రసాద్, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు



## జీవో నెంబర్ 396 ను వెంటనే రద్దు చేయాలి

పెదకూరపాడు, జూలై 24, ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీవో నెం 396 రద్దు చేసి ఆర్ ఎస్ కె సెంటర్ల ఏర్పాటును నిలిపివేయాలని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో ఈ నెల 20 నుండి 31 వరకు జరుగుతున్న పెన్ డౌన్ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మద్దతు తెలిపారు . సందర్భంగా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ జి .ఓ . నెం. 396 అమలుచేయడం వలన డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు అనుబంధ వృత్తులపై ఆధారపడిన వేలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు . ఈ జీవో కారణంగా ఎంతోమంది ఉపాధి, జీవనోపాధి ప్రమాదంలో పడుతుందని,ప్రజల ఆస్తులకు రక్షణ కొరవడుతుందని ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో నెం 396 ని రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు.



## మహాకవి గుర్రం జాషువా ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి

### - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు,జూలై 25, ప్రభాతవార్త: నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల, మహాకవి కీ.శే. గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా గుంటూరు నగరంపాలెంలోని స్టేట్ బ్యాంక్ ఎదుట ఉన్న గుర్రంజాషువా విగ్రహానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ సామాజిక సమానత్వం, మానవత్వం, ఆత్మగౌరవం కోసం తన కలంతో పోరాడిన మహోన్నత కవి గుర్రం జాషువా అని, కుల, మత వివక్షలకు వ్యతిరేకంగా తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరిచిన మహనీయుడిగా జాషువా తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.సమాజంలోని అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప సాహితీవేత్త జాషువా అని, ఆయన రచనలు నేటికీ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## మరణాంతర జీవితమే అసలు జీవితం

తాడేపల్లి, జూలై 24, ప్రభాతవార్త : మరణాంతర జీవితమే అసలు జీవితమని, నేటి కలికాలంలో జరుగుతున్న ధార్మిక మోసాల పట్ల ప్రజలు అప్రమత్తం గా ఉండాలని జనాబ్ ఇల్యాస్ దాయి అన్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం బసవతారక నగర్ మస్జీద్ ఏ మొహమ్మద్ లో గురువారం సాయంత్రం జరిగిన ధార్మిక కార్యక్రమంలో ఆయన ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో పాలల్లో, నీళ్లలో, నిత్యవసర సరుకుల్లో, ఇతర వస్తువుల్లో మోసాలు జరుగుతున్నాయని, అయితే అన్నింటికంటే ఎక్కువ మోసం దైవం విషయంలో జరుగుతుందన్నారు. ప్రజలు దేవుడు విషయంలో అమాయకంగా మోసపోయిన విధంగా మరే ఇతర విషయాల్లో మోసపోవడం లేదన్నారు. దేవుడు ఒక్కడే అనే విషయం ప్రతి మనిషికి తెలుసునని, కొంత మంది ముస్లింలు దర్గాలు, జెండా చెట్లను మొక్కేస్తున్నారని చెప్పారు. అదేవిధంగా ప్రపంచంలో మానవులు బహు దైవారాధన లో చిక్కుకుని వాళ్ల మాటలు, వీళ్ళ మాటలు విని అపమార్గంలో వెళుతున్నారని అన్నారు. అటువంటి తరుణంలో మానవులకు సన్మార్గం చూపించడానికి వచ్చిన గ్రంథమే దివ్య ఖురాన్ అన్నారు. ఖురాన్ ను విశ్వసించే వారికి మార్గం చూపిస్తుందన్నారు. ప్రపంచ మానవులందరికీ మార్గదర్శకత్వం కోసమే అల్లాహ్ ఖురాన్ గ్రంధాన్ని అవతరింప చేశారన్నారు. ప్రపంచం లో మానవులంతా ఒకే ఒక్క విషయంలో అపమార్గానికి గురి అయ్యారని, అదే ఆత్మ అన్నారు. ఆత్మలను ఆరాధిస్తున్నారని, అయితే ఆత్మ అనేది దేవుడే కాదన్నారు. సర్వ ఆత్మలను పుట్టించినవాడు అల్లాహ్ అన్నారు. ఆత్మ అల్లాహ్ చేత పుట్టించబడిందని, ఈ విషయంలో సందేహమే వద్దన్నారు. మానవులంతా ఒకే తండ్రికి, ఒకే తల్లికి జన్మించిన వారేనని... అందరూ సమానులే అన్నారు. నేటి సమాజంలో మనిషిని చూసి మనిషి భయపడుతున్నాడని, పై తాన్ ఆ విధంగా మానవులను ప్రేరేపిస్తున్నాడన్నారు. వాస్తవానికి మనిషికి అసలు శత్రువు షైతాన్ మాత్రమేనన్నారు. మనందరం ఒక్కటేనని, మనందరి ప్రభువు అల్లాహ్ నే నన్నారు. దేవుడిని అర్థం చేసుకోవడం అంత సులభమైన విషయం ప్రపంచంలో మరొకటి లేదన్నారు. అల్లాహ్ మనిషి కాదని, జిన్నాతుల జాతికి చెందిన వాడు కాదని, జంతు, పక్షి జాతులకు చెందిన వాడు కాదన్నారు. సృష్టికి ముందే ఆయన ఉన్నాడన్నారు. సృష్టి గురించి తెలుసుకోవాలంటే సృష్టికర్తను మాత్రమే అడగాలన్నారు. దేవుడు అంటే సమాధి, జెండా చెట్టు, చెక్క ముక్కలు కాదన్నారు. మానవులు దేవుడిని గుర్తించే విధంగా గుర్తించడం లేదన్నారు.ఆయన తలచుకుంటే క్షణకాలం లో సృష్టిని నాశనం చేయగలడని, మళ్ళీ క్షణకాలం లో పునః సృష్టి చేయగలడన్నారు. దేవుడిని తెలుసుకునే విషయం లో మోసపోతే మానవ జీవితానికే అర్థం ఉండదన్నారు. అసలు జీవితం మనం చనిపోయిన తర్వాత ప్రారంభం అవుతుందని, మరణాంతర జీవితమే అసలు జీవితమన్నారు.



## మెగా పీటీఎంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య దృఢమైన బంధం..

ప్రత్తిపాడు, జూలై 24, ప్రభాతవార్త: మెగా పీటీఎంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య దృఢమైన బంధం ఏర్పడుతుందని ప్రత్తిపాడు శాసనసభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పియం శ్రీ బివిఆర్ జడ్పీ పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం 4.0 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగాన్ని జాతీయ స్థాయిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటుచేసు కుంటున్నాయని తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణ అవశ్యమని, దీనిపై పాఠశాలల యాజమాన్యం, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పిల్లలు సెల్ ఫోన్ లకు దూరంగా ఉండాలని సూచించారు. పేదరికం కారణంగా ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే సంకల్పంతో తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా, అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం ప్రయోజనం అందజేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించు కునేందుకు తల్లిదండ్రులు తప్పనిసరిగా లీప్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ ద్వారా విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతి, పరీక్షల ఫలితాలు, పాఠశాల కార్యకలాపాలు తదితర వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. రాష్ట్ర విద్యాభివృద్ధిలో ప్రభుత్వం ఒక్కటే కాదు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కూడా భాగస్వాములు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పాఠశాలలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం పెరిగితే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందన్నారు.

2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో నాణ్యమైన విద్య కీలకమని, ఆ లక్ష్య సాధనలో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాతీయ విద్యా విధానం 2020 స్ఫూర్తికి అనుగుణంగా స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి ఆశించే సహకారం, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల నుంచి కోరుకునే మద్దతు గురించి పరస్పరం చర్చించుకునే ఉత్తమ వేదికగా ఈ సమావేశాలు నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు విద్యాసంవత్సరం ప్రారంభంలోనే పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్ తదితర విద్యా సామగ్రిని సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో కలిసి స్వయంగా భోజనం చేసారు.విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి వారి చదువులు, సౌకర్యాలు, పాఠశాలలో అందుతున్న వసతుల గురించి తెలుసుకున్నారు. మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రూ.2,260కోట్ల టర్నోవర్ సాధించిన సంగం డెయిరీ

### -సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు, జూలై 24,ప్రభాతవార్త: చేబ్రోలు మండల పరిధి వడ్లమూడి సంగం డెయిరీలో శుక్రవారం ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అధ్యక్షతన పాలకవర్గం సమావేశం జరిగింది. అనంతరం సమావేశంలో చర్చించిన అంశాలను సంగం డెయిరీ ఛైర్మన్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ విలేకర్ల వివరించారు. సంగం డెయిరీ గత ఆర్థిక సంవత్సరంలో రూ.2,260కోట్ల టర్నోవర్‌ను సాధించి, రూ.16కోట్ల రూపాయల లాభాన్ని సాధించిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.2,466కోట్లు టర్నోవర్ సాధించే విధంగా ప్రణాళిక రూపొందించామన్నారు. రోజుకు సగటున 8లక్షల లీటర్ల పాల సేకరణ జరగగా, సీజన్‌లో 10.5లక్షల లీటర్ల వరకు పాల సేకరణ జరిగిందన్నారు. ప్రస్తుతం సంగం డెయిరీ విక్రయిస్తున్న పాలలో 98శాతం పాలను రైతుల నుంచే నేరుగా సేకరిస్తున్నట్లు చెప్పారు. పాలసేకరణను మరింత విస్తరించేందుకు పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు, చిత్తూరు జిల్లాలో మూడు చిల్లింగ్ కేంద్రాలను నెలకొల్పుతున్నట్లు చెప్పారు. తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో రోజుకు 20వేల లీటర్ల పాలన సేకరణ లక్ష్యంగా కొత్త చిల్లింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతపురం జిల్లాలో కూడా రెండు చోట్లు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. సంగం డెయిరీ ఆధ్వర్యంలో ఆధునిక ఐస్‌క్రీమ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. రూ.55కోట్ల వ్యయంతో డీవీసి పాల ఉప ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో ఆటోమేషన్ విధానంలో విస్తరించే ప్రణాళికలను రూపొందించినట్లు స్పష్టం చేశారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేదుకు వెటర్నరీ విభాగాన్ని బలోపేతం చేస్తూ లూస్ ఫార్మింగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. సంగం సీడ్ ప్రాజెక్టు ద్వారా బీపీటి-5204, సంఘం అర్జున్ వంగడాలతో రైతులకు మెరుగైన ఫలితాలు అందించామన్నారు. చిత్తూరు జిల్లాలో సంగం రుద్ర హైబ్రిడ్ టమోటా విత్తనాలను అందించి అధిక దిగుబడులు సాధించేలా సహకారం అందిస్తున్నామన్నారు. సంగం డెయిరీ సాధిస్తున్న విజయాలను గుర్తించి ఇతర దేశాల ప్రతినిధులు సంస్థను సందర్శించి అభినందిస్తున్నారన్నారు.ఎన్‌డీడీబి అధికారులు సైతం సంగం డెయిరీ పనితీరును ఆదర్శంగా తీసుకొని తమ ఉద్యోగులకు ఇక్కడ శిక్షణ కల్పిస్తున్నారన్నారు. మిర్యాలగూడలో ప్రస్తుతం రోజుకు 1.5లక్షల లీటర్ల సామర్థ్యంతో పనిచేస్తున్న ప్లాంట్‌ను 3లక్షల లీటర్ల సామర్థ్యానికి విస్తరించేందుకు పాలకవర్గం ఆమోదం తెలిపిందన్నారు. విజయదశమి నాటికి కరీంనగర్‌లో సంగం డెయిరీ వ్యాపారాన్ని విస్తరించేందుకు కార్యాచరణ చేపట్టినట్లు వెల్లడించారు. ప్రస్తుతం పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా సంగం డెయిరీ ఉత్పత్తులను విదేశీ ఎగుమతులను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు. సమావేశంలో సంగం డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పి.గోపాలకృష్ణన్, పాలకవర్గ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



## విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలి

పొన్నూరు, జూలై 24,ప్రభాతవార్త: విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు కూడా శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కొండీ వీర వెంకట సత్యనారాయణ సూచించారు. మండల పరిధిలోని వెల్లలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన మెగా పేరెంట్స్ మీట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సత్ప్రవర్తన, క్రమశిక్షణ కలిగే విధంగా ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మండల తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ మాట్లాడుతూ విద్యార్థులను టీవి, సెల్‌ఫోన్ లాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని దూరంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల ప్రవర్తనను గమనిస్తూ, ప్రవర్తనలో ఏవైనా మార్పులు గుర్తిస్తే తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడి ప్రవర్తనలో మార్పు తెచ్చేవిధంగా చూడాలన్నారు. పిల్లలను ఇతరులతో పోల్చకుండా వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఏమైనా సందేహాలు, సమస్యలు ఉంటే వెంటనే పాఠశాల ఉపాధ్యాయులను సంప్రదించడం ద్వారా వాటిని సరిదిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు మాట్లాడుతూ తల్లి దండ్రులు ప్రతి రోజు పిల్లలతో కొంత సమయం మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవాలన్నారు. ప్రతి రోజు కనీసం 30నిముషాలన్నా చదివే విధంగా అలవాటు చేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విధిగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సారె సమర్పణ

పొన్నూరు, జూలై 24,ప్రభాతవార్త: అమ్మవారికి ఆషాఢ మాసంలో సారె సమర్పించడం ద్వారా దు:ఖాలు తొలిగిపోయి సకల సుఖాలు కలుగుతాయనే భక్తుల విశ్వాసంతో శుక్రవారం ఆర్ అగ్రహారంలోని శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరీ అమ్మవారికి దేవస్థానం తరపున సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు, చీరె, జాకెట్ ముక్కతో పాటు ప్రత్యేక నైవేద్యాలను వివిధ బేషిన్లలో ఉంచి గ్రామోత్సవంగా, మేళతాళాలతో, పండుగ వాతావరణంలో అమ్మవారికి సారెను సమర్పించారు. దేవస్థానం తరపున కొనగళ్ళ సత్యనారాయణ, కోట శేషగిరి దంపతులు, వారి స్నేహితులు, ఆర్యవైశ్య మహిళలు, బంధువులు పెద్ద ఎత్తున వేడుకగా దేవాలయం వరకు ఊరేగింపు వచ్చి శాస్త్రోక్తంగా అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కార్యనిర్వహణాధికారి నిడమానూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



## విద్యావ్యవస్థను ఉత్తమంగా తీర్చిదిద్దడమే కూటమి ధ్యేయం

పొన్నూరు, జూలై 24,ప్రభాతవార్త: విద్యా వ్యవస్థను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖామంత్రి నారా లోకేష్, ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ఎనలేనిదని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. చేబ్రోలు మండల పరిధిలోని సుద్దపల్లి గ్రామంలో జరిగిన మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి చక్కని భవిష్యత్తును అందించాలని కోరారు.




చదువు ద్వారానే సమాజంలో అసమానతలు తొలగిపోతాయని నమ్మిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వరుసగా రెండవ ఏడాది ప్రతి విద్యార్థికి తల్లికి వందనం ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో మొత్తంగా 28,020మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం ద్వారా రూ.42.03కోట్ల ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. జనసేన ఇంచార్జి వడ్రాణం మార్కండేయబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అభివృద్ధి, సంక్షేమం సమపాళ్ళలో అమలు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు తేవడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్‌లు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జయలక్ష్మి, తహశీల్దార్ కళ్ళం శ్రీనివాసశర్మ, ఎంపిడిఓ టి.ఊహారాణి, మండల విద్యాశాఖాధికారి ఎం.ఏడుకొండలు,డిప్యూటీ ఎంపిడిఓ రవిశంకర్, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మైలా వెంకటరామరాజు, ప్రధానకార్యదర్శి అనంత లక్ష్మీనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నేతన్న సేవ పథకానికి చేనేత కార్మికుల హర్షం

మంగళగిరి, జూలై 24, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ "నేతన్న సేవ" పథకం కింద ప్రతి అర్హులైన చేనేత కుటుంబానికి రూ.25,000 ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించిన నేపథ్యంలో మంగళగిరిలో చేనేత కార్మికులు ఆనందోత్సాహాలతో సంబరాలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరిలోని టిట్కో హౌసెస్, రత్నాల చెరువు తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులు పెద్ద ఎత్తున సమావేశమై, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, చేనేత, జౌళి శాఖ మంత్రి సవితమ్మ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి ప్రభుత్వానికి తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీ గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ, చేనేత కార్మికుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టి, మంత్రి నారా లోకేష్ గారి చేనేత జాతిపై ఉన్న ప్రత్యేక శ్రద్ధ, అలాగే చేనేత జౌళి శాఖ మంత్రి శ్రీమతి సవితమ్మ గారి నిరంతర కృషి ఫలితంగానే నేడు చేనేత కుటుంబాలకు వరుసగా సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే చేనేత రంగానికి ఉచిత విద్యుత్, సహకార సంఘాల బకాయిలను విడతల వారీగా చెల్లించడం వంటి కీలక నిర్ణయాలు అమలు చేస్తూ, ఇప్పుడు "నేతన్న సేవ" పథకం ద్వారా ప్రతి అర్హులైన చేనేత కుటుంబ బ్యాంకు ఖాతాలో ఆగస్టు 7వ తేదీన రూ.25,000 జమ చేయనున్న నిర్ణయం చారిత్రాత్మకమని ఆయన అన్నారు. ఈ నిర్ణయంతో ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న చేనేత కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయని, చేనేత కార్మికుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయని తెలిపారు.

ఈ సందర్భంగా చేనేత కార్మికులు "చంద్రబాబు నాయుడు జిందాబాద్", "పవన్ కళ్యాణ్ జిందాబాద్", "నారా లోకేష్ జిందాబాద్", "మంత్రి సవితమ్మ జిందాబాద్", "కూటమి ప్రభుత్వం వర్ధిల్లాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబ్బయ్య, గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, బీజేపీ పట్టణ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



## తల్లిదండ్రులు-ఉపాధ్యాయులే విద్యార్థుల భవిష్యత్తుకు కీలకం

పొన్నూరు, జూలై 24,ప్రభాతవార్త: విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు-ఉపాధ్యాయులే కీలకమని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్, మునిసిపల్ ప్రత్యేకాధికారి ధీరావత్ దుర్గాబాయి సూచించారు. పట్టణంలోని శ్రీరామ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్ మీట్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల ప్రగతిని తెలుసుకుని ఉపాధ్యాయులతో మాట్లాడే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం మెగా పేరెంట్స్ మీట్‌ను ప్రతి ఏటా నిర్వహిస్తుందన్నారు. దీని వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కలుసుకొని విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయాలను ఆత్మీయంగా చర్చించి పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు సంబంధించిన విషయాలను పరిశీలించాలన్నారు. పాఠశాలలో ఇచ్చిన హోమ్ వర్క్, తదితర అంశాలకు సంబంధించి విద్యార్థులను చైతన్యపరచాలన్నారు. విద్యార్థులు ఎప్పటిపనిని అప్పుడే చేసేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూడాలన్నారు. మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించే విధంగా ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా శ్రద్ధ పెట్టాలన్నారు. మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్ మాట్లాడుతూ మెగా పేరెంట్స్ మీట్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు చేపట్టే విషయాలను తల్లిదండ్రులు తెలుసుకొని, వాటిని సరైన మార్గంలో అమలయ్యే విధంగా చూసే అవకాశం ఉంటుందన్నారు. మరీ ముఖ్యంగా విద్యార్థులు వివిధ రకాలుగా క్రాఫ్‌లు చేయించుకొంటున్నారని, ఆ విషయంలో ఉపాధ్యాయుల మీద మాత్రమే శ్రద్ధ పెట్టకుండా తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించుకోలేని విద్యార్థి భవిష్యత్తులో ఇబ్బందులు పడే అవకాశం ఉటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



## బంద్ విఫలం

పొన్నూరు, జూలై 24,ప్రభాతవార్త: నీట్ పేపరు లీకేజి, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడి, భాష్పవాయువు ప్రయోగం తదితర సంఘటనలకు నిరసనగా ఎస్‌ఎఫ్‌ఐ, మాల యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం బంద్‌కు పిలుపునిచ్చారు. ప్రైవేట్ పాఠశాలలు మినహా అన్నీ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, బ్యాంకులు యధావిధిగా పనిచేశాయి. ఆర్టీసి బస్సుల్లో ఎలాంటి మార్పులేకుండా వాటి ప్రయాణాన్ని అవి కొనసాగించాయి. ఒక్కమాటలో చెప్పాలంటే పొన్నూరులో జరిగిన బంద్ పూర్తిగా విఫలమైందని చెప్పొచ్చు. ఈ సందర్భంగా మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొందుగల చైతన్య మాట్లాడుతూ వ్యవస్థలు అందరిని బెదిరించగలవు, విద్యార్థులను ఉద్యమంలోకి రాకుండా ఆపగలరు. కానీ నా కూతుర్లు విద్యార్థులే అని మరచిపోయారు. విద్యార్థులను కేసులు పెడతామని బెదిరించి ఆపగలరు కానీ నా కూతర్లను ఆపగలరా..? అంటూ ఆవేదన చెందారు. ప్రభుత్వం చేస్తున్న దురాగతాలను ఇతరులకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే నేను, నా కూతుర్లలతో ఈ రోజు దీక్షలో పాల్గొనడం జరిగిందన్నారు. ఏది ఏమైనా కేంద్రం ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఉద్యమం చేస్తామని, మన విద్యార్థులకు, బిడ్డలకు జరిగే నష్టం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాలని పొందుగల కోరారు. నీట్ పరీక్షను సక్రమంగా నిర్వహించలేని ప్రభుత్వ పెద్దలు, తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు వ్యవస్థల ద్వారా ఉద్యమాలను అణచడం సరైన విధానం కాదన్నారు. సమాజంలో నిరసన తెలుపుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉందన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. బిజెపి నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బంద్‌లు, నిరసనలు తెలియజేయలేదా..? ప్రజల పక్షాన పోరాడకుండానే అధికారంలోకి వచ్చారా..? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ నాయకుడు యాతాటి కిషోర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్, ఆరేటి రామారావు, అంబేద్కరిస్టు యడ్లపాటి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రేవు శ్రీనివాస కిషోర్‌కుమార్ నేతృత్వంలో ఎస్సై బలగాని జగన్మోహనరావు బందోబస్తు నిర్వహించారు.




## న్యాయవాదులు విధులకు గైర్హాజరు

గురజాల, జూలై 24 ప్రభాతవార్త : ఢిల్లీలో నీట్ విద్యార్థులపై జరిగిన దాడిని ఖండిస్తూ గురజాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు శుక్రవారం తమ విధులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి చలమరాజు, యెనుముల నరసింహారెడ్డి, మాదాల ప్రసాద్, జ్ఞానసుందరి, నిమ్మల శ్యామలాదేవి, చాగంటి సురేష్, పేరుపోగు సురేష్, చిన్నపరెడ్డి ఝాన్సీ రెడ్డి, షేక్ సైదా, చల్లా రామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీ నాగరపమ్మ, కలివెల ప్రభదాసు, డివి రాధాకృష్ణమూర్తి, అనంతరామయ్య, హుస్సేన్ ఖాన్, బండి వీరభద్రుడు, కర్రా చిన కోటేశ్వరరావు, బండ్ల కిరణ్, కె నాగలక్ష్మి, జక్కా అనిల్, మణిదీప్, గురుప్రసాద్, రవికిరణ్, చల్లా అనిల్, తిరుమలేశ్వరరావు, కోడిదేటి శ్యామలరావు, తాళ్లూరి సాల్మన్‌రాజు, బొల్లెంపల్లి సైదులు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## పేరెంట్స్, టీచర్స్ సమావేశం

పిడుగురాళ్ల, జూలై 24 ప్రభాతవార్త : పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం పేరెంట్స్, టీచర్స్ సమావేశం ఘనంగా నిర్వహించారు. శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈ సమావేశం జరిపారు. కూటమి నేతలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు అన్ని విభాగాల్లో ఉన్నత స్థానంలో ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

## వేమూరులో విద్యార్థుల ర్యాలీ

వేమూరు జూలై 24 (ప్రభాతవార్త) : ఢిల్లీ విద్యార్థులపై పోలీస్ అమానుష లాఠీ చార్జ్‌కి నిరసగా వేమూరులో విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యా సంస్థల బంద్ జరిగింది. ఈ బంద్‌కు ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలియజేసి పాల్గొన్నారు. వేమూరులో శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీ, విద్యార్థులు శాంతియుతంగా విద్యా సంస్థల బంద్ చేసి ర్యాలీ నిర్వహిస్తున్న సందర్భంగా వేమూరు ఎస్సై వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.అగస్టీన్, మరియు అంబేద్కర్ యూత్ సభ్యులను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళారు. మధ్యాహ్నం తర్వాత మెగా పేరెంట్స్ మీటింగ్ అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారని తెలిపారు. ఆందోళన చేస్తున్న విద్యార్థుల పట్ల ఎస్సై వ్యవహరించిన తీరును విద్యార్థి సంఘాల నాయకులు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ మండల అధ్యక్షులు తలతోటి సురేష్‌బాబు, గుమ్మడి బుజ్జిబాబు, కారుమంచి సునీల్, బి.తిరుమల, గంజి రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ గురై వ్యక్తి మృతి

వేమూరు జులై 24 (ప్రభాతవార్త) : విద్యుత్ షాక్ గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కుచ్చెళ్ళపాడు గ్రామంలో చోటు చేసుకుంది. కుచ్చెళ్ళపాడు గ్రామానికి చెందిన బుసె నాగరాజు (34)ప్రైవేట్ ఎలక్ట్రీషన్‌గా పని చేస్తూ ఉంటాడు. గురువారం రాత్రి 7గంటల సమయంలో ఓ ఇంటి సర్వీస్ వైరు చుట్టే క్రమంలో విద్యుత్ షాక్ గురయ్యాడు. వెంటనే వేమూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకురాగా అత్యవసర సేవలు అందించి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు నాగరాజు స్థానిక లైన్మెన్‌కు సన్నిహితంగా ఉంటూ కరెంటు పనులన్నీ తానే చూసుకునేవాడన గ్రామస్తులు తెలియజేస్తున్నారు.

25-7Pg5_25-7Pg5.qxd 24/Jul/26 10:31 PM Page 1



# ఎపి, కర్ణాటకకు 'రైలు' వరాలు



వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

## రూ.1,264 కోట్లతో మల్టీట్రాకింగ్ రైలు ప్రాజెక్టు

## 2028-29నాటికి పూర్తి: కేంద్ర కేబినెట్ నిర్ణయం

## రూ.3030 కోట్లతో భవ్య రసాయన స్కీమ్‌కి ఆమోదం

**న్యూఢిల్లీ, జులై 24:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని గుంతకల్ - బళ్లారి విభాగంలో మూడవ, నాల్గవ రైల్వే లైన్ల నిర్మాణానికి రూ.1,264 కోట్ల పెట్టుబడితో ఆమోదం తెలిపింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని మూడు జిల్లాల పరిధిలో చేపట్టే ఈ మల్టీట్రాకింగ్ ప్రాజెక్టు, భారతీయ రైల్వే నెట్‌వర్క్‌ను సుమారు 46 కిలోమీటర్ల మేర విస్తరించనుంది. 2028-29 నాటికి పూర్తవుతుంది. ఈ ప్రాజెక్టు సుమారు ఏడు లక్షల జనాభా కలిగిన దాదాపు 99 గ్రామాలకు రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తుంది. పెరిగిన సామర్థ్యం వల్ల బళ్లారి కోట, శ్రీ కుమార స్వామి ఆలయం వంటి దేశంలోని అనేక ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు రైలు అనుసంధానం మెరుగుపడుతుందని సమావేశం అనంతరం కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియా సమావేశంలో వివరించారు. ప్రతిపాదిత ప్రాజెక్టు ఇనుప ఖనిజం, డోలమైట్, సున్నపు రాయి, ఇనుము, ఉక్కు, బొగ్గు, ఎరువులు, ఆహార ధాన్యాలు వంటి సరుకుల రవాణాకు కీలకమైన మార్గం. సామర్థ్య పెంపు పనుల ఫలితంగా ఏటా అదనంగా 16.22 మిలియన్ టన్నుల సరుకు రవాణా జరుగుతుందని వివరించారు. అంతేకాకుండా, రైల్వే రవాణా పర్యావరణ అనుకూలమైనది. ఇంధన సామర్థ్యం కలిగినది కాబట్టి, నెట్‌వర్క్ విస్తరణ వాతావరణ లక్ష్యాలను సాధించడంలోనూ, దేశ లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించడంలోనూ సహాయపడుతుంది. దీనివల్ల దేశ చమురు దిగుమతి సుమారు 1.32 కోట్ల లీటర్లు తగ్గడమే కాకుండా, కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలు 6.67 కోట్ల కిలోల మేర తగ్గుతాయని అంచనా. ఇది 0.27 కోట్ల మొక్కలు నాటడంతో సమానమని మంత్రి వివరించారు. సమీకృత ప్రణాళిక, సంబంధిత వర్గాల సంప్రదింపుల ద్వారా మల్టీమోడల్ అనుసంధానం, లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారిస్తూ, 'పిఎంగతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్'కు అనుగుణంగా ఈ ప్రాజెక్టు రూపొందించబడింది. ఈ ప్రాజెక్టు ప్రజలు, సరుకులు, సేవల రవాణాకు అతుకులు లేని అనుసంధానాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. పెరిగిన లైన్ సామర్థ్యం రవాణా వేగాన్ని గణనీయంగా పెంచుతుంది, తద్వారా భారతీయ రైల్వేకు నిర్వహణ సామర్థ్యం, సేవా విశ్వసనీయత మెరుగుపడతాయి. ఈ బహుళ ట్రాక్ ప్రతిపాదన కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి, రద్దీని తగ్గించడానికి దోహదపడుతుంది. ఈ ప్రాంతంలో సమగ్ర అభివృద్ధి ద్వారా ప్రజలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచి, వారిని 'ఆత్మనిర్భర్' (స్వయం సమృద్ధులు)గా తీర్చిదిద్దాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 'నవ భారత్' ఆశయానికి ఈ ప్రాజెక్ట్ అనుగుణంగా ఉందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. రసాయన రంగాన్ని బలోపేతం చేయడానికి, ఉమ్మడి పారిశ్రామిక మౌలిక సదుపాయాలను కల్పించడానికి దేశవ్యాప్తంగా మూడు ప్రత్యేక రసాయన పార్కులను ఏర్పాటు చేసే రూ.3,030 కోట్ల పథకాన్ని ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో 'భారత్ పారిశ్రామిక్ వికాస్ యోజన రసాయన్' (బిహెచ్‌ఎవివైఎ-రసాయన్) పథకానికి ఆమోదం లభించిందని సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఈ పథకానికి మొత్తం రూ. 3,030 కోట్ల వ్యయం కేటాయించబడింది. ఇందులో రూ.3,000 కోట్లను పార్కుల పరిధిలో ఉమ్మడి మౌలిక సదుపాయాలు, ప్రాథమిక సౌకర్యాల కల్పనకు వినియోగిస్తారు, మిగిలిన రూ.30 కోట్లను పరిపాలనాపరమైన ఖర్చుల కోసం కేటాయించారు. ఈ పథకం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుండి 2030-31 వరకు ఐదేళ్ల కాలంలో అమలు చేయబడుతుంది. ఈ మూడు పార్కుల అభివృద్ధికి అవసరమైన మొత్తం పెట్టుబడి చాలా ఎక్కువగా ఉంటుందని, కేంద్రం కేటాయించిన రూ.3,030 కోట్లు కేవలం ఉమ్మడి మౌలిక సదుపాయాల కల్పన కోసమేనని వైష్ణవ్ పేర్కొన్నారు. "ఆర్థిక వ్యవస్థలో అనేక కీలకమైన రంగాలు ఉన్నాయి, అందులో రసాయన రంగం ఒకటి. ఎందుకంటే ఇది అనేక ఇతర పరిశ్రమలకు అవసరమైన ప్రాథమిక ముడి పదార్థాలను అందిస్తుంది" అని ఆయన అన్నారు.

అధికారిక ప్రకటన ప్రకారం, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం కనీసం రూ.500 కోట్ల వాటాను సమకూర్చుకునే షరతుకు లోబడి, ఒక్కో రసాయన పార్కుకు కేంద్రం రూ.1,000 కోట్ల వరకు గ్రాంట్‌ను అందిస్తుంది. ఉమ్మడి మౌలిక సదుపాయాలను కల్పించడం, పారిశ్రామిక వృద్ధికి మద్దతు ఇవ్వడం ద్వారా రసాయన పరిశ్రమ అభివృద్ధిని ప్రోత్సహించడానికి ఈ పథకం సహాయపడుతుందని ప్రభుత్వం తెలిపింది.

# మీకెంత ధైర్యం?



## ఆందోళనల్లో పాల్గొన వద్దని విద్యార్థులను హెచ్చరిస్తారా?

## వర్సిటీల వైఖరిపై రాహుల్‌గాంధీ ఆగ్రహం

**న్యూఢిల్లీ, జులై 24:** నీట్ లీక్‌పై కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో జరుగుతోన్న ఆందోళనలకు దూరంగా ఉండాలని పలు యూనివర్సిటీలు విద్యార్థులను హెచ్చరించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతోన్న తప్పులను ప్రశ్నించడానికి విద్యార్థులు తమ ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకుంటున్నారన్నారు. వారిని ఆందోళనల్లో పాల్గొన్న వద్దని హెచ్చరించడానికి మీకెంత ధైర్యం అంటూ మండిపడ్డారు. సమయం వచ్చినప్పుడు ఇలాంటి చర్యలకు ఆయా విశ్వవిద్యాలయాలు జవాబుదారీగా ఉండాల్సి ఉంటుందన్నారు. జంతర్‌మంతర్ వద్ద జరిగే ఆందోళనలపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని, అందువల్ల ఎవరూ ఆ ప్రాంతానికి వెళ్లొద్దని ఢిల్లీ యూనివర్సిటీ(డియు), జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్‌యు), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) రూర్కీ, ఐఐటి మద్రాస్ సహా పలు విద్యాసంస్థలు తమ విద్యార్థులకు సూచించాయి. సోషల్ మీడియాలో కూడా నిరసనలకు సంబంధించి ఎలాంటి పోస్టులు చేయొద్దని కోరాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఈ హెచ్చరిక జారీ చేసినట్లు తెలిపాయి. ఈ క్రమంలోనే రాహుల్‌గాంధీ స్పందించారు. విశ్వవిద్యాలయాలు ఇచ్చిన సర్క్యులర్‌పై పలువురు ప్రముఖులు సైతం విమర్శలు గుప్పిస్తున్నారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా, పార్లమెంట్ సభ్యుడిగా డియు విడుదల చేసిన ఈ ప్రకటనను ఖండిస్తున్నాను. జంతర్ మంతర్ వద్ద ప్రదర్శనలు చట్టవిరుద్ధమని ఎవరు ప్రకటించారు? ఇలాంటి విషయాల్లో తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటని ఎంపి దీపేందర్ హుడా అన్నారు. విద్యార్థుల గొంతులను అణచివేస్తే వారి భద్రత మరింత ప్రమాదంలో పడుతుంది. మనకు నిజంగా వారి భవిష్యత్తుపై ఆందోళన ఉంటే మౌనంగా ఉండకుండా విద్యార్థుల ప్రజాస్వామ్యహక్కులకు మద్దతు ఇవ్వాలని బాలీవుడ్ నటి, చిత్ర నిర్మాత పూజాభట్ అన్నారు.



## హిమాచల్‌లో ఘోర విషాదం..

## కొండచరియలు విరిగి టాక్సీపై పడటంతో 13 మంది మృతి

**సిమ్లా, జూలై 24:** హిమాచల్ ప్రదేశ్‌లోని లాహౌల్ స్పీతి జిల్లాలో శుక్రవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయ్‌పూర్-పాంగీ రహదారిపై కడు నాలా సమీపంలో కొండచరియ ఒక్కసారిగా విరిగి టాటా సుమో టాక్సీపై కూలిపోవడంతో వాహనం పూర్తిగా శిథిలాల కింద చిక్కుకుంది. ఈ ప్రమాదంలో 13 మంది మృతి చెందగా, ఒకరిని గాయాలతో సురక్షితంగా బయటకు తీసినట్లు అధికారులు తెలిపారు. మరో వ్యక్తి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. జిల్లా డిప్యూటీ కమిషనర్ కిరణ్ బదానా తెలిపిన వివరాల ప్రకారం, ప్రమాదం జరిగిన సమయంలో టాటా సుమోలో మొత్తం 15 మంది ప్రయాణిస్తున్నారు. ఉదయ్ పూర్-కిల్లర్ రహదారి కొండచరియల కారణంగా ఒక రోజు పాటు మూసివేయబడగా, శుక్రవారం తిరిగి ప్రారంభించడంతో ప్రయాణికులు పాంగీ లోయ వైపు తమ ప్రయాణాన్ని పునఃప్రారంభించారు. లాహౌల్ లోయకు సుమారు 60 నుంచి 70 కిలోమీటర్ల దూరంలోని కడు నాలా వద్ద ప్రయాణిస్తున్న సమయంలో భారీగా కొండచరియ విరిగి, పెద్ద రాళ్లు, మట్టి ఒక్క సారిగా టాక్సీపై పడ్డాయి. దీంతో వాహనం పూర్తిగా శిథిలాల కింద కూరుకుపోయి, అందు లోని ప్రయాణికులు చిక్కుకుపోయారు. సమాచారమందుకున్న వెంటనే టిండి పోలీస్‌స్టేషన్ సిబ్బంది, జిల్లా యంత్రాంగం, సహాయక బృందాలు సంఘటనా స్థలానికిచేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి.

# అత్యవసర పిటిషన్ ఏదీ రాలేదే..



## సుప్రీం కోర్టు తిరస్కరించిందన్న ఆరోపణలను ఖండించిన సిజెఐ సూర్యకాంత్

## సోషల్ మీడియా పోస్టులపై నిషేధం

**న్యూఢిల్లీ, జులై 24:** 'చలో పార్లమెంట్' నిరసనల సందర్భంగా పోలీసుల తీరుపై అత్యవసర పిటిషన్ దాఖలు కాగా విచారణకు సుప్రీంకోర్టు తిరస్కరించిందన్న వార్తలను సిజెఐ సూర్యకాంత్ కొట్టిపారేశారు. అవన్నీ తప్పుడు కథనాలని పేర్కొన్నారు. కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) ఆందోళనలపై అసలు పిటిషనే దాఖలు కాలేదన్నారు. గత రెండు రోజులుగా మీడియా బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. అత్యవసర పిటిషన్‌ను సిజెఐ విచారణకు స్వీకరించలేదని తప్పుడు వార్తలు ప్రసారం చేస్తోందన్నారు. శుక్రవారం కోర్టు విచారణ ప్రారంభమైన తర్వాత న్యాయవాదులు తమ కేసులను అత్యవసరంగా స్వీకరించాలని విజ్ఞప్తి చేసిన సందర్భంగా సిజెఐ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఇవాళ (శుక్రవారం) ఉదయం 10 గంటల వరకు సిజెపి ఆందోళనలకు సంబంధించి ఒక్క పిటిషన్ కూడా దాఖలు కాలేదు. ఈ అంశంపై విచారణచేపట్టాలని ఎవరో ఒక లాయర్ మాత్రం విజ్ఞప్తి చేశారు. ఓ అభ్యర్థనను పిటిషన్‌గా ఎలా స్వీకరిస్తాం?' అని సిజెఐ అన్నారు. ఈ నెల 20న సిజెఐ చేపట్టిన చలో పార్లమెంట్ ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో అత్యవసరంగా విచారణ చేపట్టాలని న్యాయవాది నరేంద్ర మిశ్రా బుధవారం సుప్రీంకోర్టును అభ్యర్థించారు. పోలీసు దాడులకు సంబంధించి తన వద్ద వీడియో ఆధారాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఆందోళనకారుల్లో ఎక్కువ మంది విద్యార్థులే ఉన్నారని, వారి కోసమైనా అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరారు. అయితే, సుప్రీంకోర్టు అందుకు తిరస్కరించినట్లు వార్తలు వచ్చాయి. కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని, అలాగే పిటిషనర్ కూడా సమయం వృథా చేసుకోవద్దని సిజెఐ హితవు పలికినట్లు రాసుకొచ్చాయి. నిరసనకారులపై పోలీసు చర్యకు సంబంధించిన వీడియోల గురించి పిటిషనర్ తరపు న్యాయవాది ప్రస్తావించగా 'మాకు వీడియోలు చూసే సమయం లేదు' అని సిజెఐ అన్నట్లు కూడా కథనాలు వెలువడ్డాయి.

**సోషల్ మీడియా పోస్టులపై నిషేధం**

మరోవైపు, కోర్టు విచారణలకు సంబంధించిన ఆడియో, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంపై సుప్రీంకోర్టు నిషేధం విధించింది. ఒకవేళ పోస్టు చేయాలనుకుంటే సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్స్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆదేశించింది. కోర్టు కార్యకలాపాలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం వల్ల దుర్వినియోగమవుతున్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది వికాస్‌సింగ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సొలిసిటర్ జనరల్ తుసార్ మెహతా కూడా అంగీకరించారు. నియంత్రణ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై పూర్తి వివరణ ఇవ్వాలని కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ముందస్తు చర్యల్లో భాగంగా నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించింది.

# ఎంపిక చేసిన దిగుమతులపై అమెరికా కొత్త సుంకాలు



## భారత్ సహా 60 దేశాలపై ట్రంప్ సర్కార్ కొత్త టారిఫ్‌లు

## నేటి నుంచే అమలులోకి..

**వాషింగ్టన్,జులై 24:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రపంచ వాణిజ్యంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ), చైనా, జపాన్ సహా మొత్తం 60 వాణిజ్య భాగస్వామ్య దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 10 నుంచి 12.5 శాతం కొత్త సుంకాలను (టారిఫ్‌లు) శుక్రవారం నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. ఈ నిర్ణయంపై ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతులను అరికట్టడంలో ఆయా దేశాలు విఫలమయ్యాయని ఆరోపిస్తూ అమెరికా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ ఆరోపణలను పలుదేశాలు పూర్తిగా ఖండించాయి. పాత తాత్కాలిక సుంకాల స్థానంలో కొత్త టారిఫ్‌లుశుక్రవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త సుంకాలు, ఇప్పటి వరకు అమల్లో ఉన్న 10 శాతం తాత్కాలిక గ్లోబల్ టారిఫ్‌ను భర్తీ చేశాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ట్రంప్ గతంలో అత్యవసర అధికారాల కింద విధించిన "పరస్పర సుంకాలను" అమెరికా సుప్రీంకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో, 1974 అమెరికా ట్రేడ్ యాక్ట్‌లోని సెక్షన్301 ప్రకారం ఈ కొత్త టారిఫ్‌లను అమలు చేస్తున్నారు. ఈ సుంకాలు అమెరికా దిగుమతుల్లో సుమారు 99.4 శాతం వస్తువులకు వర్తిస్తాయి. చమురు, సహజ వాయువు, ఎరువులు, కొన్ని ఆహార ఉత్పత్తులు, విమానాలు, విమాన విడిభాగాలు, కీలక ఖనిజాలు, ఇప్పటికే జాతీయ భద్రతా సుంకాలు అమల్లో ఉన్న ఉక్కు, అల్యూమినియం, రాగి, ఆటోమొబైల్ ఉత్పత్తులకు మినహాయింపు కల్పించారు. అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమీసన్ గ్రీర్ మాట్లాడుతూ, బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతులపై అమెరికాలో దాదాపు వందేళ్లుగా నిషేధం అమల్లో ఉంది. మేము దానిని కఠినంగా అమలు చేస్తున్నాం. మా వాణిజ్య భాగస్వామ్య దేశాలు కూడా అదే విధానాన్ని అనుసరించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. భారత్‌తో పాటు అర్జెంటీనా, బంగ్లాదేశ్, బ్రిటన్, కంబోడియా, కెనడా, ఈక్వడార్, ఎల్ సాల్వడార్, గ్వాటెమాలా, హోండురాస్, ఇండోనేషియా, జోర్డాన్, మలేషియా, మెక్సికో, పాకిస్థాన్, శ్రీలంక, ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశాలపై 10 శాతం టారిఫ్ విధించారు. ఈ దేశాల్లో బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతులను నిషేధించే చట్టాలు ఉన్నప్పటికీ వాటిని సమర్థవంతంగా అమలు చేయడం లేదని అమెరికా పేర్కొంది. భారత్‌ను 10 శాతం కేటగిరీలో ఉంచడం వల్ల, 12.5 శాతం సుంకం విధించిన దేశాలతో పోలిస్తే తక్కువ భారం పడుతున్నప్పటికీ, బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతులపై అమలును మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందని వాషింగ్టన్ స్పష్టం చేసింది. చైనా, వియత్నాంకు 12.5 శాతం టారిఫ్‌చైనా, వియత్నాం సహా మరో 38 దేశాలపై 12.5 శాతం సుంకం విధించారు. బలవంతపు శ్రమతో తయారైన ఉత్పత్తులపై తగిన చర్యలు తీసుకోకపోవడం లేదా అమెరికా ప్రత్యేక నిఘాలో ఉండటమే దీనికి కారణమని తెలిపింది. చైనాలో ఉయ్‌ఘర్ ముస్లింలపై బలవంతపు శ్రమ ఆరోపణలను బీజింగ్ మరోసారి ఖండించింది. ప్రపంచ దేశాల తీవ్ర స్పందఅమెరికా నిర్ణయంపై చైనా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏకపక్ష సుంకాలను తాము వ్యతిరేకిస్తున్నామని, వాణిజ్య యుద్ధాల వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదని పేర్కొంది. ఆస్ట్రేలియా, బ్రెజిల్ ఈ టారిఫ్‌లను 'అన్యాయమైనవి'గా అభివర్ణిస్తూ వాటిని తొలగించాలని కోరాయి. నార్వే కూడా ఈ సుంకాలకు ఎలాంటి చట్టబద్ధమైన ఆధారం లేదని విమర్శించింది.



# సిజెపి నిరసనల్లో విద్రోహశక్తులు

## హెచ్చరించిన నిఘా సంస్థలు

**న్యూఢిల్లీ,జులై 24:** నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్న వేళ, నిఘా సంస్థలు సంచలన హెచ్చరికలు జారీ చేశాయి. ఈ ఆందోళనలను ఆసరాగా చేసుకుని దేశంలో అశాంతిని సృష్టించేందుకు, హింసను ప్రేరేపించేందుకు విద్రోహ శక్తులు భారీ స్థాయిలో దుష్ప్రచారానికి తెరలేపినట్లు స్పష్టం చేశాయి. సోషల్ మీడియా ద్వారా నకిలీ, తప్పుదోవ పట్టించే కంటెంట్‌ను వ్యాప్తి చేసి ప్రజలను రెచ్చగొట్టే ప్రమాదం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. యూనిఫాంలో ఉన్న సైనిక లేదా పోలీసు సిబ్బంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నట్లు చిత్రీకరించిన పలు నకిలీ వీడియోలు ఇప్పటికే ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ప్రస్తుతం నెలకొన్న అస్థిర పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుని, అల్లర్లను సృష్టించేందుకు సంఘ విద్రోహ శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి ఒకరు తెలిపారు.

# దక్షిణ గుజరాత్‌లో వరదల బీభత్సం



**అహ్మదాబాద్,జులై 24:** దేశంలో ఎల్‌నినో ప్రభావం వెంటాడుతున్న తరుణంలో గుజరాత్‌లో భారీ వర్షాలు రాష్ట్రాన్ని ముంచెత్తాయి. నిన్నటి నుంచి కురుస్తున్న వర్షాలతో నగరాల్లోకి వరద అతలాకుతలం చేసింది. అహ్మదాబాద్, సూరత్, నవసారి, వల్సాద్, ఖేడా, తాపి సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. దీంతో అనేక ప్రాంతాల్లో వరదలు సంభవించాయి. నివాసాలు మునిగిపోయాయి. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. నదులు, వాగులే కాదు.. గ్రామాలు, పట్టణాలు, మార్కెట్లు కూడా ముంపునకు గురయ్యాయి. అనేక చోట్ల జాతీయ రహదారులు, రైల్వే ట్రాక్‌లు కూడా నీట మునిగాయి. దీంతో అధికార యంత్రాంగం రంగంలోకి దిగి సహాయ చర్యలు చేపట్టింది. ఐదు హెలికాప్టర్లతో సహాయ చర్యలు అందిస్తున్నారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గుజరాత్‌లో కురుస్తున్న భారీ వర్షాలు సాధారణ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. దక్షిణ గుజరాత్‌లోని పలు జిల్లాలు భయాందోళనలో ఉన్నాయి. స్థానిక పోలీసులు, పరిపాలన యంత్రాంగంతో పాటు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సహాయక, రెస్క్యూ ఆపరేషన్లలో నిమగ్నమైయ్యాయి. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ పరిస్థితిని అంచనా వేయడానికి వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శిస్తున్నారు. నవసారి, వల్సాద్ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఒక్క వల్సాద్‌లోనే సుమారు 1,200 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. వల్సాద్, దాని పొరుగున ఉన్న నవసారి జిల్లాల నుంచి కలిపి 22,000 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

బుధవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నవసారి, వల్సాద్ మినహా సూరత్, అహ్మదాబాద్, ఖేడా, తాపి, డాంగ్ ప్రాంతాల్లో జనజీవనం స్తంభించి పోయింది. వల్సాద్ జిల్లాలోని ఉమర్‌గావ్ తాలూకాలో గత 36 గంటల్లో రికార్డు స్థాయిలో 1,200 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అధికారుల ప్రకారం ప్రభావిత జిల్లాల్లో జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం బృందాలు మోహరించాయి. అదనంగా సహాయక, రెస్క్యూ కార్యకలాపాల కోసం నవసారి, వల్సాద్ జిల్లాల్లో రెండు ఆర్మీ దళాలు మోహరించాయి. గాంధీనగర్‌లోని రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం ప్రకారం.. వల్సాద్ జిల్లాలోని ఉమర్‌గావ్ తాలూకాలో 36 గంటల వ్యవధిలో 1,200 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. ప్రభావిత జిల్లాలన్నింటిలో శుక్రవారం నుంచి పాఠశాలలు, కళాశాలలను మూసివేశారు. ప్రధాని మోడీ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో మాట్లాడి వర్ష ప్రభావిత జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి సాధ్యమైనంత సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.


# సంక్షిప్త వార్తలు

## నేపాల్ సరిహద్దుల్లో వారిస్ పంజాబ్‌దే సానుభూతిపరుల అరెస్ట్



**లక్నో,జులై 24:** ఉత్తరప్రదేశ్ నేపాల్ సరిహద్దు వద్ద భారత భద్రతా దళాలు భారీ ఆపరేషన్ చేపట్టి ఒక పెద్ద ఉగ్రకుట్రను భగ్నం చేశాయి. ఖలిస్థాన్ అనుకూల సంస్థ వారిస్ పంజాబ్ దేకు చెందిన మోస్ట్ వాంటెడ్ సభ్యుడితో పాటు, ఆ సంస్థతో సంబంధాలున్న ఒక అమెరికన్ పౌరుడిని సరిహద్దు వద్ద రక్షణ దళాలు అదుపులోకి తీసుకున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్ జిల్లా పరిధిలో ఉన్న రూపైడీహా సరిహద్దు పోస్ట్ వద్ద సశస్త్ర సీమా బల్, ఉత్తరప్రదేశ్ పోలీసులు సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టారు.

## విద్యార్థులను శత్రువుల్లా చూస్తున్న కేంద్రం: సోనియా




**న్యూఢిల్లీ,జులై 24:** నీట్ పేపర్ లీక్‌పై దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులను కేంద్ర ప్రభుత్వం దేశ శత్రువుల్లా చూస్తోందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆరోపించారు. విద్యార్థుల ధైర్యానికి ప్రభుత్వం జవాబుదారీతనంతో స్పందించాల్సింది పోయి, లాఠీచార్జీలు, బాష్పవాయువు ప్రయోగంతో అణచివేస్తోందని విమర్శించారు. శుక్రవారం ఒక ఆంగ్లపత్రికలో ప్రచురితమైన తన వ్యాసంలో సోనియా గాంధీ కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. నీట్ పేపర్ లీక్, పరీక్షల వ్యవస్థలో లోపాలు, విద్యా సంస్కరణల కోసం విద్యార్థులు న్యాయమైన డిమాండ్లు చేస్తున్నారని పేర్కొన్నారు.

## 1100 రోజుల నుంచి తండ్రి జైలులోనే: ఇమ్రాన్ కుమారుడు



**రావల్పిండి,జులై 24:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, మాజీ క్రికెట్ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఆయన కుమారుడు ఖాసిం ఖాన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తన తండ్రి 1100 రోజులుగా జైలులోనే ఉన్నారని, ఆయన కంటి చూపు క్రమంగా క్షీణిస్తోందని, ఆయనను కలుసుకోవడానికి పాక్ అధికారులు అనుమతి ఇవ్వడం లేదని ఖాసిం ఆరోపించారు. పాక్ సైన్యం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తోందని, రాజకీయ పక్షాలను అణిచివేస్తోందని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై అంతర్జాతీయ సమాజం స్పందించాలని కోరారు.

## ప్రధాని మోడీ సెల్ఫీ విడియోపై ఖర్గే ధ్వజం



**న్యూఢిల్లీ,జులై 24:** నీట్ అక్రమాలు, పేపర్ లీకేజీల వ్యవహారంలో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లు వెత్తుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోడీ అర్ధరాత్రి వేళ సెల్ఫీ వీడియో విడుదల చేయడంపై ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఏకపక్షంగా రేడియో లేదా వీడియోల ద్వారా మన్ కీ బాత్ ఉపన్యాసాలు ఇవ్వడం మాని, విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న ఈ కీలక అంశంపై పార్లమెంట్ వేదికగా స్పష్టమైన సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రధాని అర్ధరాత్రి వేళ వీడియోల ద్వారా సందేశాలు ఇవ్వడం కాకుండా, ఉభయ సభల ఎదుట అధికారికంగా ప్రకటన విడుదల చేయాలని స్పష్టం చేశారు.

## సౌదీ యువరాజు మృతిపై వీడిన మిస్టరీ..



**లండన్,జులై 24:** సౌదీ అరేబియాకు చెందిన 29 ఏళ్ల యువరాజు అబ్దుల్లా బిన్ ఫహద్ లండన్‌లోని ఒక విలాసవంతమైన హోటల్‌లో కన్నుమూసారు. మితిమీరిన మద్యం, మాదకద్రవ్యాల వల్లే ఆయన ప్రమాదవశాత్తు మరణించినట్లు యూకే దర్యాప్తులో తేలింది. ఈ మరణంలో ఎలాంటి కుట్ర కోణం లేదని, ఇది ఆత్మహత్య కూడా కాదని స్థానిక కోర్టు స్పష్టం చేసింది.

## ఎందుకు విరమించానో చెప్తా: వాంగ్‌చుక్



**న్యూఢిల్లీ,జులై 24:** సోనం వాంగ్‌చుక్ 26 రోజులుగా కొనసాగిస్తున్న నిరవధిక నిరాహార దీక్షను శుక్ర వారం విరమించారు. గురుగ్రామ్‌లోని మేదాంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాంగ్‌చుక్‌ను కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, డాక్టర్ జితేంద్ర సింగ్ కలిసి చర్చలు జరపగా దీక్ష విరమించేందుకు అంగీకరించారు. వాంగ్‌చుక్ తన సోషల్‌మీడియా ఖాతాలో ఈ నిర్ణయానికి దారితీసిన షరతులు, చర్చల వివరాలను ప్రత్యేక వీడియోలో వివరిస్తానన్నారు.

25-7Pg6exHMNWJQE_25-7Pg6exHMNWJQE.qxd 24/Jul/26 10:36 PM Page 1



# విలువలతో కూడిన విద్యే ప్రభుత్వ లక్ష్యం

- కూటమి ప్రభుత్వం వచ్చాక విద్య వ్యవస్థలో సమూల మార్పులు
- రాష్ట్ర వ్యాప్తంగా స్కూళ్లలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్స్ ఒక రికార్డు
- పది ఉత్తీర్ణతలో కృష్ణా జిల్లాను మొదటి మూడు ర్యాంకుల్లో నిలబెడతాం
- తాళ్లపాలెం జెడ్పీ హైస్కూల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్స్‌లో మంత్రి కొల్లు రవీంద్ర




**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యార్థులకు మెరుగైన విద్యతో పాగా విలువలతో కూడిన జీవన విధానం అలవర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్స్ నిర్వహిస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం తాళ్లపాలెం లోని జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్స్ లో పాల్గొన్నారు. విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. విద్యార్థులతో తల్లి దండ్రులకు పాదపూజ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్స్ అత్యంత ఘనంగా నిర్వహించుకుంటున్నందుకు సంతోషంగా ఉంది. కూటమి అధికారంలోకి వచ్చాక పిల్లలు ఎలా చదువుతున్నారో వారికి ఏ రంగంలో ఆసక్తి ఉందో తెలుసుకోవడమే లక్ష్యంగా పేరెంట్ టీచర్ మీటింగ్స్ నిర్వహిస్తున్నాం. కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో 85 శాతం పాస్ పర్సెంటేజీ రావడం అభినందనీయమని, వచ్చే ఏడాది మాత్రం మొదటి మూడు ర్యాంకుల్లో జిల్లాను నిలబెట్టే బాధ్యత తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. విద్యతో పాటుగా విలువలు నేర్పించడమే లక్ష్యంగా చాగంటి కోటేశ్వరరావుతో తరగతులు చెప్పిస్తున్నాం. విద్య వ్యవస్థలో సమూల మార్పులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ఈ ఏడాది బడ్జెట్లో ఏకంగా రూ.32 వేల కోట్లు కేటాయించడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. అదే సమయంలో తల్లికి వందనం పథకాన్ని ప్రతి విద్యార్థికి అందిస్తామన్న హామీ మేరకు 67 లక్షల మందికి రూ.10,500 కోట్లు చెల్లించాం. అర్హత కలిగిన ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం అమలు చేశాం. ఏపీని నాలెడ్జి కేంద్రంగా మార్చే లక్ష్యంతో విద్య వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చాం. హామీ మేరకు 16,300 ఉపాధ్యాయ పోస్టుల్ని భర్తీ చేశాం. త్వరలోనే మరో డీఎస్సీ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నాం. ప్రైవేట్ స్కూల్లకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లను మార్చబోతున్నాం. భవిష్యత్ తరాలను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేస్తుంటే.. జగన్ రెడ్డి అండ్ కో రోజుకో కుట్ర చేస్తున్నారు. చివరికి ఉపాధ్యాయ నియామకాలపై కూడా తప్పుడు ఆరోపణలు, కేసులతో డీఎస్సీ ని అడ్డుకోవాలని ప్రయత్నించారు. ఎవరు కుట్రలు చేసినా, అవాంతరాలు సృష్టించినా రాష్ట్ర అభివృద్ధి భవిష్యత్ తరాల పురోభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యన్నారాయణ

# వరి వద్దు.. ఆరుతడి పంటలే సాగు చేయండి

- జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి

**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రజలకు ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా మంచి నీటికి ఇబ్బంది లేకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి తెలిపారు. వర్షాభావ పరిస్థితుల వల్ల రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లలో నీటిమట్టాలు కనిష్ఠస్థాయిలో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఈ పరిస్థితుల దృష్ట్యా ప్రజల మంచినీటి అవసరాలు తీర్చడమే ధ్యేయంగా ప్రభుత్వం నిర్దేశించుకుందని తెలిపారు. వచ్చే ఏడాది జూన్ వరకు నీటిని తాగునీటికి కేటాయించి మిగతా జలాలను ఆరుతడి పంటలకు అందించేలా ప్రణాళిక రచించినట్లు ఇరిగేషన్ ఇఎన్‌సి తెలిపారు. రైతులు విజ్ఞతతో నడుచుకుంటూ సహకరించాలని కోరారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి కొరతను అధిగమించాల్సి ఉంటుందని ఈఎన్‌సీ నరసింహమూర్తి పేర్కొన్నారు. గోదావరి నదిలో ఇంత తక్కువ స్థాయిలో నీటి ప్రవాహం ఉంటుందని అనుకోలేదన్నారు. లక్షల క్యూసెక్కుల నుంచి ఒక్కసారిగా వేల క్యూసెక్కులకు పడిపోవడాన్ని ప్రస్తుతం చూస్తున్నామని చెప్పారు. గోదావరి డెల్టా పరిధిలోని క్షేత్రస్థాయి పరిస్థితులను రేపు అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతానికి గోదావరి డెల్టాకు పరిస్థితులు కొంత ఆశాజనకంగానే ఉన్నప్పటికీ, కృష్ణా డెల్టాకు లోటు ఏర్పడిందని స్పష్టం చేశారు. సాధారణంగా వర్షాలు సమృద్ధిగా ఉన్నప్పుడే కృష్ణా డెల్టా 150 టీఎంసీల నీరు అవసరమవుతుందని, ఒకవేళ వర్షాలు లేకపోతే ఆ డెల్టాకు అంతకంటే ఎక్కువ నీటి అవసరం ఉంటుందని వివరించారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో తాగునీటి సరఫరాకే తొలి ప్రాధాన్యత ఇస్తూ తాము ముందుకు వెళ్లాల్సి ఉంటుందని ఈఎన్‌సీ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో జలాశయాల్లో నీటి లభ్యత బట్టి తగిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని నరసింహమూర్తి వెల్లడించారు. అనధికారిక పంపుల వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆర్ఎంసీ పరిధిలో రైతులు ప్రస్తుతం వరి సాగు చేయవద్దని సూచించారు. నీరు లేక పంట నష్టపోయే ప్రమాదం ఉందని ఇఎన్‌సి హెచ్చరించారు. భవిష్యత్తులో నీటి లభ్యత పెరిగితే వ్యవసాయ శాఖతో కలిసి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కృష్ణా డెల్టా పరిధిలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులను సూచించారు. అసాధారణ పరిస్థితులను రైతులు అర్థం చేసుకుని విజ్ఞతతో వ్యవహరించాలని



ఇంజినీర్ నరసింహమూర్తి అన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీటి సరఫరా కొనసాగుతోందన్నారు. గోదావరిలో ప్రవాహాలు తగ్గడంతో పట్టిసీమ పంపింగ్‌పై ప్రభావం పడిందని తెలిపారు. సీలేరు నీటి లభ్యత కూడా తగ్గిందని ప్రస్తావించారు. కృష్ణా డెల్టా సాగుకు అవసరమైన నీటి లభ్యత ప్రస్తుతం అందుబాటులో లేదని అన్నారు. పట్టిసీమలో అన్ని పంపులను ఒకేసారి నడపడం సాధ్యం కావట్లేదని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఆర్ఎంసీ నుంచి అనధికారికంగా నీరు తీసుకోవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.

# పార్టీ కోసం కష్టపడ్డవారికి గుర్తింపునిస్తాం


- తగిన సమయంలో జనసేనాని ప్రాధాన్యతనిస్తారు
- జనసేన పార్టీ శ్రేణులతో మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన పార్టీ కోసం గ్రామ స్థాయి నుంచి కార్యకర్తలు సొంతంగా పనిచేశారని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. పార్టీ కోసం వారు చేసిన త్యాగాలను తమ నేత పవన్ కల్యాణ్ మరచిపోరు అన్నారు. వారికి తగిన సమయంలో ప్రాధాన్యతను ఇస్తారన్నారు. విజయవాడలో శుక్రవారం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర బాగు కోసం కూటమి విజయం సాధించాలని అందరం కలిసి పని చేశామని చెప్పారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల కోసం అంతా సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మిత్రపక్ష పార్టీల నేతలను కలుపుకుని ముందుకు సాగాలని నేతలకు సూచించారు. పార్టీ కోసం పనిచేసే వారిని జనసేన అధినేత పవన్ కల్యాణ్ గుర్తించి ప్రోత్సహిస్తారని మంత్రి తెలిపారు. జనసేన పార్టీని ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లేలా పని చేయాలని అన్నారు. జనసేన పార్టీ బలం పెంచుకోవడం ద్వారా ఎక్కువ స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. జనసేనలో ఎంతోమంది సామాన్య కార్యకర్తగా పని చేసి వివిధ హోదాలు సంపాదించారన్నారు. రాష్ట్రంలో వైసీపీ వంటి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పేలా అందరూ కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. విజయవాడ కార్పొరేషన్‌లో కూటమి పార్టీ విజయకేతనం ఎగురవేయాలని కందుల దుర్గేష్ పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న వారు పటిష్టమైన వ్యూహంతో ముందుకు వెళ్లాలి. ప్రజలతో మమేకం కావాలి. క్షేత్రస్థాయిలో ప్రజల బాధలు, వేదనలు వినాలి. వారి సమస్యలను తీర్చే సత్తా చాటాలి. ప్రతి సమస్య మీద అవగాహన ఉండాలి. సమస్యల పరిష్కారానికి తగిన ఆలోచన ఉండాలి. నాయకులు రెండు ఫ్లెక్సీలు పెడితేనో, రెండు బ్యానర్లు కడితేనో అయిపోరు. ప్రతి ఒక్కరికీ తగిన అవకాశం ఇవ్వాలని శ్రీ పవన్ కళ్యాణ్ గారికి ఉంటుంది. కూటమి ప్రభుత్వంలో మొత్తం అన్ని పదవులు, బాధ్యతలు మనకే రావాలని అనుకోవడం తగదు. ఎవరికి.. ఏ బాధ్యత ఎప్పుడు అప్పగించాలి..? జెండా పట్టుకొని నడిచే కార్యకర్తలకు ఎలాంటి గౌరవం ఇవ్వాలనేది పవన్ కళ్యాణ్ అవగాహన ఉంది. ప్రతి ఒక్కరికీ తగిన న్యాయం జరుగుతుంది. దీనిలో సందేహం లేదు.

ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యే బొలిశెట్టి, సామినేని ఉదయభాను, అమ్మిశెట్టి వాసు, రావి సౌజన్యతో పాటు విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# ప్రేమ.. పెళ్లి... దంపతులపై దాడి



**తిరుపతి, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** కుటుంబసభ్యులను కాదని ప్రేమించి పెళ్లి చేసుకున్న యువ దంపతులపై యువతి కుటుంబ సభ్యులు దాడికి పాల్పడిన సంఘటన తిరుపతిలో జరిగింది. ప్రేమ జంట ఒక ఇంటివారైన తరువాత తమకు రక్షణ కల్పించాలని కోరుతూ తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పీని కలవడానికి వెళ్తుండగా కూతవేటు దూరంలో ఈ దాడికి దిగడం సంచలనం కలిగించింది. ఉన్నఫళంగా అక్కడే యువతి మెడలో తాళిబొట్టును తెంచి యువకుడిపై పెళ్లి కుమార్తె వర్గీయులు దాడి చేశారని ఫిర్యాదు అందింది. స్థానికుల సహాయంతో ఇరువురిని ఎస్వీ యూనివర్సిటీ పోలీసుల చెంతకు చేర్చారు. అయితే ఇద్దరు నూతన దంపతులది అన్నమయ్యజిల్లా కావడంతో ఆ జిల్లా పోలీసులకు తిరుపతి పోలీసులు సమాచారమిచ్చారు. అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలం కేకల దొడ్డిపల్లికి చెందిన శివ స్నేహకు సూళ్లూరుపేట మండలం మతిమూడి గ్రామానికి చెందిన చందుతో పరిచయమైంది. ఓ కోచింగ్ సెంటర్‌లో ఏర్పడిన వీరిద్దరి పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఇద్దరూ మేజర్లు కావడంతో ఈనెల 19న ఓ గుడిలో పెళ్లి చేసుకున్నారు. అయితే శివస్నేహ కనబడటంలేదని రాయచోటి పోలీస్ స్టేషన్‌లో ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. యువకుడిపై అనుమానంతో అతని తల్లి మునిలక్ష్మిని, పెద్దమ్మ అచ్చమ్మతోపాటు మేనమామముని చంద్రను రాయచోటి పోలీసులు విచారణకు పిలిచారు. ఈ విషయమై తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళుతుండగా దాడి జరిగినట్టు నవ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు వివరాలను రాసుకుని రాయచోటి పోలీసులకు సమాచారమిచ్చారు. నవ దంపతులను రాయచోటి పోలీసులకు అప్పగించడంతో ప్రస్తుతం రాయచోటి పోలీసుల విచారణలో

# మహిళ ఆత్మహత్యాయత్నం

**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లాలోని గుడివాడ నెహ్రూ చౌక్ అంబేద్కర్ విగ్రహం వద్ద మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఆస్తి వివాదం నేపథ్యంలో కైకలూరు మండలం చావలిపాడుకి చెందిన తలారి రమాదేవి(50) పాయిజన్ టాబ్లెట్లు మింగి బలవన్మరణానికి యత్నించారు. విషమాత్రలు మింగిన అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద మహిళ సొమ్మసిల్లి పడిపోయారు. సమీపంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ బృందం.. రమాదేవి పరిస్థితిని గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మహిళ చికిత్స పొందుతున్నారు. వంశపారంపర్య భూమిని బాబాయి, అతని కొడుకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని రమాదేవి ఆరోపించారు. ఈ విషయంలో తనకు న్యాయం జరగదన్న భయంతోనే ఆత్మహత్యకు ప్రయత్నించానని తెలిపారు. ఉపాధి పనులు చేసుకొని బతికే తమకు న్యాయం చేయాలని బాధితురాలు వేడుకున్నారు. ఈ ఘటనపై గుడివాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


# తిరుమల సమాచారం



## గోవిందరాజస్వామి ఆలయంలో జ్యేష్ఠాభిషేకం

**తిరుమల, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే జ్యేష్ఠాభిషేక మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుండి శతకలశ స్నపనం, మహాశాంతి హోమం శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం ఆలయంలోని కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం వేదోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరి నీటితో విశేష అభిషేకం చేసి, అనంతరం స్వామివారి కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కవచాధివాసం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వావి తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ ఎఇఒ నారాయణ చౌదరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయులు, ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## ఆగస్టు 1 నుండి పుష్కరిణి శుద్ధి పనులు



**తిరుమల, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో శ్రీవారి ఆలయానికి ఉత్తరం వైపు ఉన్న పవిత్ర పుష్కరిణి మరమ్మతులు, శుద్ధి పనులు చేపట్టేందుకు నెలరోజులపాటు పుష్కరిణిని తిరుమల తిరుపతి దేవస్థానం మూసివేయనుంది. సాధారణంగా ప్రతి ఏడాది ఏడుకొండల స్వామి బ్రహ్మోత్సవాలకు ముందు నెలరోజులు పాటు పుష్కరిణి మూసివేసి నీటిని పూర్తిగా తొలగిస్తారు. పుష్కరిణిలోపల ఉన్న పైపులైన్ల మరమ్మతులు, పుష్కరిణి సివిల్ పనులు చేపడతారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో 15వ తేదీ నుండి వెంకన్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, అక్టోబర్‌లో 11నుండి నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. దీనికంటే ముందే పుష్కరిణి మరమ్మతులు, శుద్ధిచేసే పనులు చేపట్టేలా టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఇంజనీరింగ్, వాటర్‌వర్క్స్ విభాగం అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ కారణంగా ఆగస్టు 1 నుండి 31 వరకు పూర్తిగా స్వామివారి పుష్కరిణి మూసివేస్తారు. భక్తులను కూడా అనుమతించరు. భక్తులకు స్నానాలకోసం వరాహస్వామి ఆలయం సమీపంలోనే స్నానఘట్టాలు, నీటికొళాయిలు ఏర్పాటు జరుగుతుంది. అలాగే భారీ వర్షాలు, తుఫాన్లు, ఇతర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ముందుస్తు జాగ్రత్తలో భాగంగా సెప్టెంబర్ 1వ తేదీ నుండి 10వ తేది వరకు పుష్కరిణి మూసివేయబడుతుంది. ఈ 40 రోజుల పాటు పుష్కరిణి హారతి ఉండదు. అదేవిధంగా భక్తులను పుష్కరిణిలోకి అనుమతించరు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సహకరించాల్సిందిగా భక్తులకు టిటిడి విజ్ఞప్తి చేసింది.

## తిరుమలకొండపై శబ్ద కాలుష్య నియంత్రణకు

# 'నో హారన్ జోన్'




**తిరుమల, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశం నలుమూలల నుండి శ్రీవారి దర్శనార్థం తిరుమల పుణ్యక్షేత్రానికి వస్తున్న యాత్రికులు వారి వాహనాలతో బాటు ట్యాక్సీల నుండి వెలువడుతున్న శబ్ద కాలుష్యానికి చెక్ పెట్టేందుకు టిటిడి మళ్ళీ సమాయత్తమవుతోంది. ఇప్పటికే కొండపై జిఎన్‌సి టోల్‌గేట్ దాటిన తరువాత 'నో హారన్ జోన్' అమలు చేసినా అది పూర్తిస్థాయిలో కార్యాచరణ అమలుకాలేదు. దీంతో కొండపై వాహనాల హారన్లమోతతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరుమలకు రోజు వారీగా ఐదువేల వరకు యాత్రికుల వాహనాలు వస్తున్నట్లు అంచనా. ఇదేగాక మరో మూడువేల వాహనాలు తిరుమల– తిరుపతి ట్యాక్సీలు. 450వరకు ఆర్టీసి బస్సులు ఇలా నడుస్తున్నాయి. తిరుమల పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణాన్ని పరిరక్షించేందుకు, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు టిటిడి ,తిరుపతి జిల్లా పోలీసులు సంయుక్తంగా 'నో హారన్ జోన్' నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నారు. కొండపై అనవసరంగా హారన్లు, సైరన్లు మోగించడాన్ని పూర్తిగా నిషేధించారు. ఈ నిబంధనను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ, భారీ జరిమానాలు విధిస్తున్నారు.

గత ఆరు నెలల కాలంలోనే శబ్దకాలుష్యానికి కారణమైన 42 వాహనాలపై మోటారు వాహన చట్టం కింద కేసులు నమోదు చేశారు. రూ.64,475లు జరిమానా వసూలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. తిరుమలలో జిఎన్‌సి టోల్‌గేట్ నుండి రెండు ఘాట్ రోడ్లతో సహా కొండపై అన్ని ప్రాంతాల్లో ఈ నిబంధన వర్తిస్తుంది.

ఎప్పటి నుండో ఈ నిబంధనలు అమల్లో ఉన్నప్పటికీ, చాలా మంది వాహన దారులు దీన్ని పట్టించుకోకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ చర్యలు తీవ్రతరం చేశారు.

నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు పోలీస్ కమాండ్ కంట్రోల్ విభాగం ఆధ్వర్యంలో రెండువేలకు పైగా సిసి కెమెరాలతో నిరంతరం నిఘా కొనసాగుతోంది. నిబంధనలను అతిక్రమిస్తే కెమెరాల ద్వారా గుర్తించి చలాన్లు పంపడం ఖాయమని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆలయాలు, ప్రశాంత ప్రదేశాల్లో పగటిపూట 50 డెసిబుల్స్, రాత్రిపూట 40 డెసిబుల్స్ మించి శబ్దాలు ఉండరాదనే నిబంధన అమలవుతోంది. ఇక మరింత కఠినంగా ఈ



## భక్తిభావాన్ని పెంపొందించేలా ఎస్‌విబిసి కార్యక్రమాలు

**తిరుమల, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ధార్మికసంస్థ ఆధ్వర్యంలోని ఎస్‌విబిసిలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల్లో మరింత భక్తి భావాన్ని పెంపొందించేలా సృజనాత్మకంగా, నాణ్యంగా కార్యక్రమాలు రూపొందించాలని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర అధికారులను ఆదేశించారు. తిరుమల క్షేత్రంలోని స్థాపాలు, మండపాలు, ప్రాకారాలు, తీర్థాలు, ఉపాలయాలు, శ్రీవారి ప్రసాదాల విశిష్టత తదితర అంశాలను భక్తులకు సులభంగా అర్థమయ్యేలా కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. తిరుమల ఆధ్యాత్మిక వైభవం, శ్రీవారి మహిమను ప్రతి భక్తుడి హృదయానికి చేరేలా ఆకర్షణీయమైన కార్యక్రమాలను రూపొందించాలని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు ఎస్‌విబిసిని వీక్షిస్తున్నారని, ప్రతి కార్యక్రమం భక్తులను చివరి వరకు ఆసక్తిగా చూసేలా ఉండాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. భక్తి, భావం, సరళత కలగలిపిన కార్యక్రమాలతో ప్రేక్షకాదరణ పెరిగేలా కొత్త ఆలోచనలకు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. ప్రస్తుతం ప్రసారమవుతున్న కార్యక్రమాలను సమీక్షించి, భక్తుల అభిరుచికి అనుగుణంగా మరిన్ని వినూత్నమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌విబిసి సిఇఒ, టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ మాట్లాడుతూ ప్రసారమవుతున్న కార్యక్రమాల వివరాలను ఇఒకు వివరించారు. శుక్రవారం ఎస్‌విబిసి రోజువారీ ప్రసారాలు, భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పనపై ఇఒ రవిచంద్ర సమీక్ష నిర్వహించారు. సమీక్షకు ముందు ఆధ్యాత్మిక విశేషాల విభాగం, ఎడిట్ విభాగం, పలు స్టూడియో విభాగాలను పరిశీలించి ఇఒ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విబిసి సిపిఒ ఏ.సి. ఎస్ఇ మనోహరం, అకౌంట్స్ అధికారి విశ్వనాథ రాయల్‌తో పాటు ఇతర అధికారులు,

## నేడు కపిలేశ్వరస్వామి పవిత్రోత్సవాలకు అంకురార్పణ



**తిరుమల, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలోని ప్రసిద్ధ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26 నుండి 28వ తేదీ వరకు వార్షిక పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఇందుకోసం నేటి సాయంత్రం అంకురార్పణతో ప్రారంభించనున్నారు. సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 8.30 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. పవిత్రోత్సవాల్లో భాగంగా 26 ఆదివారం పవిత్ర ప్రతిష్ఠ, 27న గ్రంథి పవిత్ర సమర్పణ, 28 మంగళవారం మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఉదయం సుప్రభాత సేవ అనంతరం కపిలేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం కపిలేశ్వరస్వామి, కామాక్షమ్మ అమ్మవారు, విఘ్నేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరస్వామివార్ల ఉత్సవమూర్తులకు కల్యాణ మండపంలో స్నపన తిరుమంజనం వైభవంగా జరుగుతుంది. రూ.700లు టికెట్‌తో గృహస్తులు (ఇద్దరు) పవిత్రోత్సవాల్లో పాల్గొనవచ్చు. పాల్గొనే వారికి ఒక లడ్డూ, ఉత్తరీయం, రవికెతో పాటు ఉత్సవాల చివరి రోజు పవిత్రమాలలను ప్రసాదంగా అందజేస్తారు.




## మొగలిచెర్ల దత్తమందిరంలో 29న దత్త హోమం

**తిరుపతి, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మికక్షేత్రం లింగ సముద్రం మండలం మొగలిచెర్ల గ్రామంలోని దత్తాత్రేయ స్వామి మందిరంలో ఈనెల 29వ తేదీ బుధవారం దత్త హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ తెలిపారు. హోమంలో నేరుగా పాల్గొనదలచిన భక్తులు బుధవారం ఉదయం 8 గం.లకు మందిరం వద్దకు రావాలని నాగేంద్రప్రసాద్ కోరారు. భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ కన్వీనర్ విష్ణుసాయి కౌశిక్ తెలిపారు.

## నిరక్షరాస్యత మూఢ నమ్మకాలు, ఛాందస భావాల నివారణకు

# గ్రంథాలయాల స్థాపనే పరిష్కారమార్గం



**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** "పౌర గ్రంథాలయాలే జ్ఞాన దేవాలయాలు" అనే నినాదంతో ఊరూరా గ్రంథాలయ చైతన్యోద్యమం నడిపిన గ్రంథాలయోద్యమ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య అని విశ్రాంత ఆచార్యులు, ఆయన మనవడు అయ్యంకి మురళీకృష్ణ అన్నారు. అయ్యంకి వెంకటరమణయ్య 136వ జయంతి కార్యక్రమాన్ని విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి మురళీకృష్ణ, నవమల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ అతిథులుగా హాజరయ్యారు. ముందుగా వెంకట రమణయ్య చిత్రపటానికి, శిలాఫలకానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం కలిమిశ్రీ మాట్లాడుతూ నిరక్షరాస్యత, అజ్ఞానం, మూఢ నమ్మకాలు, ఛాందస భావాల నివారణకు గ్రంథాలయాల స్థాపనే పరిష్కారమార్గమని ఎంచి గ్రంథాలయాల వ్యాప్తికి అయ్యంకి వెంకటరమణయ్య నడుం కట్టారన్నారు. ఈ కార్యక్రమంలో పడాల నీలా రమేష్ గౌతమ్ రాసిన "మనిషి కోసం" వ్యాస, కవితా సంపుటిని అయ్యంకి మురళీకృష్ణ కలిమిశ్రీ ఆవిష్కరించారు. గ్రంథాలయాధికారిణి రమాదేవి మాట్లాడుతూ ఆ మహనీయుడు ఏర్పాటు చేసిన గ్రంథాలయాలు నేడు యువతరానికి పఠన కేంద్రాలుగానే కాక ఉద్యోగ ప్రసాదిత కేంద్రాలుగా కూడా ఉపయోగపడుతున్నాయన్నారు. మరో ప్రభుత్వ కార్యక్రమంలో వుండి రాలేకపోయిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఫోను ద్వారా పంపిన నివాళి సందేశాన్ని రమాదేవి చదివి వినిపించారు.

25-7Pg7exHMNWJQE_25-7Pg7exHMNWJQE.qxd 24/Jul/26 10:54 PM Page 1



## స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి

### సిఎం చంద్రబాబుకు డాక్టర్ సుధాకర్ రెడ్డి లేఖ



**తిరుపతి, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు (ఎంపిపి), జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్ల పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని టిడిపి మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకి లేఖ రాశారు. స్థానిక సంస్థల కీలక పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రజలకు తమ నాయకులను నేరుగా ఎన్నుకునే అవకాశం లభిస్తుందని, ఎన్నికైన నాయకులకు ప్రజల నుంచి ప్రత్యక్ష ప్రజాస్వామ్య మద్దతు లభించడంతో పాటు ప్రజలకు నేరుగా జవాబుదారీతనం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న పరోక్ష ఎన్నికల విధానం వల్ల రాజకీయ అస్థిరత, ప్రలోభాలు, క్రాస్ ఓటింగ్, అవిశ్వాస తీర్మానాలు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితులు స్థానిక సంస్థల సుస్థిర పాలన, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజల ప్రత్యక్ష మద్దతుతో ఎన్నికైన నాయకులు స్థానిక అభివృద్ధి, ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై మరింత సమర్థవంతంగా దృష్టి సారించే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు.

## ప్రతి చుక్కతో అధిక దిగుబడి

### 'ప్రధాన మంత్రి కృషి సిన్‌చాయీ యోజన' ఓ వినూత్న పథకం



**న్యూఢిల్లీ, జులై 24, ప్రభాతవార్త:** 'ప్రతి చుక్కతో అధిక దిగుబడి' ఆశయంతో 2015లో అంకురార్పణ జరిగిన 'ప్రధాన మంత్రి కృషి సిన్‌చాయీ యోజన', గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మార్చే ఒక మహత్తర పథకం. రైతుకు నిర్దిష్ట ప్రయోజనాలు చేకూర్చే కేంద్ర ప్రభు త్వం రైతు సంక్షేమం పథకం. నీటి ప్రాజెక్టుల పూర్తి, కమాండ్ ఏరియా డెవలప్ మెంట్, ఉపరితల చిన్న నీటి పారుదల చెరువుల మరమ్మతు, భూగర్భ జలవృద్ధి, బీడు భూముల సారం పెంపు, సూక్ష్మనీటి పారుదల ప్రోత్సాహం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మార్చే ఒక మహత్తర పథకం. వాతావరణ మార్పుల కాలంలో నీటి భద్రతే ఆహార భద్రతకు మూలం. పంట దిగుబడిని 30-40 శాతం పెంచుతుంది. రైతుల ఆదాయాన్ని హెక్టారుకు యేటా రూ.2 లక్షల మేర పెంచుతుంది, వ్యవసాయ రుణాల ఎగవేతలను తగ్గిస్తుంది. ప్రధానమంత్రి కృషి సిన్‌చాయీ యోజన మద్దతు గల సూక్ష్మ నీటిపారుదల గణనీయమైన వ్యవసాయ లాభాలను అందిస్తుందని అంచనాలు నిర్ధారిస్తున్నాయి. పంట నీటి సున్నితత్వాన్ని బట్టి, దిగుబడి మెరుగుదలలు స్థిరంగా 30 నుండి 40 శాతం మధ్య ఉంటున్నాయి. మహారాష్ట్ర రైతులకు ఈ పథక ప్రయోజనాలు ఇబ్బడి ముబ్బడిగా అందాయి. అనుకున్నట్లే మహారాష్ట్రలో పత్తి దిగుబడి 37 నుండి 40శాతం పెరిగింది, తమిళనాడులో చెరకు ఉత్పాదకత 34 నుండి 37శాతం పెరిగింది. అధికవిలువ గల కూరగాయల (టమోటాలు, ఉల్లి పాయలు, బంగాళాదుంపలు) దిగుబడి 42 నుండి 48శాతం వరకు గణనీయంగా పెరిగింది. ధాన్యపు పంటలు 16 నుండి 24శాతం వరకు మితమైన లాభాలను చవిచూశాయి. ఈ ఉత్పాదకతలో వచ్చిన భారీ పెరుగుదలలు నేరుగా రైతు ఆదాయ వృద్ధికి దారితీస్తాయి. ఉద్యానవన అధిక విలువ పంటలైన ద్రాక్ష, దానిమ్మ వంటివి హెక్టారుకు యేటా రూ. 1 లక్ష 90 వేల రూపాయలు నుండి రూ. 2.20 లక్షల వరకు ఆదాయాన్ని చేకూర్చగా, చెరకు పంట రూ.1, లక్ష 50 వేల నుండి రూ.1, లక్ష 80 వేల వరకు అదనపు ఆదాయాన్ని అందించింది. దీనికి అనుగుణంగా, ఆదాయాలు స్థిరపడటం వల్ల ఐదేళ్ల పరిశీలన కాలంలో సహకార బ్యాంకుల డిఫాల్ట్ రేట్లు 16 నుండి 20శాతం వరకు తగ్గడంతో, పాల్గొనేవారిలో ఆర్థిక ఒత్తిడి కూడా తగ్గింది. పర్యావరణ గణాంకాలు సానుకూల పర్యావరణ ప్రభావాలను సూచిస్తున్నాయి. 341 కమాండ్ ఏరియాలలో సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ అంచనాల ప్రకారం, ఈ వ్యవస్థను ఏర్పాటు చేసిన 24 నెలల్లోపే పర్యవేక్షించిన జోన్లలో 59శాతంలో భూగర్భ జల మట్టం స్థిరపడినట్లు నమోదైంది. అంతేకాకుండా, సాంప్రదాయ వరద నీటిపారుదల పద్ధతులతో పోలిస్తే, ప్రెసిషన్ ఇరిగేషన్ నైట్రేట్, ఫాస్ఫేట్ ప్రవాహాన్ని గణనీయంగా తగ్గించింది.

ప్రధానమంత్రి కృషి సిన్‌చాయీ యోజన (పిఎంకెఎస్‌వై) ఒక సంక్లిష్టమైన పరిపాలనా వ్యవస్థ ద్వారా పనిచేస్తుంది. ఇది ఆరు విభిన్న సంస్థాగత స్తంభాలను అనుసంధానిస్తుంది. కేంద్ర మంత్రిత్వ శాఖ, రాష్ట్ర స్థాయి నోడల్ సంస్థలు, జిల్లా స్థాయి నీటిపారుదల శాఖలు, ప్రాథమిక వ్యవసాయ లబ్ధిదారులు, నీటి వినియోగదారుల సంఘాలు, గ్రామీణ రుణప్రదాతల వంటి ద్వితీయ సహాయక సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు, పరికరాల సరఫరాదారులతోసహా ప్రత్యేక సాంకేతిక అమలు భాగస్వాములు. ప్రతి భాగస్వామి కేంద్ర ఆదేశాలు రాష్ట్ర పరిపాలనా నిర్దేశాల ద్వారా నిర్దేశించబడిన అధికారం, జవాబు దారీతనం నిర్వచించబడిన చట్రంలో పనిచేస్తారు. భాగస్వాముల అధికారాలు, బాధ్యతల పంపిణీ జలశక్తి మంత్రిత్వ శాఖ అగ్రస్థానంలో ఉంది. జలవనరుల నిర్వహణ, వ్యవసాయ పర్యవేక్షణను 2019లో ఏకీకృతం చేయడం ద్వారా దీనిని ఏర్పాటు చేశారు. ఈ ఏకీకృత సంస్థ జాతీయ విధానాన్ని నిర్దేశిస్తుంది, ఆర్థిక కేటాయింపులను నిర్దేశిస్తుంది, పనితీరు కొలమానాలను పర్యవేక్షిస్తుంది. తద్వారా నీటి పంపిణీ, పంట ఉత్పత్తి లక్ష్యాల మధ్య ఉన్న చారిత్రక అంతరాలను పూరిస్తుంది. ప్రస్తుత నీటిపారుదల సామర్థ్యం, జనాభా సాంద్రత, చారిత్రక పనితీరు అంతరాలను పరిగణనలోకి తీసుకునే ఒక సూత్రం ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు పంపిణీ జరుగుతాయి.. ఇవి చిన్న పరిపాలనా ప్రాంతాలకు రూ.2,500 కోట్ల నుండి పెద్ద రాష్ట్రాలకు రూ.10 వేల కోట్లకు పైగా ఉంటాయి. రాష్ట్రస్థాయి ప్రాజెక్ట్ నిర్వహణ విభాగాలు, అమలుకు ప్రాథమిక చోదకశక్తులుగా పనిచేస్తాయి.

స్థల ఎంపిక, పర్యావరణ అనుమతుల సమన్వయం, కాంట్రాక్టర్ల నిర్వహణ, ఆర్థిక నివేదికలపై వీటికి చట్టబద్ధమైన అధికారం ఉంటుంది. మహారాష్ట్ర, తెలంగాణ వంటి రాష్ట్రాలు ఈ విభాగాలను నేరుగా తమ నీటిపారుదల శాఖలలో విలీనం చేయగా, ఇతర ప్రాంతాలు, ముఖ్యంగా ఈశాన్య ప్రాంతంలో, అమలుకోసం ప్రత్యేక కార్పొరేట్ సంస్థలను ఏర్పాటు చేశాయి. క్షేత్రస్థాయిలో, జిల్లా నీటిపారుదల శాఖలు అమలును నడిపిస్తాయి. వ్యవసాయ శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్లు, భూమి శిస్తు రికార్డులను అధికారిక నీటి హక్కుల పత్రాలతో సరిపోల్చడం ద్వారా అర్హులైన రైతుల ధ్రువీకరణకు నాయకత్వం వహిస్తారు. వ్యవస్థ నిర్వహణపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తూనే, ఖర్చులను తగ్గించడానికి రైతుల శ్రమ భాగస్వామ్యంతో ముందుకు కదలుతోంది. దిగుబడి మెరుగుదలలు, నీటి సామర్థ్యాన్ని పర్యవేక్షించే బహుళ రుతువుల పనితీరు పర్యవేక్షణ దశతో ఈ పథకం లక్ష్యం ముగుస్తుంది. భూగర్భ జలం లేని పొడి ప్రాంతాలలో స్ప్రింక్లర్లను ఏర్పాటు లేదా నేలలోని తేమను పర్యవేక్షించే సామర్థ్యం లేకుండా డ్రిప్ సిస్టమ్లను అమర్చడంలో ప్రజాధనం వృథా అయ్యింది. ఈ సాంకేతిక వైఫల్యాలను ప్రధానమంత్రి కృషి సిన్చాయీ యోజన విధానపర, క్రమశిక్షణ సమర్థవంతంగా తొలగిస్తుంది. భౌతిక క్షేత్ర తనిఖీల అవసరాన్ని తగ్గించేందుకు, భూ రికార్డులను బయోమెట్రిక్ ధ్రువీకరణతో అనుసంధానించే మొబైల్ రిజిస్ట్రేషన్ యాప్లను, జీపీఎస్ ఆస్తి ట్రాకింగ్ను రాష్ట్రం ప్రవేశ పెట్టింది. డిజిటల్ వర్క్‌ఫ్లోలు అమలులో ఉన్న అడ్డంకులను ముందుగానే గుర్తించి, క్లస్టర్ పూర్తి సమయాన్ని 8.5 నెలల నుండి 4 నెలలకు తగ్గించాయి. ఈ ప్రయోజనాలు సాధించినప్పటికీ, ఈ నమూనాకు ప్లాట్‌ఫారమ్ నిర్వహణలో నిరంతర రాష్ట్ర పెట్టుబడి అవసరం క్షేత్రస్థాయి సిబ్బందికి డిజిటల్ నైపుణ్యం తప్పనిసరి. గుజరాత్ సూక్ష్మ నీటిపారుదల విస్తరణను నేరుగా సుస్థిరతకు ముడిపెట్టింది. ఏదైనా కొత్త బోర్‌వెల్ లేదా నీటిపారుదల అనుసంధానాన్ని ఆమోదించే ముందు, రాష్ట్ర జల ప్రాధికార సంస్థ సమగ్ర ప్రాథమిక భూగర్భ జల వనరుల అంచనాను తప్పనిసరి చేసింది.

రైతులు ఆర్థిక సహపెట్టుబడిదారులుగా, ఫ్రంట్లైన్ ఆస్తి నిర్వాహకులుగా ద్వంద్వ బాధ్యతను కలిగి ఉంటారు. అదేవిధంగా, 'ప్రతి చుక్కకు ఎక్కువ పంట' కార్యక్రమం ప్రతి క్లస్టర్కు 18 నుండి 24 నెలల నిర్దిష్ట కాల వ్యవధుల్లో అమలు చేయబడుతుంది. ఆ తర్వాత భూమికి సరైన నీటిపారుదల సాంకేతికతను సరిపోల్చడానికి నేల, నీటిపరీక్షలు జరుగుతాయి. కొనుగోలు ప్రక్రియ రాష్ట్రనిర్వహణలో ఉన్న పోటీ బిడ్డింగ్ వ్యవస్థల ద్వారా జరుగుతుంది, ఇవి సాధారణంగా బహిరంగ మార్కెట్ ధరల కంటే 15 నుండి 25 శాతం తక్కువ ధరలకు పరికరాలను అందిస్తాయి. మహారాష్ట్ర, తెలంగాణ వంటి రాష్ట్రాలు తమ లక్ష్యాలలో నిల కడగా 85 నుండి 92 శాతం సాధిస్తుండగా, తక్కువ సామర్థ్యం గల రాష్ట్రాలు 50 నుండి 65 శాతం వద్ద వెనుకబడి ఉన్నాయి. ఈ చర్యలు తీసుకున్నప్పటికీ, పర్యవేక్షణలో నిర్మాణాత్మక లోపాలు ఉన్నాయి. పనుల పూర్తికి సంబంధించిన కొలమానాలు తరచుగా ఆస్తుల దీర్ఘకాలిక మనుగడ కంటే పరిపాలనా వేగాన్ని కొలుస్తాయి.

పరికరాలను ఏర్పాటు చేసిన రెండు సంవత్సరాల తర్వాత పర్యవేక్షణ గణనీయంగా తగ్గిపోతుంది, బడ్జెట్ పరిమితుల కారణంగా, తృతీయ పక్షం స్వతంత్ర ఆడిట్లు పూర్తయిన క్లస్టర్లలో కేవలం 18 నుండి 22 శాతాన్ని మాత్రమే కవర్ చేస్తున్నాయి, ఆర్థికంగా, కేంద్ర ప్రభుత్వం 2015-2026 వరకు పొడిగించిన కాలానికి రూ.93 వేల కోట్లు కేటాయించింది. ఈ బడ్జెట్ను ప్రధాన నీటిపారుదల పూర్తికి 40 శాతం, సూక్ష్మ నీటిపారుదలకు 50 శాతం, సామర్థ్య పెంపునకు 10 శాతంగా విభజించారు. రాష్ట్ర కేటాయింపు సూత్రాలు సాగునీటి ఆయకట్టు ప్రాంతాలకు (50 శాతం వెయిటేజ్), వర్షాధార ప్రాంతాలకు (30 శాతం), జనాభా సాంద్రతకు (20 శాతం) ప్రాధాన్యత ఇస్తాయి. ఈ సూత్రం రాజస్థాన్, మహారాష్ట్ర, తెలంగాణ వంటి నీటి కొరత ఉన్న రాష్ట్రాలకు అసమానంగా నిధులను మళ్లిస్తుంది. ఈ రాష్ట్రాలు జాతీయ సాగు భూమిలో కేవలం 28 శాతం మాత్రమే కలిగి ఉన్నప్పటికీ, నీటిపారుదల బడ్జెట్లో 35 శాతం వాటాను పొందుతున్నాయి. మహారాష్ట్ర రైతుల వాటాలను అన్నిచోట్లా 10 నుండి 15 శాతం మధ్య ఉంచడానికి వాటాలపై భారీగా

## వివేకా హత్య కేసు.. సునీతా రెడ్డి పిటిషన్ కొట్టివేత

**హైదరాబాద్, జులై 24 ప్రభాతవార్త:** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసును మరోసారి విచారించాలని ఆయన కుమార్తె సునీతా రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను నాంపల్లి సిబిఐ కోర్టు శుక్రవారం కొట్టివేసింది. వివేకానంద రెడ్డి హత్య కేసును సిబిఐ ఇప్పటికే విచారించడంతో పాటు చార్జిషీట్ కూడా దాఖలు చేయడం తెలిసిందే. అయితే ఈ కేసును సిబిఐ సమగ్రంగా విచారించలేదని, అనేక లోపాలు వున్నాయని, చార్జిషీట్‌ను తిరస్కరించాలని సునీతా రెడ్డి సిబిఐ కోర్టును కోరారు. ఈ కేసులో చాలా మంది అనుమానితులను సిబిఐ ప్రశ్నించలేదని ఆమె తెలిపారు. దీనిపై వాదనలు వినిపించిన సిబిఐ తరపు న్యాయవాది వివేకానంద రెడ్డి హత్య కేసును అన్ని కోణాల్లో విచారించామని, నిందితులను అరెస్టు చేయడంతో పాటు చార్జిషీట్ దాఖలు చేశామని కోర్టుకు తెలిపారు. ఈ కేసులో కోర్టు ఆదేశిస్తే మరోసారి విచారిస్తామని ఆయన తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న సిబిఐ కోర్టు న్యాయమూర్తి సునీతా రెడ్డి వేసిన పిటిషన్‌ను కొట్టివేశారు.

## అమరావతిలో నిర్మాణ సామగ్రి చోరీ ముఠా అరెస్టు

**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో నిర్మాణ సామగ్రిని అపహరిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నలుగురు సభ్యులతో కూడిన ముఠాను పట్టుకున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. నిర్మాణంలో ఉన్న భవనాల్లో చోరీలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులతో నిఘా పెట్టామన్నారు. నిందితులను మేకల దుర్గాప్రసాద్, చలమచర్ల నరసింహ, తుమ్మ వెంకట్, పాలపర్తి ప్రశాంత్‌గా గుర్తించారు. వీరి నుంచి రాగి బండిల్స్, బంగారు గొలుసు, టీవీలు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై గతంలో 15 కేసులు ఉన్నాయని, వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ వెల్లడించారు. నేరాలు అరికట్టేందుకు రాజధానిలో 8 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలతో నిఘా పెంచినట్లు స్పష్టం చేశారు.

## కృషి ఉడాన్ పథకంతో చవకగా వ్యవసాయ ఉత్పత్తుల కార్గో రవాణా

### ● ఎపికి కృషి ఉడాన్ పథక ప్రయోజనాలు ● లోక్‌సభలో ఎంపి పుట్టా మహేష్ ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం



**ఏలూరు, జులై 24 ప్రభాతవార్త:** వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ వ్యయంతో, తక్కువ సమయంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చేరవేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కృషి ఉడాన్ పథకం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా మారుతోందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. లోక్‌సభలో కృషి ఉడాన్ పథకం అమలు, ఆంధ్రప్రదేశ్‌కు అందుతున్న ప్రయోజనాలపై ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పశుసంపద, ఆహార ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో, వేగంగా మార్కెట్లకు చేరవేయడం కృషి ఉడాన్ పథకం ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన విమానాశ్రయాల్లో ప్రయాణికుల విమానాలను సరుకు రవాణాకు వినియోగించే సేవలకు భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ, రక్షణ మంత్రిత్వ శాఖ ద్వారా విమానం దిగడం, నిలిపివేయడం కోసం వసూలు చేసే రుసుములతో పాటు మార్గ నిర్దేశక సదుపాయ రుసుము, టెర్మినల్ నావిగేషన్ ల్యాండింగ్ రుసుము కూడా మినహాయిస్తున్నట్లు వివరించారు.

కేంద్ర మంత్రి అందించిన వివరాల ప్రకారం రాష్ట్రంలోని విమానాశ్రయాల నుంచి వ్యవసాయ ఉత్పత్తుల సరుకు రవాణా గత రెండేళ్లలో గణనీయంగా పెరిగింది. రాజమండ్రి విమానాశ్రయం నుంచి 2023-24లో 2 మెట్రిక్ టన్నులుగా ఉన్న సరుకు రవాణా, 2025-26 నాటికి 10 మెట్రిక్ టన్నులకు చేరింది. తిరుపతి విమానాశ్రయం నుంచి అదే కాలంలో 7 మెట్రిక్ టన్నుల నుంచి 28 మెట్రిక్ టన్నులకు పెరిగింది. విజయవాడ విమానాశ్రయం నుంచి 162 మెట్రిక్ టన్నుల నుంచి 349 మెట్రిక్ టన్నులకు సరుకు రవాణా పెరిగింది. విశాఖపట్నం విమానాశ్రయం నుంచి 2023- 24లో 1,694 మెట్రిక్ టన్నులుగా ఉన్న సరుకు రవాణా 2025-26లో 1,877 మెట్రిక్ టన్నులకు చేరింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం విమానాశ్రయం నుంచే అంతర్జాతీయ సరుకు రవాణా సేవలు అందుబాటులో ఉండగా, విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల నుంచి కూడా త్వరలో అంతర్జాతీయ సరుకు రవాణా సేవలు ప్రారంభించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రి వెల్లడించారు.

కృషి ఉడాన్ పథకం ద్వారా రైతులకు తక్కువ వ్యయంతో వేగవంతమైన రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు లభిస్తున్నాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. సరుకు రవాణా పెరగడం వల్ల రైతులు, ఉత్పత్తిదారులతో పాటు విమానాశ్రయాల అభివృద్ధికీ దోహద పడుతుందని ఆయన పేర్కొన్నారు.

## 'ప్రజల వద్దకు ధర్మం'తో సనాతన సంస్కృతి వికాసం

### ● కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి



**తిరుమల, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** "ప్రజల వద్దకు ధర్మం" అనే దివ్య సంకల్పంతో విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, నైతిక విలువలు, సాంప్రదాయ కళల పట్ల అభిరుచిని పెంపొందించేందుకు నందివిద్య నటేశ్వరి కార్యక్రమం రూపొందించినట్లు కంచీ కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి తెలిపారు. విద్యార్థుల్లో కళాభిరుచి, క్రమశిక్షణ, సంస్కార విలువలను పెంపొందించే లక్ష్యంతో మృదంగం, భారతీయ నృత్య కళల సమ్మేళనంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. 2025 డిసెంబర్‌లో 50 పాఠశాలల్లో ప్రారంభమైన ఈ మహత్తర కార్యక్రమం విశేష ఆదరణతో ఈ ఏడాది వంద పాఠశాలలకు విస్తరించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలతో బాటు టిటిడి విద్యాసంస్థలు పాల్గొన్నాయి. తిరుపతి ప్రాంత పాఠశాలలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారు. నందివిద్య నటేశ్వరి నామం లలితా సహస్రనామంలోని 733, 734 నామాల నుండి ఆవిర్భవించిందని స్వామి వివరించారు. టిటిడి, హెచ్‌డిపిపి, కంచీ కామకోటి పీఠం సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లోని వంద పాఠశాలల్లో నందివిద్య నటేశ్వరి కార్యక్రమం విజయవంతమైంది. శుక్రవారం సాయంత్రం తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో విజయేంద్ర సరస్వతి స్వామి వర్చువల్ ద్వారా అనుగ్రహ భాషణం చేశారు.

సనాతన ధర్మ ప్రచారాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో యువతలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవ గాహన పెంపొందించేందుకు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి తగు ఆర్థిక సహాయంతో బాటు శ్రీవారి సుప్ర భాతం, విష్ణు సహస్రనామం, గోవింద నామాలు తదితర ఆధ్యాత్మిక గ్రంథాలను పుస్తక ప్రసాదంగా ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, జెఇఒఒ డాక్టర్ ఏ.శరత్ చెన్నైకి చెందిన ప్రముఖ మృదంగ విద్వాంసులు పద్మవిభూషణ్ డాక్టర్ ఉమయాళ్‌పురం కె. శివరామన్, ప్రముఖ భరతనాట్య కళాకారిణి రేవతి రామ్మోహన్లను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రత్యేక కళాప్రదర్శనలు ప్రేక్షకులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తాయి.

## పైడిభీమవరం పంచాయతీ నిధుల మళ్లింపుపై జెడి విచారణ

### ● రూ.7.5 కోట్ల నిధుల గోల్‌మాల్‌పై శోధన అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సిసి రోడ్లు, కాలువలు పరిశీలన



**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), జులై 24 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పరిధిలోని పారిశ్రామికవాడ పైడిభీమవరం గ్రామ పంచాయతీలో చోటు చేసుకున్న నిధుల అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ వేగవంతం చేశారు. పంచాయతీ సాధారణ నిధులకు సంబంధించి దాదాపు రూ.7.5 కోట్లు పక్కదారి పట్టాయనే ఆరోపణలపై శుక్రవారం విజయవాడ కమిషనరేట్ కార్యాలయ జాయింట్ డైరెక్టర్ (జేడీ) రామనాథ్ నేరుగా రంగంలోకి దిగారు. పైడిభీమవరం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన జేడీ రామనాథ్, రికార్డులను సమగ్రంగా పరిశీలించి విచారణ చేపట్టారు. అనంతరం పంచాయతీ నిధులతో చేపట్టినట్టు చెబుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను ఆయన స్వయంగా క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పనుల నాణ్యత, నిధుల వినియోగంపై స్థానిక అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఈ నిధుల మళ్లింపుపై వార్త పత్రికలో పలు కథనాలు వెలువడిన విషయం తెల్సిందే. ఈ పరిశీలనలో జిల్లా పంచాయతీ అధికారి స్వరూప రాణి, డివిజనల్ పంచాయతీ అధికారి గోపిబాల, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఈశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీఓ ప్రసాద్ ఉన్నారు.

## బంగారు తాళిబొట్టు భక్తురాలికి అప్పగింత



**తిరుమల, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వచ్చిన ఓ భక్తురాలు పోగొట్టుకున్న విలువైన బంగారు తాళిబొట్టును తిరుమల పోలీసులు కొంత సమయంలోనే రికవరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో వెంటనే స్పందించిన తిరుమల టూ టౌన్ పోలీసులు నగలను తిరిగి భక్తురాలికి అప్పగించారు. శ్రీవారి దర్శనానికి వచ్చిన బాపట్ల జిల్లా చీరాలకు చెందిన పద్మావతి కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు చేరుకుంది. ప్రైవేట్ వాహనంలో ప్రయాణించిన అనంతరం తమ బ్యాగ్ కనిపించకపోవడంతో తిరుమల టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన పోలీసులు కమాండ్ కంట్రోల్ సెంటర్ సహాయంతో సిసి కెమెరా దృశ్యాలను పరిశీలించి, ప్రయాణించిన వాహనాన్ని గుర్తించి తనిఖీ చేశారు. బ్యాగ్‌తో బాటు అందులో ఉన్న రూ.8 లక్షల విలువైన బంగారు తాళిబొట్టు సురక్షితంగా లభించింది. దానిని భక్తురాలికి అప్పగించారు. తమ విలువైన ఆభరణం తిరిగి లభించడంతో భక్తురాలు, ఆమె కుటుంబ సభ్యులు తిరుమల టూ టౌన్ పోలీసులు, కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎపి ప్రభుత్వ వైద్య కళాశాలలకు గ్లోబల్ గుర్తింపు


### ● లాన్సెట్‌లో కీలక పరిశోధనకు చోటు ● ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి



**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకున్నాయి. ప్రజారోగ్య రంగంలో అత్యంత కీలకమైన పోలియో టీకా సంబంధిత పరిశోధనకు ప్రపంచ ప్రఖ్యాత వైద్య జర్నల్ ది లాన్సెట్ గుర్తింపు లభించింది. ఈ పరిశోధనలో భాగస్వాములైన ఆంధ్ర, కర్నూలుమెడికల్ కాలేజీలకు అరుదైన అంతర్జాతీయ గౌరవం దక్కింది. పోలియో నియంత్రణ, టీకా ప్రభావం, ప్రజల్లో రోగనిరోధక శక్తి పెంపు వంటి అంశాలపై సాగిన ఈ కీలక పరిశోధనలో ఏపీ ప్రభుత్వ వైద్య కళాశాలలకు చెందిన వైద్య పరిశోధకులు కీలక పాత్ర పోషించారు. శాస్త్రీయ ఆధారాలతో చేసిన ఈ అధ్యయనం అంతర్జాతీయ వైద్య రంగంలో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా పరిశోధన చేసిన వైద్యులు డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ విజయానంద్‌లను మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి ప్రపంచ స్థాయి పరిశోధనలు వెలువడటం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని మిగిలిన వైద్య కళాశాలలు కూడా కొనసాగించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆకాంక్షించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పరిశోధన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు.

## రాయలసీమ మార్కెట్లకు పోటెత్తిన టమాటా

### ● డిమాండ్‌కు అనుగుణంగా ధరల హెచ్చుతగ్గులు ● రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ రవి పట్టన్ శెట్టి



**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమ టమాటా మార్కెట్లలో డిమాండ్ కు అనుగుణంగా ధరల హెచ్చుతగ్గులు నమోదయ్యాయని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ రవి పట్టన్ శెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాయలసీమ ప్రాంతంలోని పలమనేరు, వి.కోట, పుంగనూరు, మదనపల్లె, ములకలచెరువు, గుర్రంకొండ, కలికిరి, పట్టికొండ, రాప్తాడు (ప్రైవేట్ మార్కెట్), పీపుల్లి (ప్రైవేట్ మార్కెట్) మార్కెట్ యార్డులకు మొత్తం 5,564.91 మెట్రిక్ టన్నుల మొదటి రకం,6,650.17 మెట్రిక్ టన్నుల రెండవ రకం టమాటాలు చేరగా మొత్తం రాకలు 12,215.08 మెట్రిక్ టన్నులు నమోదయ్యాయని తెలిపారు.

పలమనేరు, వి.కోట, పుంగనూరు, మదనపల్లె మార్కెట్ యార్డుల్లో నాణ్యమైన టమాటా రాకతో ధరలు నిలకడగా నమోదయ్యాయని, కలికిరి మార్కెట్‌లో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడం వల్ల గత వారం కంటే మెరుగైన ధరలు లభించినప్పటికీ, నిన్నటితో పోలిస్తే స్వల్ప తగ్గుదల కనిపించిందన్నారు. ములకలచెరువు మార్కెట్‌లో గరిష్ఠ మార్కెటింగ్ సీజన్ కొనసాగుతుండటంతో రాకలు అధికంగా నమోదయ్యాయని, డిమాండ్ సరఫరా పరిస్థితులను బట్టి ధరలు నిర్ణయించబడుతున్నాయని వివరించారు.

రాప్తాడు ప్రైవేట్ మార్కెట్కు అత్యధికంగా 6,750 మెట్రిక్ టన్నుల టమాటా రాక నమోదైందని తెలిపారు. అధిక ఉత్పత్తి, స్థానిక మార్కెట్లకు భారీగా వస్తున్న సరుకు, అలాగే కర్ణాటక, చిత్తూరు, హిమాచల్ ప్రదేశ్ ప్రాంతాల నుంచి సరఫరా పెరగడం వల్ల మార్కెట్లో లభ్యత అధికమై ధరలు కొంత తగ్గినట్లు పేర్కొన్నారు. పట్టికొండ మరియు పీపుల్లి మార్కెట్లలో టమాటా రాకలు నమోదు కాలేదని తెలిపారు. సీజన్ ముగింపు దశలో ఆకస్మిక వాతావరణ మార్పులు, సాగుకు అనుకూలం కాని పరిస్థితుల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో టమాటాపై నల్ల మచ్చలు ఏర్పడి నాణ్యత దెబ్బతిన్నట్లు తెలిపారు. ఫెయిర్ క్వాలిటీ, దెబ్బతిన్న టమాటాకు వ్యాపారులు అధిక ధరలు ఇవ్వడానికి ఆసక్తి చూపడం లేదని, అయితే మంచి నాణ్యత కలిగిన టమాటాకు మాత్రం మార్కెట్లో డిమాండ్ కొనసాగు తోందని వెల్లడించారు.

రైతులు టమాటాను నాణ్యత ఆధారంగా గ్రేడింగ్ చేసి మార్కెట్‌కు తీసుకువస్తే మెరుగైన ధరలు పొందే అవకాశం ఉంటుందని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు రోజువారీ ధరలు, రాకలు, మార్కెట్ ధోరణులపై తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నట్లు ఆయన తెలిపారు.

# నేడు జింబాబ్వేతో రెండో టి20



## యువ ప్లేయర్‌పై వేటు
## భారత్ తుది జట్టులో ముగ్గురికి నిరాశే


**న్యూఢిల్లీ:** జింబాబ్వే పర్యటనను విజయంతో ఘనంగా ప్రారంభించిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. ఈ నెల 25వ తేదీన హరారే వేదికగా జరిగే రెండో టి20లో ఆతిథ్య జింబాబ్వేతో అమీతుమీ తేల్చుకోనుంది. తొలి టి20 తరహాలోనే ఏకపక్ష విజయంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకోవాలనే పట్టుదలతో భారత్ ఉంది. తద్వారా ఆఖరి మ్యాచ్‌లో బెంచ్ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాలని భారత్ భావిస్తోంది. మరోవైపు రెండో ఈ మ్యాచ్ గెలిచి సిరీస్‌పై ఆశలు సజీవంగా ఉంచుకోవాలనే పట్టుదలతో జింబాబ్వే ఉంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తొలి టి20 జరిగిన హరారే వేదికగానే ఈ మ్యాచ్ జరగనుండటంతో టీమిండియా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. కానీ తన అరంగేట్ర మ్యాచ్‌లో విఫలమైన అశోక్ శర్మ(0/29)ను తప్పించి మరో యువ పేసర్ యశ్ ఠాకూర్‌కు అవకాశం ఇవ్వొచ్చు. ఈ ఒక్కటి మినహా ఎలాంటి మార్పు జరిగే అవకాశం లేదు. దాంతో సూర్యాన్ష్ షెడ్గే, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, హర్ష్ దూబేలకు నిరాశే ఎదురు కానుంది. అభిషేక్ శర్మ మాత్రం తొలి టి20లో దారుణంగా విఫలమయ్యాడు. అతను సత్తా చాటాల్సి ఉంది. ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ పర్వాలేదనిపించగా, మిగతా బ్యాటర్లకు అవకాశం దక్కలేదు. తిలక్ వర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్ లోయరార్డర్‌లో ఆడనున్నారు. మయాంక్ యాదవ్ పేస్ విభాగాన్ని నడిపించనున్నాడు. రెండేళ్ల విరామం తర్వాత భారత జట్టులోకి వచ్చిన మయాంక్ యాదవ్ మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. అతనికి తోడుగా ప్రిన్స్ యాదవ్ కూడా సత్తా చాటాడు. కానీ తొలి మ్యాచ్ అనే బెరుకో ఏమో కానీ అశోక్ శర్మ ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. అతనికి మరో అవకాశం ఇస్తారా? లేక యశ్ ఠాకూర్ ఆడిస్తారా? అనేది చూడాలి. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా రవి బిష్ణోయ్ ఆడనున్నాడు.

**కాగా భారత్‌తో రెండో టి20 తుది జట్టు(అంచనా)**
అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, అశోక్ శర్మ/యశ్ ఠాకూర్.



## వరల్డ్ కప్‌లో.. మహిళల ఎయిర్ పిస్టల్‌లో భారత్‌కు రజతం

**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ రైఫిల్/పిస్టల్/షాట్‌గన్ టోర్నమెంట్‌లో, మహిళల పిస్టల్ ఈవెంట్‌లో షూటర్ టీమ్ రజత పతకాన్ని కైవసం చేసుకుని, ఈ టోర్నమెంట్‌లో భారతదేశానికి తొలి పతకాన్ని అందించింది. శుక్రవారం చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్‌లో భారత్ టీం ఈ విజయాన్ని సాధించింది. 22 యేళ్ల క్రీడాకారిణి ఫైనల్‌లో 243.4 పాయింట్లు సాధించి, చైనాకు చెందిన ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ కియాన్‌క్సున్ యావో (243.6 పాయింట్లు) చేతిలో 0.2 పాయింట్ల తేడాతో ఓడిపోయింది. ఇరాన్‌కు చెందిన హనియే రోస్తామియాన్ కాంస్యం గెలుచుకుంది. ఈలోగా, 137.6 పాయింట్లతో ఏడవ స్థానంలో నిలవడంతో సురుచి ఫోగట్ వరల్డ్ కప్ సర్క్యూట్‌లో తన విజయ పరంపరకు తెరపడింది. గతేడాది నుంచి ఆమె నాలుగు వరల్డ్ కప్, వరల్డ్ కప్ ఫైనల్ టైటిళ్లను గెలుచుకుంది. అంతకుముందు, రెండుసార్లు ఒలింపియన్‌గా నిలిచిన మను భాకర్, ఆర్పిఓ అథ్లెట్‌గా పోటీపడి, క్వాలిఫికేషన్ రౌండ్‌లో 582 పాయింట్ల స్కోరుతో ఓవరాల్‌గా నాలుగో స్థానంలో నిలిచింది. 579 పాయింట్లతో ఫైనల్స్‌కు అర్హత సాధించిన సురుచి టీమ్ వరుసగా ఏడవ, ఎనిమిదవ స్థానాల్లో నిలిచారు. తొలి ఐదుషాట్ల సిరీస్ తర్వాత, అనుభవజ్ఞురాలైన సురుచి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉండగా, సైన్యం ఐదవ స్థానంలోనిలిచింది. అయితే, ఐదు షాట్‌ల రెండవ సిరీస్‌లో అద్భుతమైన 51.9 స్కోరు సాధించడంతో, సైన్యామ్ 101.6 పాయింట్లు ఓవరాల్ స్కోరుతో యావోతో కలిసి అగ్రస్థానానికి చేరుకుంది. ఆ తర్వాత 16 షాట్‌ల తర్వాత, సైన్యామ్ యావో కంటే 1.2 పాయింట్లు వెనుకబడింది. కానీ అద్భుతమైన సంయమనం ప్రదర్శించి ఆ అంతరాన్ని క్రమంగా తగ్గించుకుంటూ వచ్చి, చివరికి కేవలం 0.2 పాయింట్ల తేడాతో వెనుకబడి రజత పతకాన్ని కైవసం చేసుకుంది.



## ప్రపంచ స్క్వాష్.. సెమీఫైనల్స్‌కు అనాహత్

**న్యూఢిల్లీ:** భారత టాప్ సీడ్ అనాహత్ సింగ్, ఈజిప్టుకు చెందిన హబీబా రిజ్క్‌ను ఓడించి, 2026 ప్రపంచ జూనియర్ వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌లలో తన అద్భుతమైన ప్రచారాన్ని కొనసాగిస్తూ సెమీ ఫైనల్స్‌లో అర్హతతో స్థానం సంపాదించుకుంది. మహిళల ప్రపంచ 20వ ర్యాంకర్ అనాహత్ శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో హబీబాను 11-7, 11-5, 6-11, 11-9 తేడాతో ఓడించింది. ఆమె ప్రపంచ జూనియర్స్ టోర్నమెంట్‌లో వరుసగా రెండు సెమీఫైనల్స్‌కు చేరిన తొలి భారతీయ క్రీడాకారిణిగా నిలవడమే కాకుండా, టైటిల్ గెలుచుకోవడానికి బలమైన ఫేవరెట్‌గా నిలిచింది. మరోవైపు, చైనాకు చెందిన హాంకాంగ్ క్రీడాకారిణి హెలెన్ టాంగ్, బెల్జియం క్రీడాకారిణి సవన్నా మోక్సామ్‌లపై వరుస గేమ్‌లలో విజయం సాధించిన తర్వాత బార్బ్ సమేహ్, మాలికా ఎల్కరక్సీ ముందంజ వేశారు. అలాగే, ఈజిప్ట్‌కు చెందిన రెండో సీడ్ ఆడమ్ హవాల్, సౌదీ అరేబియాకు చెందిన మహమ్మద్ అల్నాస్‌ఫాన్‌పై 3-1 తేడాతో గెలిచి ముందంజ వేశాడు.
పురుషుల విభాగంలో, ఫ్రాన్స్‌కు చెందిన అమీర్ ఖలీద్‌జౌసెలిన్‌తో జరిగిన హోరాహోరీ పోరులో ఈజిప్ట్‌కు చెందిన మర్వాన్ అస్సల్ చివరి నాలుగు స్థానాల్లోకి ప్రవేశించాడు. అతనితో పాటు, అతని స్వదేశీయుడు మరియు నెం. 2 సీడ్ అయిన రుఖయ్యా సలేం కూడా తదుపరి రౌండ్‌కు చేరుకున్నాడు. మలేషియాకు చెందిన విట్నీ విల్సన్‌తో జరిగిన హోరాహోరీ పోరులో ఐదు గేమ్‌ల పాటు సాగిన మ్యాచ్‌లో సలేం ముందంజ వేసింది.

## కామన్వెల్త్ గేమ్స్.. సెమీఫైనల్‌కు శ్రీహరి



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ 2026లో శ్రీహరి నటరాజ్ సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. గ్లాస్గోలో శుక్రవారం జరిగిన కామన్వెల్త్ గేమ్స్ 2026 పురుషుల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో భారత క్రీడాకారుడు శ్రీహరి సెమీఫైనల్‌కు అర్హత సాధిం చాడు. 25 ఏళ్ల అతను తన హీట్‌లో 25.52 సమయంతో ఐదవ స్థానంలో నిలిచాడు, కానీ ఐదు హీట్‌ల మొత్తం పాయింట్లలో 14వ స్థానంలో నిలిచి తదుపరి దశకు అర్హత సాధించాడు. ఇంగ్లాండ్‌కు చెందిన ఆలివర్ మోర్గాన్ 24.91 సెకన్ల సమయంతో నటరాజ్ హీట్ 4ను గెలుచుకున్నాడు. దక్షిణాఫ్రికాకు చెందిన పీటర్ కోట్జీ 24.45 సెకన్ల గేమ్స్ రికార్డు సమయంతో మొదటి రౌండ్ తర్వాత అత్యంత వేగంగా నిలిచాడు. అంతకుముందు, భారత క్రీడాకారులు ఆర్వీవీబీకే బుడిగిన, ఇమామ్ అలీ పురుషుల 100 ఫ్రీస్టైల్ ఎస్13 హీట్స్‌లో వరుసగా మూడవ, ఎనిమిదవ స్థానాల్లో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు. బుడిగిన 57.10 సమయంతో ముగించగా, అతని సహచరుడు అలీ 1:05.32 సమయాన్ని నమోదు చేశాడు. స్కాట్లాండ్‌కు చెందిన స్టీఫెన్ క్లైగ్ 56.57 సమయంతో అగ్రస్థానంలో నిలిచాడు. ఈ హీట్‌లో పాల్గొన్న ఎనిమిది మంది ఫైనల్‌కు అర్హత సాధించారు.


## పురుషుల పారా పవర్ లిఫ్టింగ్.. నాలుగో స్థానంలో అశోక్



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ 2026 రెండవ రోజున జరిగిన పురుషుల లైట్‌వెయిట్ పారా పవర్‌లిఫ్టింగ్ ఈవెంట్‌లో భారత క్రీడాకారుడు అశోక్ నాలుగో స్థానంలో నిలిచి, పతకాన్ని తృటిలో కోల్పోయాడు. గ్లాస్గోలో శుక్రవారం భారతదేశానికి తొలి పతకాలు అందించే ఈవెంట్లలో ఒకదానిలో పోటీపడిన అశోక్, తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనగా 200 కేజీల బరువును ఎత్తి, 143.8 పాయింట్లను సాధించి, పతకానికి కొద్ది దూరంలో నిలిచాడు. అతను మొదట 195 కిలోల బరువును విజయవంతంగా ఎత్తి, రెండవ ప్రయత్నంలో 200 కిలోలకు పెంచాడు. ఆ భారత క్రీడాకారుడు 205 కిలోల వద్ద చివరి ప్రయత్నం చేసినప్పటికీ, ఆ బరువును ఎత్తలేకపోయాడు. స్వదేశీయుడైన పరంజీత్ కుమార్ తన తొలి ప్రయత్నంలో 176 కేజీలు ఎత్తి 135.6 పాయింట్లతో ఏడవ స్థానంలో నిలిచాడు. అతను 179 కేజీల వద్ద తన రెండవ మరియు మూడవ ప్రయత్నాలలో విఫలమై, కేవలం ఒకే చెల్లుబాటు అయ్యే లిఫ్ట్‌తో పోటీని ముగించాడు. ఈ ఈవెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారిలో ఇంగ్లండ్‌కు చెందిన మార్క్ స్వాన్ ఒకరు. అతను 222 కిలోల బరువును విజయవంతంగా ఎత్తి కొత్త యూరోపియన్ రికార్డును నెలకొల్పాడు. మరోవైపు, టీమ్ ఫైనల్‌లో భారత పురుషుల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ జట్టు తమ అద్భుత ప్రదర్శనను కొనసాగించింది. తపన్ మొహంతి, యోగేశ్వర్ సింగ్, తాపేశ్వర్నాథ్ దాస్ మరియు స్వాతిష్ కేపీల బృందం ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ (32.250), పోమెల్ హార్స్ (31.250), రింగ్స్ (36.050) మరియు వాల్ట్ (37.750) విభాగాలలో తమ ఉపవిభాగాలను పూర్తి చేసిన జట్లలో అగ్రస్థానంలో నిలిచారు,

## మార్కెట్లలో వరుసగా ఐదో రోజు నష్టాలు

### సెన్సెక్స్ 332 పాయింట్లు, నిఫ్టీ 102 పాయింట్లు డౌన్



**ముంబయి,జులై 24:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం ట్రేడింగ్‌లో ఇంట్రాడే కనిష్ట స్థాయిల నుంచి కొంత కోలుకున్నప్పటికీ, చివరికి వరుసగా ఐదో రోజు నష్టాలతో ముగిశాయి. ముడి చమురు ధరలపై ఆందోళనలు, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపరిచాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బిఎస్‌ఇ సెన్సెక్స్ 331.62 పాయింట్లు లేదా 0.43 శాతం క్షీణించి 76,059.77 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 102.15 పాయింట్లు పడిపోయి 23,767.45 వద్ద స్థిరపడింది. గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 2.67 శాతం, నిఫ్టీ 2.32 శాతం మేర నష్టపోయాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.16 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 0.23 శాతం క్షీణించాయి. మార్కెట్ బ్రెడ్త్ మాత్రం సానుకూలంగా నమోదైంది. ఎన్ఎస్ఇలో 1,703 షేర్లు లాభపడగా, 1,596 షేర్లు నష్టపోయాయి. 126 షేర్లు యథాతథంగా ముగిశాయి. కమోడిటీ మార్కెట్లో సెప్టెంబర్ డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 97.48 డాలర్లకు తగ్గింది. రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. గత ముగింపు 96.73 తో పోలిస్తే 96.56కు బలపడింది. బంగారం ధరలు ఎంసిఎక్స్‌లో స్వల్ప లాభాలతో ట్రేడయ్యాయి. 0.3శాతం బలపడి రూ.1,43,308కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ ధోరణి కనిపించింది. యూరప్ మార్కెట్లు లాభాల్లో ట్రేడవగా, ఆసియా మార్కెట్లు ఎక్కువగా నష్టాల్లో ముగిశాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు, ఎర్ర సముద్రంలో హౌతీ మిలిటెంట్ల దాడులు, హర్మూజ్ జలసంధిపై ఉద్రిక్తతలు ప్రపంచ మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయి. ఇదే సమయంలో అమెరికాఇరాన్ మధ్య కొనసాగుతున్న ఘర్షణలు, అమెరికా విధించిన కొత్త దిగుమతి సుంకాలు కూడా ఇన్వెస్టర్లలో ఆందోళన పెంచుతు న్నాయి. కార్పొరేట్ రంగంలో ఇన్ఫోసిస్ షేరు 0.80 శాతం పడిపోయింది. కంపెనీ తొలి త్రైమాసిక నికర లాభం తగ్గినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్టుల్లో బలమైన ఆర్డర్లు లభించాయని యాజమాన్యం తెలిపింది. లారస్‌ల్యాబ్స్, వెండ్ట్, అతుల్, ఐఈఎక్స్, ఎపిఎఆర్ ఇండస్ట్రీస్ వంటి కంపెనీల షేర్లు లాభపడగా, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, రూట్ మొబైల్, ఫ్రాక్టల్ అనలిటిక్స్ షేర్లు

## మార్కెట్‌లోకి బ్రెజ్జా కొత్త వెర్షన్



**ముంబయి,జులై 24:** మారుతి సుజుకి భారత మార్కెట్లో కొత్త బ్రెజ్జా ఫేస్‌లిఫ్ట్ వెర్షన్‌ను అధికారికంగా విడుదల చేసింది. కొత్త డిజైన్, మరిన్ని ప్రీమియం ఫీచర్లు, మెరుగైన భద్రతా వ్యవస్థతో ఈ ఎస్‌యూవీని తీసుకొచ్చింది. బ్రెజ్జా ఎల్ఎక్స్ఐ, విఎక్స్ఐ, జడ్ఎక్స్ఐ అనే నాలుగు వేరియంట్లలో లభిస్తుంది. రూ.11,000 టోకెన్‌తో బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. డిజైన్ పరంగా ముందు భాగంలో కొత్త గ్రిల్, రీడిజైన్‌చేసిన బంపర్, కొత్త ఎల్ఇడి హెడ్‌ల్యాంప్స్, డీఆర్ఎల్స్ ఆకట్టుకుంటున్నాయి. కొత్త అలాయ్ వీల్స్‌తో పాటు వెనక భాగంలో టెయిల్ ల్యాంప్ డిజైన్‌ను కూడా మార్చారు. క్యాబిన్‌లో బ్లాక్‌బ్రౌన్ డ్యూయల్ టోన్ థీమ్‌ను కొనసాగిస్తూ 10.1 అంగుళాల టచ్‌స్క్రీన్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే, అలెక్సా సపోర్ట్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, వైర్‌లెస్ ఛార్జర్, ఆటో క్లైమేట్ కంట్రోల్, 360 డిగ్రీ కెమెరా వంటి ప్రీమియం ఫీచర్లను జోడించారు. భద్రతకు కూడా కంపెనీ పెద్దపీట వేసింది. అన్ని వేరియంట్లలో 6 ఎయిర్‌బ్యాగ్స్, ఇఎస్‌పి, హిల్ హోల్డ్ అసిస్ట్, ఎబిఎస్‌ఇబిడి, చైల్డ్ సీట్ మౌంట్స్, టిపిఎంఎస్, బ్లైండ్ స్పాట్ వార్నింగ్, రియర్ క్రాస్ ట్రాఫిక్ అలర్ట్, సేఫ్ ఎగ్జిట్ వార్నింగ్, ఫ్రంట్ పార్కింగ్ సెన్సర్లు వంటి ఫీచర్లు ఉన్నాయి. ఈ కొత్త బ్రెజ్జాకు భారత్ ఎన్‌సిఎపిలో 5స్టార్ సేఫ్టీ రేటింగ్ కూడా లభించింది. ఇంజిన్ పరంగా 1.5లీటర్ పెట్రోల్, 1.0లీటర్ టర్బో పెట్రోల్, సీఎన్‌జీ అనే మూడు ఆప్షన్లు ఇవ్వనున్నట్లు కంపెనీ తెలిపింది. పెట్రోల్ మోడళ్లకు 6స్పీడ్ మాన్యువల్, 6స్పీడ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌లు అందుబాటులో ఉంటాయి. సిఎన్‌జీ వేరియంట్‌కు మాన్యువల్ గేర్‌బాక్స్ మాత్రమే ఉంటుంది.

## శ్రీరామ్ ఫైనాన్స్ లాభం రూ.3,445 కోట్లు





**ముంబయి,జులై 24:** ప్రైవేట్ నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థ శ్రీరామ్ ఫైనాన్స్ తొలి త్రైమాసికం బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. కంపెనీ ఏకీకృత నికర లాభం, నికర వడ్డీ ఆదాయం గణనీయంగా పెరగగా, ఆస్తుల నాణ్యత కూడా మెరుగుపడింది. వ్యాపార అవసరాల కోసం దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో రుణ పత్రాల జారీ ద్వారా నిధుల సమీకరణకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. జూన్‌తో ముగిసిన త్రైమా సికంలో కంపెనీ స్టాండ్‌అలోన్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 59.8శాతం పెరిగి రూ.3,445 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.2,156 కోట్లు కాగా, గత త్రైమాసికంలోని రూ.3,014 కోట్లతో పోలిస్తే 14.3 శాతం వృద్ధి నమోదైంది. కంపెనీ నికర వడ్డీ ఆదాయం గత యేడాది రూ.6,026 కోట్ల నుంచి 33.7 శాతం పెరిగి రూ.8,056 కోట్లకుచేరింది. గత త్రైమాసికం లోని రూ.6,899 కోట్లతో పోలిస్తే 16.8 శాతం అధికంగా నమోదైంది. సమయంలో నికర వడ్డీ మార్జిన్ గత యేడాది 8.11 శాతం నుంచి 9.04 శాతానికి పెరిగింది. మార్చి త్రైమాసికంలో ఇది 8.61 శాతంగా నమోదైంది. కంపెనీ ఆపరేటింగ్ లాభం కూడా వార్షిక ప్రాతిపదికన 45.2 శాతం పెరిగి రూ.6,085 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.4,192 కోట్లు కాగా, గత త్రైమాసికంతో పోలిస్తే 14.3 శాతం వృద్ధి నమోదైంది. స్థూల నిరర్థక ఆస్తులు 4.64 శాతంగా నమోదయ్యాయి. గత యేడాది ఇదే కాలంలో ఇవి 4.53 శాతం, మార్చి త్రైమాసికంలో 4.58 శాతంగా ఉన్నాయి. నికర నిరర్థక ఆస్తులు గత యేడాది 2.57 శాతం నుంచి 2.33 శాతానికి మెరుగుపడ్డాయి. మార్చి త్రైమాసికంతో పోలిస్తే ఈ స్థాయి యథాతథంగా కొనసాగింది. రుణ పత్రాల ద్వారా నిధుల సమీకరణకు బోర్డు ఆమోదంవ్యాపార విస్తరణ, నిధుల అవసరాల దృష్ట్యా ఆగస్టు 1 నుంచి అక్టోబర్ 31 వరకు దేశీయ, విదేశీ మార్కెట్లలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ విడతల్లో రిడీమబుల్ నాన్‌కన్వర్టిబుల్ డిబెంచర్లు (ఎన్సీడీ), సబార్డినేటెడ్ డిబెంచర్లు, బాండ్లు, నోట్లు మరియు ఇతర రుణ సాధనాల జారీ ద్వారా నిధులు సమీకరించే ప్రణాళికకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. అదనంగా, జపాన్‌కు చెందిన ఎంయుఎఫ్‌జి సంస్థకు చేసిన ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ.37,451 కోట్లను కంపెనీ ఈ త్రైమాసికంలో వినియోగించినట్లు వెల్లడించింది. మిగిలిన రూ.2,167 కోట్లను లిక్విడ్ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టినట్లు తెలిపింది.

## రూ.81 వేల కోట్లతో ఆర్గనాన్ కొనుగోలుకు సన్‌ఫార్మా డీల్

**ముంబయి,జులై 24:** భారత ఔషధ దిగ్గజం సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ ప్రతిపాదించిన అమెరికాకు చెందిన ఔషధ సంస్థ ఆర్గనాన్ కొనుగోలు ఒప్పందానికి ఆ సంస్థ షేర్‌హోల్డర్లు ఆమోదం తెలిపారు. దీంతో సన్ ఫార్మా చరిత్రలోనే అతిపెద్ద కొనుగోలు ప్రక్రియ పూర్తి దిశగా మరో కీలక ముందడుగు పడింది. ఈయేడాది ఏప్రిల్‌లో ప్రకటించిన ఈ ఒప్పందం మొత్తం విలువ అప్పులతో కలిపి సుమారు 9.4 బిలియన్ డాలర్లు అంటే సుమారు దాదాపు రూ.81 వేలకోట్లకు పైగా ఉంది. అవసరమైన నియంత్రణ సంస్థల అనుమతులు సహా మిగిలిన అన్ని ప్రక్రియలు పూర్తయితే ఈ కొనుగోలు 2027 ఆరంభంలో పూర్తయ్యే అవకాశం ఉందని సన్ ఫార్మా తెలిపింది. ప్రస్తుతం ఈ గడువులో ఎలాంటి మార్పు లేదని కంపెనీ స్పష్టం చేసింది. 2014లో రాన్‌బాక్సీ ల్యాబొరేటరీస్ కొనుగోలును అధిగమిస్తూ, ఆర్గనాన్ కొనుగోలు సన్ ఫార్మా చరిత్రలోనే అతిపెద్ద విలీన ఒప్పందంగా నిలవనుంది. ప్రత్యేక ఔషధాలు, జనరిక్ మందులకే పరిమితమైన వ్యాపారాన్ని మరింత విస్తరించి, ప్రపంచ వ్యాప్తంగా తమ ఉనికిని బలోపేతం చేయడమే ఈ కొనుగోలు వెనుక ప్రధాన ఉద్దేశమని సంస్థపేర్కొంది. ముఖ్యంగా మహిళల ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులు, ఇప్పటికే మార్కెట్లో స్థిరంగా ఉన్న ఔషధ విభాగాల్లో సన్ ఫార్మా మరింత బలమైన స్థానాన్ని సంపాదించనుంది. అలాగే అభివృద్ధి చెందినదేశాల మార్కెట్లలో కంపెనీఉనికి మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. మెర్క్ అండ్ కో. నుంచి 2021లో విడిపోయిన ఆర్గనాన్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా మహిళల ఆరోగ్య ఉత్పత్తులు, బయోసిమిలర్లు, ఇప్పటికే స్థిరపడిన పలు బ్రాండ్ ఔషధాలను విక్రయిస్తోంది.

## దేశీయ మార్కెట్‌కు హోండా 10 కొత్త టూవీలర్లు




**ముంబయి,జులై 24:** భారత మార్కెట్లో పట్టు మరింత పెంచేందుకు హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా ఒకేసారి 10 కొత్త టూ వీలర్లను ప్రకటించింది. వీటిలో ఏడు పూర్తిగా కొత్త మోడళ్లు, మూడు అప్‌డేటెడ్ బైక్‌లు ఉన్నాయి. స్కూటర్, రోడ్‌స్టర్, క్రూజర్, అడ్వెంచర్, ఎలక్ట్రిక్, ఫ్లెక్స్ ఫ్యూయల్ ఇలా దాదాపు అన్ని సెగ్మెంట్లలోనూ కొత్త ఉత్పత్తులను తీసుకొచ్చింది. ధరలు, విడుదల తేదీలను దశలవారీగా ప్రకటించనున్నది. నగర ప్రయాణాలతో పాటు అడ్వెంచర్ రైడింగ్‌కు అనువుగా రూపొందించిన 160 సిసి స్కూటర్. 27 లీటర్ల అండర్‌సీట్ స్టోరేజ్, 8.1 లీటర్ల ఫ్యూయల్ ట్యాంక్ దీని ప్రత్యేకతలు. ఈ85 ఇంధనానికి సపోర్ట్ చేసే భారత తొలి స్కూటర్‌గా హోండా పేర్కొంది. సిబి 500 రెట్రో డిజైన్‌తో కూడిన ప్రీమియం రోడ్‌స్టర్. 501 సిసి సింగిల్ సిలిండర్ ఇంజిన్‌తో వస్తుంది. అలాయ్, స్పోక్ ట్యూబ్‌లెస్, గ్రాఫిక్స్‌తో కూడిన స్పోక్ ట్యూబ్‌లెస్ అనే మూడు వేరియంట్లలో అందుబాటులోకి రానుంది. లైఫ్‌స్టైల్ క్రూజర్‌గా రూపొందించిన ఈ బైక్‌లో 286 సిసి లిక్విడ్ కూల్డ్ ఇంజిన్ ఉంది. స్టాండర్డ్, ఈక్లచ్ వేరియంట్లలో విడుదల కానుంది. రెబెల్ 300 డిజైన్‌కే పెద్ద ఇంజిన్‌ను జోడించారు. ఇందులో 471 సిసి ట్విన్ సిలిండర్ లిక్విడ్ కూల్డ్ ఇంజిన్ ఉంటుంది. ఎక్కువ పవర్ కోరుకునే క్రూజర్ ప్రియులను లక్ష్యంగా రూపొందించారు. ఆఫ్‌రోడ్, రోజువారీ ప్రయాణాలకు సరిపోయే డ్యూయల్ పర్పస్ బైక్. 293.5 సిసి ఇంజిన్, లాంగ్ ట్రావెల్ సస్పెన్షన్‌తో వస్తుంది. తక్కువ బరువు, సులభమైన హ్యాండ్లింగ్ దీని ప్రత్యేకత. ఎక్స్‌ఆర్300 ర్యాలీ బైక్ అడ్వెంచర్ టూరింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన మోడల్. క్యూసీ3 ఎలక్ట్రిక్ స్కూటర్‌తో కుటుంబ అవసరాలకు అనువైన ఈవీ స్కూటర్. 151 కిలోమీటర్ల ఐడీసీ రేంజ్, 32 లీటర్ల స్టోరేజ్ సామర్థ్యంతో వస్తుంది. అదనంగా సీబీ350, సీబీ350సీ, సిబి 350ఆర్ఎస్ మోడళ్లను కొత్త రంగులతో అప్‌డేట్ చేసింది.

## డిసిబి బ్యాంక్ నికర లాభం 35.5 శాతం పెరుగుదల




**ముంబయి,జులై 24:** ప్రైవేట్ రంగంలోని డిసిబి బ్యాంక్ మెరుగైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. రుణ నష్టాల కోసం చేసిన కేటాయింపులు (ప్రొవిజన్లు) గణనీయంగా తగ్గడం, నిరర్థక ఆస్తుల (ఎన్‌పిఎలు) నాణ్యత మెరుగుపడటంతో బ్యాంక్ లాభదాయకత పెరిగింది. ఈ త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం రూ.213 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.157 కోట్లతో పోలిస్తే 35.5 శాతం వృద్ధి సాధించింది. బ్యాంక్‌కు ప్రధాన ఆదాయ వనరైన నికర వడ్డీ ఆదాయం కూడా 17.7 శాతం పెరిగి రూ.684 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.581 కోట్లుగా ఉంది. ఆస్తుల నాణ్యతలో కూడా మెరుగుదల కనిపించింది. స్థూల నిరర్థక ఆస్తుల (గ్రాస్ ఎన్‌పిఎ) నిష్పత్తి మార్చి చివరినాటి 2.45 శాతం నుంచి 2.43 శాతానికి తగ్గింది. అలాగే నికర ఎన్‌పిఎ నిష్పత్తి 0.89 శాతం నుంచి 0.84 శాతానికి తగ్గి బ్యాంక్ రుణాల నాణ్యత మెరుగుపడినట్లు వెల్లడించింది. రుణ నష్టాల కోసం చేసిన ప్రొవిజన్లు గత యేడాది రూ.115 కోట్ల నుంచి ఈసారి రూ.57 కోట్లకు తగ్గాయి. గత త్రైమాసికంలో నమోదైన రూ.69 కోట్లతో పోల్చినా ఇవి తగ్గడం బ్యాంక్ లాభాల పెరుగుదలకు తోడ్పడింది. వ్యాపార వృద్ధి కూడా బలంగా కొనసాగిందని బ్యాంక్ తెలిపింది. రుణాల పంపిణీ వార్షిక ప్రాతిపదికన 17 శాతం, డిపాజిట్లు 20 శాతం పెరిగాయి. బాసెల్3 ప్రమాణాల ప్రకారం మూలధన సమృద్ధి నిష్పత్తి 17.03 శాతంగా నమోదై, బ్యాంక్ ఆర్థిక స్థితి బలంగా ఉందని వెల్లడించింది. డిసిబి బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ ప్రవీణ్ కుట్టి మాట్లాడుతూ, డిపాజిట్లు, రుణాల వృద్ధి బలంగా కొనసాగుతోందన్నారు.
లాభదాయకతకు సంబంధించిన దాదాపు అన్ని సూచీల్లో గణనీయమైన మెరుగుదల నమోదైందని, గత యేడాదితో పోలిస్తే పన్నుల అనంతర లాభం 36 శాతం పెరిగిందని తెలిపారు. అంతేకాకుండా, తక్కువ క్రెడిట్ ఖర్చులు, మెరుగైన రుణాల నాణ్యత కారణంగా బ్యాంక్ వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ అత్యధిక త్రైమాసిక లాభాన్ని నమోదు చేసిందని, ఈక్విటీపై రాబడి కూడా మెరుగుపడిందని ఆయన వెల్లడించారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14